ఆంధ్రభూమి

THAILAND PACKAGE with 1N Free in SRILANKA. INR 42,999* Per Person.
*AVAIL FREE VISA ON ARRIVAL TILL 30APR AT BANGKOK AIRPORT
Above cost includes : 5Nights / 6Days
Airfare ex Hyderabad on SriLankan Airlines / Airport Taxes.
Airport transfers / 3N Pattaya - 1N Bangkok - 1N Negambo
Stay in 3* Hotel with Breakfast / Coral island tour with lunch
City tour of Bangkok.
*Terms and conditions apply:
Min 2 Pax travel together / Valid for travel till 30Apr.
Govt Taxes extra / Visa charges extra.
Rates are subject to change.
Contact us @ Hyd office : 040 23311495 / 9553304546.
SriLankan Holidays

సంపుటి: 30 . సంచిక: 247 | విజయవాడ సిటీ | హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, రాజమహేంద్రవరం, అనంతపురం, కరీంనగర్, నెల్లూరు | www.andhrabhoomi.net | బుధవారం 6 ఫిబ్రవరి, 2019 | 20 పేజీలు | ధర: రూ.3.00

శుభోదయం

కలియుగం - 5120
శాలివాహన శకం - 1940
శ్రీ చాంద్రమాన విలంబ నామ సంవత్సరం
ఉత్తరాయణం, శిశిరఋతువు, మాఘమాసం
తిథి: శుద్ధ విదియ రా. తె. 5.29
నక్షత్రం: ధనిష్ఠ ఉ. 7.38
వర్జ్యం: మ.3.35 నుండి 5.21 వరకు
దుర్ముహూర్తం: ఉ.11.36 నుండి 12.24 వరకు
రాహుకాలం: మ.12.00 నుండి 1.30 వరకు



లాభసాటిగా వ్యవసాయం

- కేంద్రం సహకారం లేకపోయినా సాగు విస్తీర్ణాన్ని పెంచా
- శాసనసభలో సీఎం చంద్రబాబు

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, ఫిబ్రవరి 5: వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేస్తానని, ప్రతి రైతు కళ్లల్లో ఆనందాన్ని నింపటమే తన ముందున్న కర్తవ్యమని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. మరో నాలుగేళ్లలో కోటి ఎకరాల్లో సేంద్రియ వ్యవసాయాన్ని చూపిస్తానని, ప్రపంచానికే ఏపీ ఆదర్శంగా ఉంటుందన్నారు. వ్యవసాయ రంగం, అభివృద్ధిపై శాసనసభలో మంగళవారం జరిగిన లఘు చర్చలో ముఖ్యమంత్రి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం నుండి ఎలాంటి సహకారం లేదని, కనీసం తుపాను ప్రాంత రైతులను కూడా ఆదుకోలేకపోయిందన్నారు. ప్రధాని మోదీతోపాటు ఆర్‌బీఐ అడ్డుపెట్టినా దేశంలోనే తొలిసారిగా రూ.24వేల కోట్ల మేర రైతు రుణ మాఫీ చేసామన్నారు. కాంగ్రెస్

- మిగతా 6వ పేజీలో



జీవీఎల్‌పై హక్కుల నోటీసు

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, ఫిబ్రవరి 5: బీజేపీ రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు నరసింహారావుపై తాడికొండ టీడీపీ ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ మంగళవారం సభాహక్కుల ఉల్లంఘన నోటీసు ఇచ్చారు. ఈ నెల 2న ట్విటర్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని 'అసెంబ్లీ రౌడీ' అంటూ జీవీఎల్ సంబోధించారని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ 169 రూల్ కింద సభా హక్కుల నోటీసును స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాద్‌కు అందజేశారు. మానసిక ఆందోళన, ఓటమి భయంతో ఉన్న ముఖ్యమంత్రి.. తమ పార్టీ ఎమ్మెల్యేలు విష్ణుకుమార్ రాజు, మాణిక్యాలరావులను బెదిరించారంటూ జీవీఎల్ వ్యాఖ్యానించారన్నారు. పైగా బాబు ప్రవర్తన చూస్తుంటే ఆయన పిచ్చి తీవ్రస్థాయికి చేరినట్టుందని, అసెంబ్లీ రౌడీలా

- మిగతా 6వ పేజీలో

ఘనగోష



అసలు వాళ్ల మీద వాళ్లకి విశ్వాసం లేకేగా.. ఈ రగడంతా..!



ఢిల్లీలోనే తేల్చుకుంటాం

కోల్‌కతా, ఫిబ్రవరి 5: 'ఇక ఢిల్లీలోనే తేల్చుకుంటాం' అంటూ పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ గర్జించారు. ప్రధాని నరేంద్ర మోదీని గద్దె దించే వరకూ తన పోరాటం ఆగదని ఉద్ఘాటించిన మమత సుప్రీం కోర్టు తాజా ఉత్తర్వు నేపథ్యంలో మంగళవారం తన రెండు రోజుల ధర్నాను విరమించారు. శారత చిట్‌ఫండ్ అవినీతి కేసులో కోల్‌కతా పోలీస్ చీఫ్ రాజీవ్ కుమార్ సీబీఐ విచారణకు హాజరు కావాలని ఆదేశించడంతో పాటు ఆయన్ని అరెస్టు చేయకూడదని, ఎలాంటి ఒత్తిళ్లకు గురి చేయవద్దంటూ సర్వోన్నత న్యాయ స్థానం జారీ చేసిన ఉత్తర్వు తన నైతిక విజయమని మమత అభివర్ణించారు. సుప్రీం కోర్టు సానుకూల తీర్పు నేపథ్యంలో అన్ని భావసారూప్యం కలిగిన అన్ని పార్టీలతో చర్చించిన మీదటే ధర్నా విరమించాలని నిర్ణయించుకున్నానని చెప్పారు. 'నేను వెనక్కి తగ్గేది లేదు. మోదీని తొలగించి దేశాన్ని రక్షించే వరకూ ఉద్యమిస్తా.. నా ధర్నా భారతదేశం, ప్రజలు, ప్రజాస్వామ్యం సాధించిన విజయం.. ఈ పోరాటాన్ని ఢిల్లీకి తీసుకెళతా'నని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో మమత అన్నారు. విచారణ క్రమంలో రాజీవ్ కుమార్‌పై ఎలాంటి వత్తిళ్లు తేవద్దని, అరెస్టు చేయవద్దని సుప్రీం కోర్టు చెప్పడం తన నైతిక

- మిగతా 6వ పేజీలో

కోల్‌కతాలో మంగళవారం మమతా బెనర్జీకి సంఘీభావం తెలుపుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

- మోదీని దించేదాకా పోరాటం ఆగదు
- సుప్రీం తీర్పు ప్రజా విజయం: మమత
- ధర్నాను విరమించిన బెంగాల్ సీఎం
- ప్రమాదంలో ప్రజాస్వామ్యం: చంద్రబాబు
- ఢిల్లీలో 13న విపక్ష నేతల భేటీ

సీబీఐ ముందు హాజరు కావాల్సిందే

కోల్‌కతా పోలీస్ కమిషనర్‌కు సుప్రీం ఆదేశం 8

సంక్షేమం.. అభివృద్ధి

రాష్ట్ర బడ్జెట్ రూ.2,26,177.53 కోట్లు



అసెంబ్లీలో బడ్జెట్ ప్రతిపాదనలు చదువుతున్న ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు

ఆంధ్రభూమి బ్యూరో

అమరావతి, ఫిబ్రవరి 5: వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2019-20) 2,26,177.53 కోట్ల రూపాయల అంచనాతో ప్రభుత్వం ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. మంగళవారం శాసనసభలో ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు, మండలిలో పురపాలకశాఖ మంత్రి పి నారాయణ బడ్జెట్ ప్రతిపాదనలను సభ్యులకు చదివి వినిపించారు. గతంలో ఎన్నడూ లేని రీతిలో ప్రభుత్వం ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో సంక్షేమంతోపాటు అభివృద్ధికి పెద్దపీట వేసింది. అంచనా బడ్జెట్‌లో రెవెన్యూ వ్యయం రూ.1,80,369.33 కోట్లు కాగా పెట్టుబడి వ్యయం రూ.29,596.33 కోట్లు, రెవెన్యూ మిగులు రూ.2,099.47 కోట్లు కాగా ఆర్థిక లోటు రూ.32,390.68 కోట్లుగా తేల్చారు. 2018-19 బడ్జెట్ అంచనాల కంటే తాజా బడ్జెట్‌లో 18.38 శాతం పెరుగుదల కనిపించింది. కాగా 2014-15 సంవత్సరానికి రూ.1,48,744 కోట్లుగా ఉన్న అప్పులు ఈ ఏడాది రూ.2,23,706 కోట్లకు పెరగడం గమనార్హం. వచ్చే నెలలో సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనున్న నేపథ్యంలో ప్రభుత్వం కీలక రంగాలకు ప్రాధాన్యత పెంచింది. పట్టణాలతో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే లక్ష్యంతో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు పెద్దఎత్తున రూ.35,182.61 కోట్ల నిధులను ఈ బడ్జెట్‌లో ప్రతిపాదించింది. గ్రామాల్లో సీసీ, బీటీ రోడ్లు, జాతీయ రహదార్లతో అనుసంధానం, మౌలిక వసతుల కల్పన దిశగా ప్రభుత్వం ఈ కేటాయింపులు జరిపింది. ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు నిర్దేశించిన కేటాయింపులు ఇలా ఉన్నాయి.

పరిశ్రమలు, సేవల రంగ విస్తృతిపై దృష్టి

రాష్ట్రంలో ఉపాధి కల్పనాభివృద్ధిలో భాగంగా పారిశ్రామిక, సేవా రంగాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇచ్చింది. వస్త్ర పరిశ్రమ, ప్రాథమిక ఎలక్ట్రానిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు, పర్యాటక రంగాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించింది. చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు మరింత ప్రోత్సాహకాలు అందించడం ద్వారా ఉపాధి కల్పన వృద్ధి చెందుతుందని భావిస్తోంది. ఇందులో భాగంగా ఈ ఆర్థిక సంవత్సరానికి ఎంఎస్‌ఎంఈ సెక్టార్‌కి రూ.1000 కోట్లు ప్రతిపాదించారు. ఇందులో రూ.100 కోట్లు ఒత్తిడిలో ఉన్న ఎంఎస్‌ఎంఈల పునరుద్ధరణకు, మరో రూ.400 కోట్లు కొత్త సంస్థలకు ప్రోత్సాహకాలు ఇంకా ఎంఎస్‌ఎంఈ పార్కుల అభివృద్ధికి రూ.500 కోట్లు కేటాయిస్తారు. కియా మోటార్స్ వంటి సంస్థలతో పాటు తిరుపతిలో సెల్‌ఫోన్ ఉత్పత్తి కేంద్రాలు, ఇంకా సుప్రసిద్ధ సంస్థలతో కుదుర్చుకున్న ఒప్పందాల్లో భాగంగా రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించి తద్వారా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమతుల్యం చేయాలనేది ప్రభుత్వ భావన.మౌలిక సదుపాయాల అభివృద్ధికి సంబంధించి జలవనరుల నిర్వహణ, ప్రాజెక్ట్‌లకు ఇప్పటి వరకు రూ.64,334 కోట్లు ఖర్చు చేసింది. పోలవరం, వంశధార, తోటపల్లి రిజర్వాయర్, పులిచింతల, తెలుగుగంగ, వెలిగొండ ప్రాజెక్ట్‌లను క్రమపద్ధతిలో పూర్తి చేసేందుకు వీలుగా జలవనరుల విభాగానికి రూ.16,852.57 కోట్ల మేర కేటాయించింది. రాష్ట్రంలోని ప్రధాన పట్టణాల్లో 100కోట్లతో మౌలిక సదుపాయాలను కల్పించాలని ప్రభుత్వం భావిస్తోంది. రాజధాని అమరావతి నిర్మాణానికయ్యే ఖర్చు రూ.1,09,023 కోట్లుగా అంచనా వేసి తొలిదశలో రూ.39,875 కోట్లతో నిర్మాణాలు చేపట్టింది. ఫైవ్‌స్టార్ హోటళ్లు, పరిశ్రమలు, జాతీయ విద్యాసంస్థల నుంచి మరిన్ని పెట్టుబడులు రాగలవని భావిస్తోంది. అయితే ఈ బడ్జెట్‌లో ప్రత్యేకించి కేటాయింపులేవీ జరగలేదు. భోగాపురం, ఓర్వకల్, దగదర్తి నూతన విమానాశ్రయాలతోపాటు కుప్పం వద్ద పియర్ స్ట్రిడ్ నిర్మాణాలకు అవసరమైన నిధులు కేటాయించనుంది. రాష్ట్రాన్ని తూర్పుతీర ప్రాంత నౌకా వ్యాపార కేంద్రంగా తీర్చిదిద్దటానికి రూపొందించిన

- మిగతా 6వ పేజీలో

- రెవెన్యూ వ్యయం రూ.1,80,369.33 కోట్లు
- పెట్టుబడి వ్యయం రూ.29,596.33 కోట్లు
- ఆర్థికలోటు రూ.32,396.68 కోట్లు
- అప్పులు రూ.2,23,706 కోట్లు
- రూ.14,367 కోట్లతో ఎస్సీ సబ్‌ప్లాన్
- రూ.5385 కోట్లతో ఎస్టీ సబ్‌ప్లాన్
- రూ.16,226 కోట్లతో బీసీ సబ్ ప్లాన్
- రూ.5వేల కోట్లతో అన్నదాత-సుఖీభవ
- రూ.150 కోట్లతో డ్రైవర్ల సాధికార సంస్థ
- నిరుద్యోగ భృతి రూ.2వేలకు పెంపు
- పసుపు-కుంకుమకు రూ.4వేల కోట్లు
- యువతకు 40వేల ప్రభుత్వ ఉద్యోగాలు
- ఎంఎస్‌ఎంఈలకు రూ.1000 కోట్లు
- వెనుకబడిన వర్గాల కార్పొరేషన్లకు 3వేల కోట్లు
- మానవ వనరుల అభివృద్ధికి 29,955 కోట్లు
- వ్యవసాయానికి రూ.12,732.97 కోట్లు
- నీటిపారుదలకు రూ.16,852.27
- వైద్య, ఆరోగ్యానికి రూ.10,032.15 కోట్లు
- ప్రతి జిల్లాలో కేన్సర్ సెంటర్లు

శాఖల వారీగా కేటాయింపులు

- వ్యవసాయం, మార్కెటింగ్, సహకార శాఖ: రూ.12,732.97 కోట్లు
- పశుసంవర్థక, పాడిపరిశ్రమ, మత్స్య శాఖ: రూ.2030.87 కోట్లు
- వెనుకబడిన వర్గాల సంక్షేమ విభాగం: రూ.8242.64 కోట్లు
- పర్యావరణం,అడవులు,సైన్స్ అండ్ టెక్నాలజీ: రూ.491.93 కోట్లు
- ఉన్నత విద్య: రూ.3171.63 కోట్లు
- ఇంధన, మౌలిక వనరుల అభివృద్ధి విభాగం: 5473.83 కోట్లు
- పాఠశాల విద్య: రూ.22,783.37 కోట్లు
- ఆహార, పౌరసరఫరాల విభాగం: రూ.3763.42 కోట్లు
- ఆర్థికశాఖ: రూ.51,841.69 కోట్లు
- సాధారణ పరిపాలన: రూ.1177.56 కోట్లు
- వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమం: రూ.10,032.15 కోట్లు
- హోమ్ శాఖ: రూ.6397.94 కోట్లు
- గృహ నిర్మాణం: రూ.4079.10 కోట్లు
- జలవనరుల నిర్వహణ: రూ.16,852.27 కోట్లు
- పరిశ్రమలు, వాణిజ్య విభాగం: రూ.4114.92 కోట్లు
- ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్: రూ.1006.81 కోట్లు
- కార్మిక, ఉపాధికల్పన శాఖ: రూ.1225.75 కోట్లు
- న్యాయశాఖ: రూ.918.81 కోట్లు
- శాసనవ్యవహారాలు: రూ.149.90 కోట్లు
- పురపాలన, అర్బన్ డెవలప్‌మెంట్: రూ.7979.34 కోట్లు
- మైనారిటీల సంక్షేమ శాఖ: రూ.1308.73 కోట్లు
- ప్రణాళికా విభాగం: రూ.1403.17 కోట్లు
- పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్: రూ.35,182.61 కోట్లు
- రెవెన్యూ: రూ.5546.94 కోట్లు
- రియల్‌టైం గవర్నెన్స్: రూ.172.12 కోట్లు
- నైపుణ్యాభివృద్ధి, నూతన ఆవిష్కరణలు: రూ.458.66 కోట్లు
- సాంఘిక సంక్షేమం: రూ.6861.60 కోట్లు
- రవాణా, రోడ్లు, భవనాలు: రూ.5382.83 కోట్లు
- మహిళా, స్త్రీ, శిశు సంక్షేమానికి: రూ.3408.66 కోట్లు
- యువజన, క్రీడల విభాగానికి: రూ.1982.74 కోట్లు

రూ. ఐదు వేల కోట్లతో 'అన్నదాత-సుఖీభవ'

రైతుల సంక్షేమానికి 'అన్నదాత- సుఖీభవ' పథకాన్ని రూ.5వేల కోట్లతో ఏర్పాటు చేస్తున్నట్టు ఆర్థిక మంత్రి ప్రకటించారు. ఇప్పటికే వివిధ రకాల పంటలకు ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీని పెంచింది. వరికి ఎకరానికి రూ.10వేల నుండి 15వేల వరకు, మొక్కజొన్నకు రూ.8333 నుండి 12,500, పప్పుధాన్యాలు, పొద్దు తిరుగుడు పంటకు ఇచ్చే రాయితీని రూ.6250 నుండి 10వేలు అందిస్తోంది. రాష్ట్రంలో ఓవైపు అతివృష్టి.. మరోవైపు అనావృష్టి పరిస్థితుల నేపథ్యంలో భూసార పరీక్షల ద్వారా సకాలంలో పంటలు చేతికి అందేలా జాగ్రత్తలు తీసుకోవటం, వ్యవసాయ ఆదాయాన్ని స్థిరంగా వృద్ధిచేసి ఉత్పాదకత, మెరుగుదలకు సూక్ష్మ పోషకాలు నూరు శాతం రాయితీతో అందించటం, 'చంద్రన్న రైతు క్షేత్రాలు', 'పొలం పిలుస్తుంది' కార్యక్రమాల ద్వారా స్థిరీకరణ చర్యలను బలోపేతం చేసే అంశాలపై దృష్టి సారించింది. యాంత్రికీకరణను ప్రోత్సహించటం, నాణ్యమైన ఎరువులు, విత్తనాలను అందించటం, బిందు సేద్యం, ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయాలనేది ప్రభుత్వ ప్రణాళిక. ఇందులో భాగంగా అన్నదాత-సుఖీభవ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దీంతో పాటు మార్కెట్ ఇంటర్‌వెన్షన్ స్కీం కింద కేటాయింపులను ఈ ఏడాది బడ్జెట్‌లో రెట్టింపు చేసింది. గత ఏడాది 500 కోట్లు కేటాయించగా ఈ ఏడాది వెయ్యి కోట్లకు పెంచారు.

బీసీ వర్గాలకు కార్పొరేషన్లు

వెనుకబడిన వర్గాల సంక్షేమంలో భాగంగా యాదవ, తూర్పుకాపు, గాజుల కాపు, కొప్పుల వెలమ, పొలినాటి వెలమ, కురబ, కురుమ, వణ్యకుల క్షత్రియ, కళింగ, గవర, చేనేత, తొగట, వీరక్షత్రియ, మత్స్యకారుల, గండ్ల, దేవటి కులాలకు నూతన కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. వీటితోపాటు రజక, నాయీబ్రాహ్మణ, వడ్డెర, సాగర, కృష్ణ బలిజ, వాల్మీకి, బట్రాజలకు నిర్దేశించిన కోఆపరేటివ్ సొసైటీస్ ఫెడరేషన్లను కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్లుగానూ, కల్లుగీత కార్పొరేషన్ పేరును మార్పుచేస్తూ బడ్జెట్‌లో ప్రతిపాదించారు. మైనారిటీల సంక్షేమానికి ఈ బడ్జెట్‌లో రూ.1304.43 కోట్లు కేటాయించారు.

జాతీయ ప్రాజెక్టులతో నాలుగు రాష్ట్రాలకు నీళ్లు

- పాక్‌కు మూడు నదుల నీళ్లు వృథాగా పోతున్నాయి
- పోలవరం ప్రాజెక్టుకు వంద శాతం నిధులిస్తున్నాం
- మోదీ వచ్చాక దేశం ముఖచిత్రం మారింది: కేంద్ర మంత్రి నితిన్‌గడ్కారీ



గడ్కరీని గజమాలతో సత్కరిస్తున్న తెలంగాణ బీజేపీ నేతలు

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 5: నలభై ఐదు టీఎంసీల నీటి విషయంలో తెలంగాణ, ఆంధ్ర నల్లా దగ్గర మహిళల్లా జగడం పెట్టుకోవడం చూశామని, ఇలాంటి పరిస్థితి మున్ముందు రాకూడదనే ఉద్దేశంతో కేంద్రం అనేక మార్గాలను అన్వేషించిందని కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. సికింద్రాబాద్, మల్కాజ్‌గిరి, హైదరాబాద్ లోక్‌సభ స్థానాలకు చెందిన శక్తికేంద్రాలు, పోలింగ్ కేంద్రాల ఇన్‌చార్జిల సమావేశం మంగళవారం ఇంపీరియల్ గార్డెన్స్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నితిన్ గడ్కరీ మాట్లాడుతూ మూడు నదుల నీళ్లు పాకిస్థాన్‌కు వృధాగా పోతున్నాయని, పంజాబ్-కాశ్మీర్‌కు మధ్య జగడం ఉందని, ఇపుడు జాతీయ ప్రాజెక్టులను నిర్మించడం ద్వారా నాలుగు రాష్ట్రాలకు లాభం చేకూరిందని అన్నారు. పోలవరం నిర్మాణానికి కేంద్రమే నూరు శాతం నిధులు ఇస్తోందని చెప్పారు. మహారాష్ట్ర, చత్తీస్‌గఢ్,

- మిగతా 6వ పేజీలో

ఏపీ పోలీస్‌పై నమ్మకం లేదు


ఇక్కడే దర్యాప్తు జరపండి ◆ హైదరాబాద్ పోలీసులను ఆశ్రయించిన జయరాం భార్య పద్మశ్రీ

హైదరాబాద్, ఫిబ్రవరి 5: పారిశ్రామికవేత్త జయరాం కేసు మరో మలుపు తిరిగింది. ఈ కేసును దర్యాప్తు చేస్తున్న ఆంధ్రా పోలీసులపై నమ్మకం లేదని జయరాం భార్య పద్మశ్రీ హైదరాబాద్ జూబ్లీహిల్స్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తండ్రి పిచ్చయ్య చౌదరి, అడ్వకేట్‌తో కలసి ఆమె పోలీస్‌లకు ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తులో అనేక అనుమానాలకు దారితీసింది. ఆంధ్రా పోలీసులు శిఖా చౌదరిపై కేసు నమోదు చేయకపోవడం పట్ల అనేక అనుమానాలు ఉన్నాయని పద్మశ్రీ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. రాజకీయ ఒత్తిడితో శిఖా చౌదరని కేసు నుంచి తప్పించడానికి ఆంధ్రా పోలీసులు ప్రయత్నిస్తున్నారని ఆమె చెప్పారు. తన భర్త హత్యకేసులో శిఖా చౌదరి పాత్ర ఉందని ఆమె పోలీసుల ముందు వాపోయారు. కేవలం రాకేష్ రెడ్డిని మాత్రమే ముద్దాయిగా పేర్కొంటూ ఆంధ్రా పోలీసులు అబద్ధాలు చెబుతున్నారన్నారు. అన్ని కోణాల్లో విచారణ చేపడితే అసలు ముద్దాయిలు ఎవరో తెలుస్తారని చెప్పారు. తనకు న్యాయం చేయాలని పోలీసులను కోరారు.

ఇబ్రహీంపట్నం ఏసీపీపై బదిలీ వేటు

చిగురుపాటి జయరాం హత్యకేసులో నిందితుడు రాకేశ్‌రెడ్డితో ఇబ్రహీంపట్నం ఏసీపీకి సంబంధాలు బయటపడటంతో ఆయనపై బదిలీ వేటు పడింది. జయరామ్

- మిగతా 6వ పేజీలో



జయరాం హత్య కేసులో వీడిన మిస్టరీ

ఆర్థిక లావాదేవీలే అంతమొందించాయి 8

విజయవాడలో సీడబ్ల్యూసీ?

★ రాహుల్‌కు విజ్ఞప్తి.. సానుకూలంగా స్పందించారన్న రఘువీరా

★ నెలాఖరులోగా అభ్యర్థులను ప్రకటిస్తామని వెల్లడి

ఆంధ్రభూమి ప్రతినిధి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: వచ్చే ఎన్నికల కోసం లోక్‌సభ, శాసనసభ స్థానాలకు తమ పార్టీ అభ్యర్థులను ఈ నెలఖరులోగా ప్రకటిస్తామని ఆంధ్రప్రదేశ్ పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి వెల్లడించారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు రాహుల్ గాంధీతో మంగళవారం రఘువీరా సమావేశమయ్యారు. అనంతరం రఘువీరారెడ్డి విలేఖరులతో మాట్లాడుతూ వచ్చే ఎన్నికలకోసం రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నుంచి మొత్తం ఎనిమిది కమిటీలను ప్రతిపాదిస్తూ రాహుల్‌గాంధీకి అందించినట్టు వెల్లడించారు. త్వరలోనే దీనికి పార్టీ ఆమోద ముద్ర వేస్తుందని చెప్పారు. అలాగే వివిధ రాష్ట్రాల శాసనసభ ఎన్నికలు, సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సిడబ్ల్యుసి) సమావేశం కానుందని తెలిపారు. ఈ సమావేశాన్ని విజయవాడలో నిర్వహించాలని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ తరపున కోరినట్టు వివరించారు. దీనిపై రాహుల్ సానుకులంగా స్పందించారని తెలిపారు. ఈ సమావేశం రాష్ట్రంలో నిర్వహించడం వల్ల రాష్ట్ర ప్రజల్లో కాంగ్రెస్ పార్టీపై నమ్మకం ఏర్పడుతుందని అన్నారు. అలాగే రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలో 'ప్రత్యేక హోదా భరోసా ప్రజాయాత్ర'ను ప్రారంభించనున్నట్టు తెలిపారు. ఈ యాత్రకు రాహుల్‌తోపాటు ప్రియాంక గాంధీని కూడా ఆహ్వానించినట్టు చెప్పారు. 2019లో శాసనసభ, పార్లమెంట్ ఎన్నికలకు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీకి జాతీయ నాయకత్వం నుంచి పూర్తిస్థాయిలో మద్దతు ఉంటుందని రాహుల్ స్పష్టం చేశారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో లోక్‌సభ, శాసనసభ అభ్యర్థులకు ఎంపిక చేసి ఈ నెలఖరునాటికి ప్రకటిస్తామని చెప్పారు. జాతీయ స్థాయిలో మాత్రమే తెలుగుదేశం పార్టీతో కాంగ్రెస్ పార్టీ కలిసి పని చేస్తుందని, రాష్ట్రంలో తమకు తెలుగుదేశం, వైఎస్సార్‌సీపీ, బీజేపీ ప్రత్యర్థులేనని వెల్లడించారు.

భీమవరంలో మత్స్య, సముద్ర వర్శిటీ

★ అనుమతులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం ★ ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంలో ఏర్పాటు ★ వచ్చే విద్యాసంవత్సరం నుంచే కోర్సులు

భీమవరం, ఫిబ్రవరి 5: నీలి విప్లవ రాజధానిగా ఖ్యాతి గడించిన పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం ప్రాంతంలో మత్స్య, సముద్ర విశ్వ విద్యాలయం ఏర్పాటు కానుంది. దీనికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంలో విశ్వవిద్యాలయం ఏర్పాటు కానుంది. 51శాతం వాటాతో భీమవరంనకు చెందిన ఉద్ద రాజు ఆనందరాజు ఎడ్యుకేషన్ ఫౌండేషన్ (యూఏఈఎఫ్), 49శాతం ప్రభుత్వ వాటాగా విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయనున్నారు. సుమారు రూ.300 కోట్ల వ్యయంతో భీమవరం మండలంలో సుమారు 150 ఎకరాల్లో విశ్వవిద్యాయం ఏర్పాటుచేయనున్నారు. ఇందుకోసం భూమిని కూడా ఉద్దరాజు ఆనందరాజు ఎడ్యుకేషన్ ఫౌండేషన్ సిద్ధంచేసింది. గ్రాడ్యుయేషన్‌లో బ్యాచిలర్ ఆఫ్ ఫిషరీస్ సైన్స్, బీటెక్‌లో పోర్టు హార్బర్ ఇంజనీరింగ్, ఫుడ్‌ప్రాసెసింగ్ ఇంజనీరింగ్, నేవల్ ఆర్కిటెక్చర్, ఎన్విరాన్‌మెంటల్ తదితర కోర్సులు విశ్వ విద్యాలయంలో ఏర్పాటుచేస్తారు. ఇక పోస్టు గ్రాడ్యుయేషన్‌లో ఆక్వా కల్చర్, ఫిష్ బ్రీడింగ్, ఫిష్ పెథాలజీ, ఆక్వా హెల్త్ మేనేజ్‌మెంట్, జెనిటిక్స్, బయోటెక్నాలజీ, ఓషన్ సైన్స్, మెరైన్ కెమిస్ట్రీ, మెరైన్ జియో ఇన్‌ఫ్రాటెక్స్ తదితర కోర్సులు ఉంటాయి. ఇక మత్స్యశాఖ అధికారులకు, రైతులకు శిక్షణా కార్యక్రమాలు చేపడతారు. దేశంలో కేరళ, తమిళనాడులోని కొన్ని విశ్వవిద్యాలయాలు కొన్ని కోర్సులు మాత్రమే అందిస్తున్నాయి. దేశంలో మత్స్య, సముద్రానికి సంబంధించి అత్యధిక కోర్సులతో ఏర్పాటవుతున్న తొలి విశ్వవిద్యాలయంగా దీన్ని పేర్కొనవచ్చు. మంగళవారం అమరావతిలో రాష్ట్ర మార్కెటింగ్, గిడ్డంగులు, పశుగణాభివృద్ధి, పాడిపరిశ్రమ, మత్స్యశాఖ మంత్రి ఆదినారాయణ రెడ్డిని ఆనంద గ్రూప్ చైర్మన్ ఉద్దరాజు కాశీవిశ్వనాధరాజు, డైరక్టర్ ఉద్దరాజు రామకృష్ణంరాజు, కంతేటి వెంకట్రాజు, అల్లూరి నాగరాజువర్మలతో కూడిన బృందం ప్రత్యేకంగా సమావేశమయ్యింది. ఈ సమావేశంలో అనేక అంశాలపై చర్చలు జరిగాయి. అనంతరం రానున్న విద్యాసంవత్సరం నుంచి కోర్సులు ప్రారంభించడానికి వీలుగా అనుమతులు ఇస్తూ లెటర్ ఆఫ్ ఇండెంట్ జారీ చేశారు.



అనుమతి లేఖను ఆనంద గ్రూప్ చైర్మన్ విశ్వనాథరాజుకు అందజేస్తున్న మంత్రి ఆదినారాయణ రెడ్డి

మండలి చైర్మన్ ఎన్నికకు నేడు నోటిఫికేషన్

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, ఫిబ్రవరి 5: రాష్ట్ర శాసన మండలి చైర్మన్ ఎన్నికకు సంబంధించి ఈ నెల 6వ తేదీన నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. ఆ రోజే నామినేషన్లను స్వీకరణ, పరిశీలన ఉంటుంది. 7న చైర్మన్‌ను అధికారికంగా ఎన్నికైనట్లు ప్రకటిస్తారు. ఎమ్మెల్సీ షరీఫ్‌ను చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకోనున్నారు. 7న 11 గంటలకు ఆయన బాధ్యతలు స్వీకరిస్తారు.

రెండు బిల్లులకు ఏకగ్రీవ ఆమోదం

విజయవాడ (సిటీ), ఫిబ్రవరి 5: ఆంధ్రప్రదేశ్ శాసనసభ ముందుకు రెండు బిల్లులు రాగా ఏకగ్రీవంగా ఆమోదించారు. ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా మంగళవారం ప్రభుత్వం రెండు బిల్లులను సభలో ప్రవేశపెట్టారు. సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం పంచగ్రామాలకు సంబంధించిన ఇళ్లు, ఇంటి స్థలాల క్రమబద్ధీకరణకు సంబంధించిన బిల్లును ఉప ముఖ్యమంత్రి, రెవిన్యూ, రిజిస్ట్రేషన్లు, స్టాంపులు, దేవదాయ శాఖ మంత్రి కేఈ కృష్ణమూర్తి ప్రవేశపెట్టగా సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. 2019 కార్మిక శాసనాల సవరణ బిల్లును కార్మిక, ఉపాధి కల్పన, శిక్షణ, కర్మాగారాల శాఖ మంత్రి పితాని సత్యనారాయణ అసెంబ్లీలో ప్రవేశపెట్టగా సభ ఏకగ్రీవంగా ఆమోదించింది.

టీజీటీ ఫైనల్ కీలో తప్పు

★ ఆందోళనలో అభ్యర్థులు

గుంటూరు, ఫిబ్రవరి 5: ఇటీవల జరిగిన డీఎస్సీ పరీక్షల్లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ట్రైనడ్ గ్రేడ్ టీచర్ (టీజీటీ)కు నిర్వహించిన పరీక్షకు సంబంధించి విద్యాశాఖ విడుదల చేసిన ఫైనల్‌కీ లో తప్పు దొర్లడంతో అభ్యర్థులు ఆందోళనకు గురవుతున్నారు. సోమవారం రాత్రి విడుదలైన టీజీటీ ఫైనల్‌కీ 86వ ప్రశ్నకు ఆప్షన్-2 సరైన సమాధానం కాగా ఆప్షన్-1ను సరైందిగా పేర్కొంటూ ఆ మేరకు కీ విడుదల చేయడం అభ్యర్థులను ఆశ్చర్యానికి గురిచేసింది. పరీక్ష అనంతరం విడుదల చేసిన తొలి కీ లో 86వ ప్రశ్నకు సరైన సమాధానంగా ఆప్షన్-2ను విద్యాశాఖ పేర్కొన్నప్పటికీ ఫైనల్‌కీ లో ఆప్షన్-1గా విడుదల చేయడం అయోమయానికి గురిచేసింది.

నోటిఫికేషన్ విడుదల సమయంలో ఏవైనా తప్పొప్పులకు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం అకాడమి పుస్తకాన్ని ప్రామాణికంగా తీసుకుంటామని విద్యాశాఖ ప్రకటించింది. ఆ మేరకు 86వ ప్రశ్నకు సంబంధించి అకాడమి బుక్‌లో 176వ పేజీలో బిట్ నెంబర్ 13, బిట్ నెంబర్ 23, 177వ పేజీలో బిట్ నెంబర్ 14ను ఉదాహరణలుగా పొందుపర్చారు. ఈ ప్రకారం చూసుకుంటే టిజిటి పరీక్షలో ఇచ్చిన 86వ ప్రశ్నకు ఆప్షన్-2లో ఇచ్చిన 'వాంట్స్' సరైన సమాధానమని అభ్యర్థులు ఉదాహరణలతో సహా చూపుతున్నారు. విద్యాశాఖ విడుదల చేసిన ఫైనల్‌కీ లో తప్పును సరైన సమాధానంగా పేర్కొనడంతో అర మార్కు కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. డిఎస్‌సికి సంబంధించి ఏ జిల్లాకు ఆ జిల్లాలో ర్యాంకులు కేటాయిస్తున్నప్పటికీ, టిజిటికి సంబంధించి రాష్ట్రం మొత్తమ్మీద ర్యాంకులు విడుదలయ్యే క్రమంలో ఈ అరమార్కు ఎంతో ముఖ్యమైందని పేర్కొంటున్నారు. విద్యాశాఖ అధికారులు స్పందించి ఫైనల్‌కీ లో దొర్లిన తప్పును సరిచేయాలని అభ్యర్థులు కోరుతున్నారు.

అన్న క్యాంటీన్లకు బడ్జెట్‌లో రూ. 300 కోట్లు

ఆంధ్రభూమి బ్యూరో

అమరావతి, ఫిబ్రవరి 5: రాష్ట్రంలో అన్న క్యాంటీన్ల నిర్వహణకు ప్రభుత్వం ఈ ఏడాది బడ్జెట్‌లో రూ. 300 కోట్లు కేటాయించింది. పేద వర్గాలకు 5 రూపాయలకే భోజనాన్ని ఈ పథకం కింద అందిస్తున్నారు. దాతల విరాళాలతో పాటు ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి ఈ పథకాన్ని పేదలకు మరింత చేరువ చేయాలని నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా 175 నియోజకవర్గాలకు 368 క్యాంటీన్లు మంజూరు కాగా పట్టణాల్లో 216, గ్రామీణ ప్రాంతాల్లో 152, నాలుగు కార్పొరేషన్లు, 14 మునిసిపాలిటీలలో మరో 160 ఏర్పాటయ్యాయి. ఏటా బడ్జెట్‌లో కేటాయింపులు పెంచటంతో పాటు మరిన్ని విరాళాలు సేకరించి స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యం పెంచాలని ప్రభుత్వం భావిస్తోంది.

తులసి పంట కేసులో

ఉద్యానవన శాఖాధికారి నవీన్ అరెస్ట్

విడుదల చేయాలని అధికారుల ధర్నా

అద్దంకి, ఫిబ్రవరి 5: ప్రకాశం జిల్లా అద్దంకి నియోజకవర్గ రైతులను నమ్మించి నట్టేట ముంచిన తులసి పంట కేసులో ప్రధాన నిందితులను అరెస్టు చేసిన తదుపరి, మంగళవారంనాడు అద్దంకి ఉద్యానవనశాఖాధికారి నవీన్‌ను అద్దంకి పోలీసులు అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరచగా, కోర్టు రిమాండ్ విధించింది. అద్దంకి నియోజకవర్గంలో 1200 ఎకరాల్లో తులసి పంటను సాగుచేయించి, పంటను తామేకొంటామని రైతులను నమ్మించి, పంట చేతికివచ్చిన తరుపరి ప్రధాన నిందితుడు శ్రీనివాస్ పరార్ కావడంతో ఎట్టకేలకు వారంరోజులక్రితం పోలీసులు అతన్ని పట్టుకుని అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచారు. రైతులనుండి మరికొన్ని ఫిర్యాదు నమోదైన నేపథ్యంలో మంగళవారం నాడు కోర్టునుండి ప్రత్యేక అనుమతులు తీసుకొని రిమాండ్‌లో ఉన్న నిందితుడు శ్రీనివాస్‌ను విచారణ నిమిత్తం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

అనంతరం తులసి పంట కేసులో ప్రధాన నిందితుడు శ్రీనివాస్‌కు అద్దంకి ఉద్యానవనశాఖాధికారి నవీన్ సహకరించి, రైతులను మోసం చేశాడన్న రైతులు పెట్టిన కేసును ఆధారంగా చేసుకున్న పోలీసులు నవీన్‌ను కూడా అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచారు. తులసి పంట కేసులో రైతులకు సలహాలు సూచనలిచ్చినంత మాత్రాన ఉద్యానవనశాఖాధికారి నవీన్‌ను అరెస్టు చేయడం అన్యాయమని ప్రకాశం, గుంటూరు జిల్లాలకు చెందిన ఉద్యానవనశాఖాధికారులు మంగళవారం సాయంత్రం స్థానిక బంగ్లారోడ్డులోని అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా చేశారు. పోలీసులు అక్రమంగా నవీన్‌ను అరెస్టు చేశారని, నవీన్‌ను జరిగిన అన్యాయంపై తాము న్యాయపోరాటం చేస్తామని తెలిపారు.

వాట్ ఈజ్ దిస్?

★ ఎమ్మెల్సీల తీరుపై చైర్మన్ ఆగ్రహం ★ ప్రభుత్వ విప్ డొక్కాకు చురక

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, ఫిబ్రవరి 5: కొంతమంది ఎమ్మెల్సీలు సభలో వ్యవహరిస్తున్న తీరుపై శాసన మండలి చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం ఆగ్రహం వ్యక్తం చేశారు. సభా సంప్రదాయాలు పాటించకపోవడంతో వాట్ ఈజ్ దిస్? అంటూ అసహనం వ్యక్తం చేశారు. శాసన మండలిలో మంగళవారం ప్రశ్నోత్తరాల సమయంలో మంత్రి అమర్‌నాథ్ రెడ్డి ఒక ప్రశ్నకు బదులిస్తుండగా, బీజేపీ ఎమ్మెల్సీ వీర్రాజు అడ్డుకుంటూ మాట్లాడే ప్రయత్నం చేశారు.

వీర్రాజు మాట్లాడుతుంటే మంత్రి జోక్యం చేసుకుని రాష్ట్రానికి కేంద్రం అన్యాయం చేస్తుంటే బాధతో మాట్లాడాల్సి వచ్చిందని వివరించారు. ఈ దశలో ఎమ్మెల్సీ దొరబాబు లేచి వీర్రాజు వ్యాఖ్యలకు బదులిచ్చే ప్రయత్నం చేశారు. వీరిద్దరూ ఒకరినొకరు చూసుకుంటూ మాట్లాడుతుండటంతో చైర్మన్ జోక్యం చేసుకుని ఇలా సభ్యులు ఒకరితో ఒకరు మాట్లాడుకుంటే చైర్ ఎందుకు అంటూ అసహనం వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు చెప్పినా, సాంప్రదాయాలు పాటించరా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మీరద్దరూ డైరెక్టుగా మాట్లాడుకుంటే చైర్ ఎందుకని, తాను వినాలా అని ప్రశ్నించారు. ఈ దశలో ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న మాట్లాడుతూ సస్పెండ్ చేయాలంటూ వ్యాఖ్యానించారు. ఇది క్వచ్చన్ అవర్ అని, క్వచ్చన్ అవర్స్ చేయకండని చైర్మన్ సూచించారు. ప్రశ్నోత్తరాలను లఘు చర్చగా చేస్తే ఏలా అని ప్రశ్నించారు. మరో సందర్భంలో ప్రభుత్వ విప్ డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడేందుకు ప్రయత్నించగా, చైర్మన్ తీవ్రంగా స్పందించారు. సభ్యులతో విప్‌లు మాట్లాడించాలని, విప్‌లే మాట్లాడతామంటే ఎలా అంటూ చురక వేశారు. తరువాత కొద్ది సేపు మాట్లాడే అవకాశం ఆయనకు ఇచ్చారు.

ఎన్నికల నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తల కోసమే

ఆరు రాష్ట్రాల డీజీల సమావేశం

ఆంధ్రభూమి బ్యూరో

తిరుపతి, ఫిబ్రవరి 5: ఎన్నికల నేపథ్యంలో తలెత్తే వివిధ రకాల సమస్యలపై పొరుగు రాష్ట్రాల పోలీస్ శాఖలను సమన్వయ పరచుకుని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంలో భాగంగా ఆరు రాష్ట్రాల డీజీపీలతో సమావేశం నిర్వహించినట్లు ఏపీ డీజీపీ ఠాకూర్ తెలిపారు. మరో రెండు నెలల్లో దేశ వ్యాప్తంగా జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, చత్తీస్ ఘడ్, ఒడిశా రాష్ట్రాలకు సంబంధించిన డీజీపీల సమావేశం మంగళవారం తిరుపతిలోని మానస సరోవర్ హోటల్లో జరిగింది. ఎన్నికల సందర్భంగా అంతర్రాష్ట్రాల మధ్య చేపట్టాల్సిన సహాయ సహకారాలపై సమావేశంలో చర్చించారు. ప్రధానంగా గత సార్వత్రిక ఎన్నికల్లో పొందిన అనుభవాలను పరిగణలోకి తీసుకుని అలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఎలాంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్న అంశాలపై

★ నక్సలిజంపై చర్చ ★ ఏపీ డీజీపీ ఠాకూర్

ప్రణాళిక బద్ధంగా సమావేశంలో చర్చించారు. ఎన్నికలకు సంబంధించి కీలక సమావేశం కావడంతో ఈ సమావేశానికి మీడియాను కూడా అనుమతించలేదు. అయితే ఫోటోలు, వీడియోలు ముందుగా తీసుకునేందుకు అనుమతించారు. సమావేశం అనంతరం ఏపీ డీజీపీ ఠాకూర్ విలేఖరులతో మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నిక్ల నేపథ్యంలో నక్సలిజం కదలికలపైన ప్రత్యేకమైన చర్చ నిర్వహించామన్నారు. ప్రస్తుతం ప్రాథమికంగా మాత్రమే ఈ సమావేశం జరిగిందన్నారు. తొలివిడతలో ఆరు రాష్ట్రాలో జరిగే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని అంతర్గత భద్రతపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఇందులో భాగంగానే ఈ సమావేశం జరిగిందన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే లోపు మరిన్ని సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఎన్నికల సందర్భంగా ప్రజాస్వామ్యానికి, శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చూడాలన్నది ప్రధాన లక్ష్యమన్నారు. ఇందులో భాగంగా ఎన్నికలలో ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడి ఒక రాష్ట్రం ఉంచి మరో రాష్ట్రానికి తప్పించుకుని పారిపోయే క్రమంలో వారిని పట్టుకోవడానికి ఆరు రాష్ట్రాల పోలీసుల సమన్వయం, సహకారం అవసరం ఉంటుందన్నారు. ఆదిశగానే సమావేశం కొనసాగిందన్నారు. ఈ సమావేశంలో ఏపీ డీజీపీ ఆర్పీ ఠాకూర్‌తోపాటు తెలంగాణ డీజీపీ ఎం.మహేంద్ర రెడ్డి, చత్తీస్‌ఘడ్ డీజీపీ డిఎం అవస్తి, తమిళనాడు డీజీపీ పికె రాజేంద్రన్, కర్ణాటక డీజీపీ నీలమణి రాజు, ఒరిస్సా డీజీపీ ఆర్.పి.శర్మ,లతోపాటు ఏపీ హోం సెక్రటరీ ఎ.ఆర్.అనురాధ, తెలంగాణ హోం సెక్రటరీ రాజీవ్ త్రివేధి, ఇంటెలిజెన్స్ ఏడీజీ వెంకటేశ్వర రావు, ఆపరేషన్స్ ఏడీజీ నళినిప్రభాత్, లా అండ్ ఆర్డర్ ఏడీజీ డాక్టర్ రవిశంకర్ అయనార్, సీఆర్‌పిఎఫ్ సౌత్ జోన్ ఐజీపీ ఎస్కే మహంతి, ఏపీఎస్‌ఐబి ఐజీ బి.శ్రీనివాసులు, అనంతపురం డీఐజీ క్రాంతి రాణా టాటా, రాయలసీమ లా అండ్ ఆర్డర్ డిఐజీ జి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యుత్ సంస్కరణలతో ధరలకు కళ్లెం

ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ చైర్మన్ భవానీ ప్రసాద్

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, ఫిబ్రవరి 5: విద్యుత్ రంగంలో నష్టాలను తగ్గించి డిస్కంల ఆదాయం పెంచడంతో విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించగలుగుతున్నామని ఏపీ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ చైర్మన్ జస్టిస్ భవానీ ప్రసాద్ అన్నారు. మంగళవారం నగరంలోని నోవాటెల్ హోటల్‌లో ఏపీ ఎనర్జీ ఇన్నోవేషన్ సమ్మిట్ 2019 కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జస్టిస్ భవానీ ప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా భవానీ ప్రసాద్ మాట్లాడుతూ విద్యుత్ కొనుగోలు ఖర్చును 86 శాతం నుంచి 76 శాతానికి తగ్గించగలిగామన్నారు. ఈ ఏడాది స్వల్ప కాలిక విద్యుత్ కొనుగోలుకు ప్రయత్నం చేస్తున్నామని, విద్యుత్ వినియోగ చార్జీలు కొంత శాతానికి తగ్గించగలిగామన్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తదితర విషయాలతో దురదృష్టవశాత్తు చనిపోయినా, గాయాలైన వారికి నష్టపరిహారం అందించేందుకు కమిషన్ ప్రథమ ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఇటీవల విజయనగరం జిల్లాలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు చనిపోవడంతో వారికి ఒక్కొక్కరికి రూ. 5 లక్షలు పరిహారం, రూ. 5 లక్షల చంద్రన్న బీమా మొత్తం రూ. 10 లక్షలు అందించామన్నారు. ఇంధన శాఖ కార్యదర్శి అజయ్ జైన్ మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నవ్యావిష్కరణలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ప్రతి రోజు 1.5 మిలియన్ కాల్స్ చేసి ప్రజల నుంచి ప్రభుత్వ పనితీరుపై ఫీడ్‌బ్యాక్ తీసుకుంటున్నారన్నారు. 2019 మార్చిలోపు అన్ని గ్రామ పంచాయతీలలో ఎల్‌ఈడీ బల్బులు ఏర్పాటు చేయనున్నామన్నారు. నెట్‌క్యాప్ వీసీ, ఎండీ ఎం కమలాకర్ బాబు మాట్లాడుతూ విద్యుత్ రంగంలో సంస్కరణలు అమలు చేసిన రాష్ట్రాల్లో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ట్రాన్స్‌కో సీఎండీ కే విజయానంద్, విద్యుత్ రంగ సలహాదారు కే రంగనాథన్, టెరి డైరెక్టర్ జనరల్ అజయ్ మాథూర్ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న జస్టిస్ భవానీ ప్రసాద్

అన్నదాత - సుఖీభవ

★ రైతులకు నగదు బదిలీ ★ రూ. 5 వేల కోట్లతో బడ్జెట్‌లో ప్రతిపాదన ★ ఎకరాకు రూ. 10 వేలు? ★ త్వరలో విధివిధానాలు

ఆంధ్రభూమి బ్యూరో

అమరావతి, ఫిబ్రవరి 5: ఏటా ప్రకృతి విపత్తులతో నష్టపోతున్న రైతులను ఆదుకునేందుకు అన్నదాత- సుఖీభవ పథకాన్ని ప్రభుత్వం ప్రవేశ పెడుతోంది. మంగళవారం శాసనసభలో ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో ఈ పథకానికి రూ. 5వేల కోట్లను కేటాయిస్తున్నట్లు ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు ప్రకటించారు. ఈ పథకం విధి విధానాలకు సంబంధించి కసరత్తు జరుగుతోంది.

తెలంగాణ ప్రభుత్వం ఎకరానికి 4వేల రూపాయల చొప్పున రైతుల ఖాతాలో నేరుగా జమ చేస్తోంది. తాజాగా కేంద్ర ప్రభుత్వం ఏడాదికి ఎకరానికి రూ 6వేలు జమ చేయనున్నట్లు ప్రకటించింది. వీటికి భిన్నంగా రైతులకు మరింత ప్రయోజనం చేకూరేలా ఎకరానికి 10వేల చొప్పున అందించాలనే యోచనతో ప్రభుత్వం ఉంది. ఇందులో భాగంగానే భారీగా బడ్జెట్ కేటాయింపులు జరిపారు. ఇప్పటికే రూ 24వేల కోట్లతో రైతుల రుణమాఫీని ప్రభుత్వం అమలు చేస్తోంది. తాజా ప్రతిపాదన సర్వత్రా చర్చనీయాంశమైంది. అయితే ఈ పథకాన్ని సన్న, చిన్నకారు రైతులకే అమలు చేయాలా లేక అందరికీ వర్తింప చేయాలా అనే విషయమై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మంత్రి వర్గ సహచరులతో సమాలోచనలు జరుపుతున్నారు.

కొద్దిరోజుల్లో ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్‌తో పాటు వచ్చే నెల్లో సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనున్న నేపథ్యంలో ఈలోగా అమలు చేయాలంటే బడ్జెట్ ప్రతిపాదన తప్పనిసరనే భావనతో దీన్ని శాసనసభ ముందుంచారు. వివిధ ప్రాంతాల్లో భూసార పరీక్షలు నిర్వహించి పెట్టుబడిలేని ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించటంతో పాటు ఖర్చులు తగ్గించి అధిక దిగుబడులు సాధించే పంటలను ప్రోత్సహించటంతో పాటు గిట్టుబాటు ధర కల్పించి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయాలనేది ప్రభుత్వ లక్ష్యం. ఇందులో భాగంగానే ఈ వినూత్న పథకాన్ని అమలు చేయనుంది. కౌలు రైతులకు కూడా ఈ పథకం వల్ల ప్రయోజనం అందించాలని భావిస్తోంది.

ఏటా నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుమందులతో కనీసం పెట్టుబడి తిరిగిరాని పరిస్థితుల్లో రైతులు తల్లడిల్లుతున్నారు. సకాలంలో సాగునీరందించినప్పటికీ ఏడాది చివర్లో ప్రకృతి వైపరీత్యాల కారణంగా నష్ట పోతున్నారు. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని పెట్టుబడి వ్యయాన్ని ప్రభుత్వమే భరించడం ద్వారా రైతులకు వెసులుబాటు కల్పించేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకుంది. కేంద్ర సాయంతో కలిపి ఎకరానికి కొంత నగదును బదిలీ చేస్తారా? కేంద్రంతో నిమిత్తం లేకుండా రాష్ట్ర ప్రభుత్వమే ఆర్థిక చేయూతనందించాలా అనే అంశాలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయి.

టీడీపీ నేతల తీరుపై ఎమ్మెల్యే చెవిరెడ్డి ఫిర్యాదు

ఆంధ్రభూమి బ్యూరో

తిరుపతి, ఫిబ్రవరి 5: గత రెండు రోజుల క్రితం పసుపు కుంకుమ కార్యక్రమంలో చిత్తూరు జిల్లా చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డిపై జరిగిన దాడి మరువక ముందే ఆయన, ఆయన కుటుంబ సభ్యుల కదలికలపై ఇద్దరు యువకులు రెక్కీ నిర్వహిస్తున్నట్లు గమనించిన ఎమ్మెల్యే నేరుగా ఎఎస్‌పికి ఫిర్యాదు చేశారు. చెవిరెడ్డి ప్రచారం కోసం వినియోగిస్తున్న వాహనాలకు ఈ యువకులు డ్రైవర్లుగా వ్యవహరిస్తుండటాన్ని ఎమ్మెల్యే అనుచరులు గుర్తించారు. ఈ సంఘటనతో చెవిరెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు దిగ్భ్రాంతికి గురవుతున్నారు. ఈ ఇద్దరు డ్రైవర్లు కోవర్టులుగా పనిచేయడాన్ని ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు గుర్తించారు. ఈ విషయమై వారిని నిలదీయగా టీడీపీ నేతలే తమను మీవద్ద డ్రైవర్‌గా పంపించారని అంగీకరించారు. చెవిరెడ్డి కదలికలను టీడీపీ నేతలకు చేరవేయాలని తమకు వారు చెప్పారని నిందితులు చెప్పారు. దీనిపై ఎమ్మెల్యే చెవిరెడ్డి ఎఎస్‌పికి ఫిర్యాదు చేస్తూ తనకు భద్రత కల్పించాలని ఎమ్మెల్యే కోరారు.

అసెంబ్లీ ఆవరణలో అవార్డుల ప్రదర్శన

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, ఫిబ్రవరి 5: రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చిన వివిధ అవార్డులను సందర్శకుల వీక్షణార్థం అసెంబ్లీ ఆవరణలో ప్రత్యేక స్టాల్‌లో ప్రదర్శించారు. గత నాలుగు సంవత్సరాల్లో రాష్ట్ర ప్రభుత్వం ఆధునిక సాంకేతిక పరిజానాన్ని ఉపయోగించుకుని, రియల్ టైమ్‌లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం వివిధ శాఖల్లో పని తీరు మెరుగుపరిచేందుకు చేపట్టిన చర్యలు అనేక అవార్డులను కైవసం చేసుకునేలా చేసింది. దాదాపు 620కు పైగా అవార్డులు రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చాయి. ఈ అవార్డులు ప్రభుత్వ పనితీరుకు దర్పణంగా చెప్పవచ్చు. ప్రతిపక్ష పార్టీలు రాష్ట్ర ప్రభుత్వ పనితీరుపై విమర్శలు చేస్తున్న నేపథ్యంలో ప్రభుత్వ పనితీరుకు నిదర్శనంగా నిలిచే ఈ అవార్డులను ప్రజలు వీక్షించేలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చర్యలు తీసుకున్నారు. అసెంబ్లీ ఆవరణలో ఈ అవార్డులను ప్రదర్శించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వారం రోజుల పాటు ఇవి సందర్శకులు చూసేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. అమరావతి, సచివాలయం చూసేందుకు వస్తున్న సందర్శకులు వీటిని కూడా చూసేలా ఏర్పాట్లు చేశారు.



అసెంబ్లీ ఆవరణలో అవార్డుల ప్రదర్శన


ఆదాయానికి మించిన ఆస్తుల్లో 'సీనియర్'

★ రూ.2 కోట్ల ఆస్తులు గుర్తించిన ఏసీబీ
★ బహిరంగ మార్కెట్‌లో సుమారు రూ.20కోట్ల పైమాటే

ఆంధ్రభూమి బ్యూరో

నెల్లూరు, ఫిబ్రవరి 5: ఆయనొక సాధారణ ప్రభుత్వ ఉద్యోగి. ట్రాన్స్‌కోలో సీనియర్ అసిస్టెంట్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న నెమళ్లపూడి ప్రభాకర్‌రెడ్డి ఆస్తులు కూడబెట్టడంలో కూడా సీనియర్ అనిపించుకున్నారు. ఆయన ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నాడనే ఆరోపణల నేపథ్యంలో నెల్లూరులోని ఆయన ఇంటితో పాటు పలువురు సన్నిహితుల ఇళ్లపై నెల్లూరు ఏసిబి అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సుమారు రూ.2కోట్ల విలువైన ఆస్తులను గుర్తించారు. అయితే బహిరంగ మార్కెట్‌లో ఈ ఆస్తులు మొత్తం సుమారు రూ.20కోట్ల పైమాటే ఉండొచ్చని అధికారుల అంచనా. వివరాల్లోకి వెళితే.. నెల్లూరులోని కొండాయపాలెం ప్రాంతంలో నివాసముంటున్న నెమళ్లపూడి ప్రభాకర్ ఏపి ట్రాన్స్‌కోలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. 1998లో ప్రభాకర్‌రెడ్డి తండ్రి మరణించడంతో కారుణ్య నియామకం కింద ప్రభుత్వ సర్వీసులో ఆయన చేరారు. అప్పట్నుంచి జిల్లాలోనే వివిధ ప్రాంతాల్లో ఆయన విధులు నిర్వర్తించారు. అయితే ఆయన అక్రమాస్తులు కూడబెడుతున్నారనే స్పష్టమైన సమాచారం రావడంతో ఏసీబీ అధికారులు పూర్తి ప్రణాళికతో ఆయన ఇంటిపై మంగళవారం దాడులు నిర్వహించారు. దాడుల సమయంలో ఇంట్లో ప్రభాకర్‌రెడ్డి లేకపోవడంతో ఆయన వచ్చే వరకు ఏసిబి అధికారులు ఎదురుచూశారు. ఆయన వచ్చిన వెంటనే ఇంట్లోకి వెళ్లి సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో ఒక కేజీ బంగారు నగలు, 400గ్రాముల వెండి వస్తువులు, తన పేరుపై ఉన్న రెండు ఇంటి స్థలాలు, భార్యపేరుపై మరో 9చోట్ల ఇళ్లస్థలాలకు సంబంధించిన దస్తావేజులను స్వాధీనం చేసుకున్నారు. అలాగే ప్రభాకర్‌రెడ్డి మామ వాసుదేవరెడ్డి పేరిట ఉన్న మరో ఇంటి స్థలం, 26.13 ఎకరాల వ్యవసాయ భూమికి సంబంధించిన దస్తావేజులు, అత్త పేరిట ఉన్న బుజబుజనెల్లూరులో ఉన్న నివేశన స్థలం తాలూకూ దస్తావేజులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అతని భార్య పేరిట రెండు బ్యాంక్ లాకర్లు ఉన్నట్లు గుర్తించిన అధికారులు ఒక లాకర్‌ను ప్రభాకర్ సమక్షంలో తెరవగా అందులో అరకేజీ బంగారు నగలు ఉన్నట్లు గుర్తించారు. ఈ ఆస్తులన్నింటిని మదింపు వేయగా సుమారు రూ.2కోట్ల వరకూ ఉంటుందని తెలిపారు. అయితే బహిరంగ మార్కెట్‌లో ఈ ఆస్తుల విలువ రూ.20కోట్లపైనే ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

రాజకీయాల్లో అహంభావం పనికి రాదు


అసెంబ్లీలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

న్యాయం చేయమని అడిగితే ఐటీ, ఈడీ, ఆపై ఎదురుదాడులా? ★ దేశ ఆర్థిక వ్యవస్థను భ్రష్టు పట్టించారు
2014లో ఎవరు ఎవరి దగ్గరకు వచ్చారో గుర్తుచేసుకోండి ★ విశాఖ ఎంపీ, ఎమ్మెల్యేలు పార్టీకి రాజీనామా చేయాలి
అమిత్ షా కుమారుడి దోపిడీ కన్పించడం లేదా? ★ శాసనసభలో ముఖ్యమంత్రి చంద్రబాబు

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, ఫిబ్రవరి 5: ప్రధాని నరేంద్రమోదీ దేశ ఆర్థిక వ్యవస్థతోపాటు అన్ని వ్యవస్థలను భ్రష్టు పట్టిస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మండిపడ్డారు. ఇంతటి అహంభావం రాజకీయాల్లో పనికి రాదని, హుందాతనం ఉండాలన్నారు. నాడు కాంగ్రెస్ పార్టీ కూడా ఇదేవిధంగా ఆలోచిస్తే బీజేపీ అధికారంలోకి వచ్చేదా అన్నారు. శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో మంగళవారం వ్యవసాయం, ఉద్యానవనాలు, పశు సంవర్థక, పట్టు పరిశ్రమ, పాడి పరిశ్రమ, వ్యవసాయ, మార్కెట్ రంగాల అభివృద్ధిపై జరిగిన చర్చలో పాలు పంచుకున్న చంద్రబాబు ఒక్కసారిగా అనూహ్యరీతితో ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీ జాతీయ అధ్యక్షులు అమిత్‌షాలపై విరుచుకుపడ్డారు. ఈ సందర్భంగా ఆ పార్టీకి చెందిన సీనియర్ నేత, కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ భార్యా, కుటుంబాన్నే చూసుకోలేని వ్యక్తి ఈ దేశాన్ని ఎలా కాపాడగలరంటూ మండిపడ్డారు. నిజం నిప్పులాంటిదన్నారు. తమ రాష్ట్రానికి న్యాయం చేయమని కోరుతుంటే తమ ఎంపీ, ఎమ్మెల్యేలపై ఐటీ, ఈడీ దాడులు, తనపై ఎదురుదాడులు చేయిస్తున్నారని, ఎంతకాలం చేయగలరో చూద్దామన్నారు. తమపై ఎంత దాడి పెంచితే అంతటి స్థాయిలో పతనం తప్పదంటూ తీవ్ర స్థాయిలో హెచ్చరించారు. పాత బీజేపీకి నేటి బీజేపీకి ఎంతో తేడా ఉందని, నాడు విలువలుండేవన్నారు. రాష్ట్రాన్ని తామేదో ఉద్ధరించినట్లుగా అమిత్‌షా ఇక్కడకు వచ్చి చెబుతున్నారు.. ఏమిచ్చారు.. ఇచ్చింది కూడా వారి దయాదాక్షిణ్యాలపై కాదన్నారు. పలాసలో జరిగిన సభకు ఎంత మంది జనం వచ్చారో చూసారు కదా అంటూ.. ఇక నుంచి బీజేపీ సభలకు ఎవరూ వెళ్లరాదంటూ వెళ్లినవారు రాష్ట్ర ద్రోహులేనన్నారు. అమిత్‌షా కుమారుడి కంపెనీకి రూ. 16వేల కోట్ల మేర ఆస్తులు పెరిగినట్లు చూసినా దాడుల్లేవంటూ, తన కుటుంబానికి అలాంటి పెరుగుదల లేదే అన్నారు. నేనేదో వారి కాళ్ల చుట్టూ తిరిగానంటున్నారు.. 2014 ఎన్నికల సమయంలో ఎవరు ఎవరి వద్దకు వచ్చారో గుర్తు చేసుకోవాలన్నారు. తప్పుడు ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. అరెస్ట్ వారెంట్ ఇచ్చి బెదిరించే ప్రయత్నాలు చేస్తున్నారని ఇది ప్రజాస్వామ్యమా అన్నారు. నేను 40 ఏళ్లుగా ప్రజల్లో ఉండి నాయకునిగా ఎదిగాను.. మమత బెనర్జీ కూడా 40 ఏళ్ల కష్టపడి లీడర్‌గా ఎదిగారు. శరద్ పవార్, ఫరూక్ అబ్దుల్లా చాలా సీనియర్లు.. ఇలాంటి వారిని వేధించే పరిస్థితి వస్తే ఎలా అని ప్రశ్నించారు. ఒక్క రాజకీయ నేతలనే కాదు అధికారులు, మీడియాను కూడా భయపెడుతున్నారన్నారు. కార్పొరేట్ సంస్థలు కూడా భయపడుతున్నాయి.. ఇది తప్పుడు విధానం.. ప్రజాస్వామ్యవాదులు దీన్ని ఖండించాలన్నారు. ఎక్కడికక్కడ తిరుగుబాటు చేస్తే మినహా వారు అదుపులోకి రారన్నారు. అధికారం ఉందని ఇష్టానుసారం చేస్తున్నారన్నారు. 2019 ఎన్నికల అనంతరం తెలుగుదేశం తిరిగి తమతో కలిసేందుకు ప్రయత్నం చేస్తుందని, అయితే తమ తలుపులు మూసి వేసామంటూ అమిత్‌షా నోరుపారేకుంటున్నారని అన్నారు. కేంద్రం ఇంకా చాలా చేస్తుందనుకున్నాం కానీ చేయలేదు. ఇంకా వీరు ఏమి చేయాలన్నా మరో నెల రోజులు మాత్రమే ఉందన్నారు. అయితే ఏమీ చేయలేరని ప్రజలకు అర్థమైంది, వారే తగిన బుద్ధి చెబుతారని బాబు హెచ్చరించారు. ప్రజలే వీరికి తలుపులు మూసివేసే పరిస్థితి వస్తుందన్నారు. ఇంత అహంభావం రాజకీయాల్లో పనికి రాదు, హుందాతనం ఉండాలన్నారు. పద్ధతి లేని, విలువలు లేని రాజకీయాలు చేస్తే మంచిది కాదంటూ, వీరు భయపెడితే ఎవరూ భయపడబోరన్నారు. తిరుగుబాటు చేస్తామంటూ రాష్ట్రంలో ప్రజాహితంతో ముందుకు సాగుతున్నామన్నారు. వాజ్‌పేయి లాంటి సీనియర్ నేతే తన మాటకు విలువ ఇచ్చేవారంటూ రాష్ట్రపతి ఎన్నికల్లో తొలుత అలెగ్జాండర్‌ని అభ్యర్థిగా ప్రకటిస్తే తాను వ్యతిరేకించానని, తిరిగి తనను సముదాయించి తాను సూచించిన అబ్దుల్ కలాం పేరు ప్రకటించారని గుర్తుచేశారు. తిరుపతి సభలో అవినీతిపై ఉక్కుపాదం మోపుతానని, వైకాపా అవినీతి ఊబిలో నుంచి పుట్టిందన్న మోదీ నేడు ఎందుకు ఆ పార్టీకి దగ్గరవుతున్నారని చంద్రబాబు ప్రశ్నించారు.

జనసేన జిల్లా కార్యాలయంపై దాడి

★ బీరు సీసాలు, రాళ్లు విసిరిన దుండగులు ★ నేతలు, కార్యకర్తల ధర్నా

గుంటూరు, ఫిబ్రవరి 5: ఇటీవల జనసేన అధినేత పవన్ కళ్యాణ్ స్వయంగా ప్రారంభించిన జనసేన గుంటూరు జిల్లా పార్టీ కార్యాలయంపై సోమవారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు దాడికి పాల్పడ్డారు. ఖాళీ బీరు సీసాలతో పార్టీ కార్యాలయానికి అమర్చిన అద్దాలను పగలకొట్టే ప్రయత్నం చేశారు. అడ్డుకునే ప్రయత్నం చేసిన కార్యాలయ సెక్యూరిటీ సిబ్బందిపై సైతం సీసాలు, రాళ్లు విసిరి ఉడాయించారు. మంగళవారం ఉదయం సమాచారం అందుకున్న పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున గుంటూరు ఇన్నర్ రింగురోడ్డులో ఉన్న కార్యాలయానికి చేరుకుని ఆందోళనకు దిగారు. తక్షణం దాడికి పాల్పడిన వారిని గుర్తించి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ నేత, మాజీ మంత్రి రావెల కిషోర్‌బాబు నేతృత్వంలో కార్యాలయం ఎదుట రహదారిపై బైఠాయించి ధర్నాకు దిగారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని నేతలకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. ఫిర్యాదు అందిన వెంటనే దర్యాప్తు జరిపి దుండగులను అరెస్ట్ చేస్తామని హామీ ఇవ్వడంతో నేతలు ఆందోళన విరమించారు. కాగా జిల్లా పార్టీ కార్యాలయాన్ని జనసేనాని పవన్ ప్రారంభించి పట్టుమని పది రోజులు కూడా తిరగకుండా అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని దుండగులు దాడికి పాల్పడిన ఘటన అటు రాజకీయవర్గాల్లోనూ, ఇటు పవన్ అభిమానులు, పార్టీ నేతల్లో తీవ్ర చర్చనీయాంశమైంది.


పార్టీ కార్యాలయంపై దాడికి నిరసన తెలుపుతున్న జనసేన కార్యకర్తలు

గుంతకల్లు డివిజన్‌లో పలు రైళ్లు రద్దు

గుంతకల్లు, ఫిబ్రవరి 5: గుంతకల్లు రైల్వే డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న ఇంజినీరింగ్, సేఫ్టీ పనుల కారణంగా పలురైళ్లను రద్దు చేస్తున్నట్లు రైల్వే ఉన్నతాధికారులు ప్రకటించారు. 56501/02 విజయవాడ - హుబ్లీ- విజయవాడ ప్యాసింజర్ రైలును ఈనెల 21 వరకు, 56502 ప్యాసింజర్ రైలును ఈనెల 19వ తేదీ వరకు, 56503/04 బెంగళూరు కంటోన్మెంట్ - విజయవాడ - బెంగళూరు కంటోన్మెంట్ ప్యాసింజర్ రైలును ఈనెల 20వ తేదీ వరకు, 77416/17 గుంతకల్లు - బళ్లారి - గుంతకల్లు ప్యాసింజర్ రైలును 20వ తేదీ వరకు, 77418/19 గుంతకల్లు - హిందూపురం - గుంతకల్లు ప్యాసింజర్ రైలు, 77410/11 డోన్ - గుత్తి - డోన్ ప్యాసింజర్ రైలును ఈనెల 19 వరకు రద్దు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే పాక్షికంగా పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేశారు. 18463/64 భువనేశ్వర్ - కేఎస్ఆర్ బెంగళూరు - భువనేశ్వర్ ఎక్స్‌ప్రెస్ రైలును 9, 10వ తేదీల్లో సాయి ప్రశాంతి నిలయం వరకు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా 11031 ఛత్రపతి శివాజీ టెర్మినల్ - బెంగళూరు రైలును 8, 9 తేదీల్లో, 11302 బెంగళూరు-ఛత్రపతి శివాజీ టెర్మినల్ ఎక్స్‌ప్రెస్ రైలును యలహంక వరకు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

అమరావతిలో మరో రెండు ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, ఫిబ్రవరి 5: రాజధాని అమరావతిలో మరో రెండు ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టులు చేరబోతున్నాయి. మాలక్ష్మీ గ్రూపు నేతృత్వంలో అంతర్జాతీయ స్థాయి విద్యా సంస్థతోపాటు ఐదు నక్షత్రాల హోటల్ సైతం ఏర్పడనున్నాయి. మా లక్ష్మీ గ్రూప్ నిర్మించనున్న ఈ ప్రతిష్టాత్మక సంస్థలకు సంబంధించిన భూమి పూజ బుధవారం జరగనుంది. రూ. 200 కోట్ల అంచనా వ్యయంతో మా లక్ష్మీ డబుల్ ట్రీ బై హిల్టన్ పేరిట ఐదు నక్షత్రాల హోటల్ రూపుదిద్దుకోనుందని ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకులు వై హరిశ్చంద్రప్రసాద్ తెలిపారు. నాలుగు ఎకరాల విస్తీర్ణంలో అత్యాధునిక హంగులతో మా లక్ష్మీ డబుల్ ట్రీ అమరావతికే ప్రతిష్టాత్మకంగా అవతరించనుందన్నారు. అదే విధంగా ప్రతిష్టాత్మక గ్లెండేల్ విద్యా సంస్థ కూడా ఏర్పాటు కానుంది. ఈ సందర్భంగా విద్యాసంస్థ డైరెక్టర్ అంజుమ్ బాబూఖాన్ మాట్లాడుతూ ఇక్కడ కేంబ్రిడ్జ్ సిలబస్‌ను చిన్నారులకు బోధిస్తామన్నారు. విద్యార్థి, ఉపాధ్యాయుల నిష్పత్తి పరంగానూ తాము నూతన అధ్యాయానికి నాంది పలుకుతున్నామని తెలిపారు. సాధారణ బోర్డింగ్ విధానానికి భిన్నంగా చిన్నారులు తమ తల్లిదండ్రులకు దగ్గరగా ఉండేలా డే బోర్డింగ్ వీక్ బోర్డింగ్ వంటి సేవలను అందుబాటులో ఉంటాయన్నారు. సీడ్ యాక్సిస్ రోడ్డులో తిరుమల తిరుపతి దేవస్థానం నేతృత్వంలో నిర్మాణం జరుపుకుంటున్న శ్రీ వెంకటేశ్వరస్వామి వారి దేవాలయం ఎదురుగా ఫిబ్రవరి 6వ తేదీన బుధవారం భూమిపూజ చేపట్టనున్నామని హరిశ్చంద్ర ప్రసాద్ వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, పంచాయతీరాజ్ శాఖ మంత్రి లోకేష్‌లకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

ఇది బడ్జెట్ ప్రసంగమా చంద్రబాబు స్తోత్రమా ?

★ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ విమర్శ

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, ఫిబ్రవరి 5: ఇది బడ్జెట్ ప్రసంగమా .. చంద్రబాబును స్తుతించే స్తోత్రమా అన్నట్లుగా రాష్ట్ర ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడి ఓట్ అన్ ఎకౌంట్ బడ్జెట్ ప్రసంగం సాగిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ విమర్శించారు. ఎన్నికల వేళ సాంప్రదాయబద్ధంగా మధ్యంతర బడ్జెట్ ప్రవేశపెట్టాల్సింది పోయి రాజ్యాంగ విరుద్ధంగా పూర్తి స్థాయి బడ్జెట్‌ను అసెంబ్లీ ముందుంచటం ఏమిటని ప్రశ్నించారు. మళ్లీ అధికారంలోకి వచ్చే అవకాశం లేని ఈ ప్రభుత్వం ఈ స్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టడం అర్థరహితమన్నారు. ఊహాజనిత గణాంకాలతో భారీ కేటాయింపులతో బడ్జెట్‌లో ఆదాయ వనరుల వాస్తవ పరిస్థితిని విస్మరించారన్నారు. ఈ బడ్జెట్‌ను అంకెల గారడీతో తయారు చేసారని, కేవలం కాగితాలపైనే భారీ కేటాయింపులతో మరోసారి వంచనకు సిద్ధమయ్యారని రామకృష్ణ ఒక ప్రకటనలో విమర్శించారు.

జపాన్‌లో ఉద్యోగాలపై ఉత్తరాంధ్ర యువత ఆసక్తి

ఆంధ్రభూమి బ్యూరో

విశాఖపట్నం, ఫిబ్రవరి 5: జపాన్ కంపెనీల్లో ఉద్యోగాలు చేయడానికి మన యువత ముఖ్యంగా ఇంజనీరింగ్ విద్యార్థులు ఆసక్తి కనబరుస్తున్నారు. ఏపీ ప్రభుత్వం చొరవతో తొలిసారి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న జపాన్ జాబ్ ఫెయిర్‌లో విద్యార్థులు తొలి ప్రయత్నంలోనే జపాన్ కంపెనీల అభిమానాన్ని చూరగొన్నారు. సాంకేతిక అంశాల జోలికి వెళ్లకుండా కేవలం హెచ్ఆర్ రౌండ్ ద్వారా విద్యార్థుల వ్యక్తిత్వాన్ని, జపాన్‌లో ఉద్యోగాలు చేయడానికి గల ఆసక్తిని, భావ వ్యక్తీకరణ సామర్థ్యాన్ని జపాన్ నిపుణుల బృందం సుదీర్ఘంగా పరిశీలించింది. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంతోపాటు ఉత్తరాంధ్రలోని పలు ఇంజనీరింగ్ కళాశాలల నుంచి ఎంపిక చేసుకున్న 300 మంది ఇంజనీరింగ్ విద్యార్థులకు ఈ ఇంటర్వ్యూలను నిర్వహించారు.

భారతదేశ యువతరం ప్రపంచంలో ఏ దేశంలో అయినా నెగ్గుకురాగలరు. వారి ఆంగ్లభాషా పరిజ్ఞానం, నైపుణ్యం సంస్థల ప్రగతికి అవసరం. ఈ కారణంగానే జపాన్‌లో వృద్ధుల సంఖ్య పెరుగుతున్న దృష్ట్యా భారతదేశ యువతరంపై దృష్టి సారించామని జాబ్‌ఫెయిర్ సంధానకర్తగా వ్యవహరిస్తున్న న్యూఎరా సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కోజి మురాటా వెల్లడించారు. మంగళవారం జపాన్ జాబ్ ఫెయిర్‌లో తనను కలిసిన విలేఖరులతో ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు భారత్‌లో ఐఐటీలపైనే దృష్టి సారించిన జపాన్ కంపెనీలు గీతం వంటి విశ్వవిద్యాలయాల్లో, ద్వితీయశ్రేణి పట్టణాలలో కూడా సమర్థులైన ఇంజనీరింగ్ యువత ఉన్నట్టు గుర్తించాయన్నారు. జపాన్ తయారు చేసే సాంకేతిక ఉత్పత్తులు కొన్ని మినహా మిగిలిన వాటి గురించి కూడా భారతీయ యువతకు తెలియకపోవడం గమనించి బ్రాండింగ్ కోసం భారత్‌లో ఇతర పట్టణాలకు విస్తరించాలని నిర్ణయించకున్నట్టు ఆయన తెలిపారు.జపాన్ కంపెనీలు భారీ వేతనంతో ఇంజనీరింగ్ విద్యార్థులను ప్రాంగణ నియామకాల్లో ఎంపిక చేసుకోవడానికి ఆసక్తిగా ఉన్నాయని, ముఖ్యంగా ఐటీ, కంప్యూటర్ సైన్స్, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాలకు చెందిన వారిపై దృష్టి సారించినట్టు ఇన్ఫోబ్రిడ్జ్ హోల్డింగ్ గ్రూప్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ సహో సిగేటా తెలిపారు. ర్యాంకింగ్‌లో అగ్రశ్రేణిలో గుర్తింపు పొందిన గీతం వంటి విద్యాసంస్థల నుంచి ఇకపై క్రమం తప్పక విద్యార్థులను ఎంపిక చేసుకోవడానికి జపాన్ కంపెనీలు ముందుకు వస్తున్నాయ


గీతం జాబ్ ఫెయిర్‌లో జపాన్ బృందంతో విద్యార్థులు

మీరూ గెలిచింది ఈవీఎంల ద్వారానే కదా?

★ చంద్రబాబును ప్రశ్నించిన బొత్స

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 5: ఈవీఎంలను తప్పుపడుతున్న ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా గత ఎన్నికల్లో ఈవీఎంల ద్వారానే గెలుపొందారన్న విషయాన్ని మరిచిపోరాదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. గత ఎన్నికల్లో బీజేపీ, టీడీపీలు ట్యాంపరింగ్ చేసి విజయం సాధించినందున ఇప్పుడు ఆ పార్టీ నేతలు భయపడుతున్నారని ఆయన మంగళవారం విలేఖరుల సమావేశంలో విమర్శించారు. పోలీసు వ్యవస్థను చంద్రబాబు భ్రష్టు పట్టించారని ఆయన విమర్శించారు. నిబద్ధత గల పోలీసులకు అన్యాయం జరిగితే సహించేది లేదన్నారు. తమ పార్టీ అధ్యక్షుడు, ఏపీ అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఎప్పుడూ పోలీసులను టార్గెట్ చేసి మాట్లాడలేదని ఆయన తెలిపారు. ఏలూరులో జరగబోయే సభలో వైఎస్ జగన్ బీసీ డిక్లరేషన్‌ను విడుదల చేస్తారని బొత్స చెప్పారు.

నత్తనడకన మహానది ప్రాజెక్టు సర్వే!

ఆంధ్రభూమి బ్యూరో

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 5: రాజమహేంద్రవరంలోని కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) అధీనంలోని జాతీయ జల వనరుల అభివృద్ధి సంస్థ (ఎన్‌డబ్ల్యూడీఏ) డివిజన్ కార్యాలయాన్ని సబ్-డివిజన్ స్థాయికి కుదించడంతో మహానది ప్రాజెక్టు సర్వే నత్తనడకన సాగుతోంది. గోదావరి నదితో మహానది అనుసంధాన ప్రాజెక్టు సమగ్ర సర్వే రాజమహేంద్రవరంలోని సీడబ్ల్యూసీ డివిజన్ కార్యాలయం పర్యవేక్షించేది. 2012లో డివిజన్ స్థాయి నుంచి సబ్ డివిజన్‌కు ఈ కార్యాలయం స్థాయిని కుదించడంతో సిబ్బంది కొరత ఏర్పడింది. అన్ని హోదాల్లో దాదాపు పాతిక మంది వరకు సిబ్బంది వుండే ఈ కార్యాలయం కాస్తా కేవలం ఐదుగురికే పరిమితమైంది. గోదావరి నదిని మహానదితో అనుసంధానం చేసే ప్రక్రియకు సంబంధించి ఈ నెల 13వ తేదీన భువనేశ్వర్‌లో అధికారుల సమీక్షా సమావేశాన్ని ఏర్పాటుచేశారు. ఇప్పటికే దాదాపు సర్వే పూర్తయింది. పూర్తిస్థాయి నివేదికకు సంబంధించిన కసరత్తు జరుగుతోంది. ఒడిసాలోని మణిభద్ర డ్యామ్ నుంచి మహానది నీటిని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ మీదుగా తూర్పు గోదావరి జిల్లాలో రాజమహేంద్రవరం రూరల్ మండలం తొర్రేడు వద్ద గోదావరి నదిలో అనుసంధానం చేయనున్నారు. వాస్తవంగా దీనికి సంబంధించిన సర్వే పూర్తయింది. అయితే మహిభద్ర డ్యామ్ వద్ద అవసరమైన నీటి లభ్యత కాస్తంత తక్కువగా ఉంటోందని తేలడంతో డ్యామ్‌కు కాస్త ఎగువన నీటిని తీసుకొచ్చి గోదావరి నదిలో అనుసంధానం చేసే విధంగా మళ్లీ సర్వే చేపట్టారు. సర్వే అనంతరం డీపీఆర్ రూపొందనుంది. ఈ మొత్తం కార్యకలాపాలన్నీ నివేదికలు తయారుచేసే ప్రక్రియ అంతా డివిజన్ స్థాయిలో ఉన్నపుడు రాజమహేంద్రవరం కార్యాలయం నుంచే జరిగేది. ఇపుడు సర్వే తదితర ప్రక్రియలన్నీ భువనేశ్వర్‌లోని డివిజన్ కార్యాలయం పర్యవేక్షిస్తోంది. దీంతో పనులు మందగించాయి. న్యూఢిల్లీలోని సీడబ్ల్యూసీ డైరెక్టర్ జనరల్ అధీనంలో సౌత్ జోన్, నార్త్ జోన్‌లకు ఒక్కో జోన్‌కు ఒక్కో సీఈ ప్రధాన అధికారిగా కార్యాలయాలను విభజించారు. సౌత్ జోన్ సీఈ కార్యాలయం అధీనంలో హైదరాబాద్‌లో ఎస్ఈ కార్యాలయం, ఆ కార్యాలయం అధీనంలో హైదరాబాద్, బెంగళూరు, నాసిక్, నాగపూర్, వల్సాన్‌లో డివిజన్ కార్యాలయాలున్నాయి. నార్త్ జోన్ సీఈ కార్యాలయం ఆధీనంలో లక్నోలోని సర్కిల్ ఎస్ఈ కార్యాలయం పరిధిలో గ్వాలియర్, భువనేశ్వర్, కోల్‌కతా, పాట్నా, జయపూర్, ఝాన్సీ డివిజన్ కార్యాలయాలున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్ తర్వాత డివిజన్ కార్యాలయం ఒక్క రాజమహేంద్రవరంలోనే వుండేది. ఈ కార్యాలయం ప్రాధాన్యత తెలియకపోవడంతో ఇక్కడ నుంచి డివిజన్ కార్యాలయాన్ని తరలించి సబ్ డివిజన్ కార్యాలయంగా మార్చుతున్నా చూస్తుండిపోయారు. డివిజన్ స్థాయిలో వుండగా గతంలో గోదావరి నదికి సంబంధించి సర్వే, నీటి మట్టాలు, నదీ నీటి లభ్యత తదితర అన్ని నివేదికలు ఈ కార్యాలయం నుంచే రూపొందించి పర్యవేక్షించేవారు. తీరా పోలవరం పనులు ముమ్మరం అవుతున్న తరుణంలో ఇక్కడి డివిజన్ కార్యాలయాన్ని సబ్ డివిజన్ స్థాయికి కుదించి సౌత్ జోన్ నుంచి నార్త్ జోన్‌కు మార్చడంతో భువనేశ్వర్ నుంచి ఈ కార్యాలయ కలాపాలు పర్యవేక్షిస్తున్నారు.

2012లో డివిజన్ స్థాయి నుంచి సబ్ డివిజన్ స్థాయికి మార్చారు. దానిని మళ్లీ 2015లో సౌత్ జోన్ సర్కిల్ నుంచి నార్త్ జోన్ సర్కిల్‌కి మార్చి భువనేశ్వర్ డివిజన్‌కు అనుసంధానంచేశారు. వాస్తవానికి సీడబ్ల్యూసీ అధీనంలో 1983 నుంచి రాజమహేంద్రవరం కేంద్రంగా ఇక్కడ డివిజన్ ఏర్పాటైంది. అప్పట్లో ఈ డివిజన్ కార్యాలయంలో ఒక ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ముగ్గురు ఏఈలు, ఐదుగురు జేఈలు తదితరులతో పూర్తిస్థాయిలో పనిచేసేది. 2102లో సబ్ డివిజన్‌గా మార్చి భువనేశ్వర్ డివిజన్‌లో కలిపేశారు. దీంతో రిటైరైనవారు రిటైరవ్వగా ఇపుడు కేవలం ఐదుగురు సిబ్బందే ఉన్నారు. ఏదేమైనప్పటికీ కార్యాలయం స్థాయిని పెంపొందించి మహానది సర్వేను మరింత వేగవంతం చేసేలా కేంద్రం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఢిల్లీ, ముంబైలకు రాత్రి సర్వీసులేవీ?

ఆంధ్రభూమి బ్యూరో

విశాఖపట్నం, ఫిబ్రవరి 5: విశాఖ నుంచి అమెరికా, యూరోపియన్ దేశాలకు వెళ్లాలనుకునే విమాన ప్రయాణికులకు చుక్కలు కనిపిస్తున్నాయి. దేశ రాజధాని ఢిల్లీ, ఆర్థిక రాజధాని ముంబై నుంచి అంతర్జాతీయంగా విమాన అనుసంధానత అధికం. విశాఖ నుంచి రాత్రి వేళ జెట్ ఎయిర్ వేస్ ఢిల్లీ, ముంబైలకు నడిపే విమాన సర్వీసులను ఇటీవల ఉపసంహరించుకోవడంతో పరిస్థితి దయనీయంగా మారింది. ప్రస్తుతం విశాఖ నుంచి సింగపూర్, బ్యాంకాక్, కౌలాలంపూర్‌లకు మాత్రమే అంతర్జాతీయ సర్వీసులు అందుబాటులో ఉన్నాయి. అమెరికా, యూరోపియన్ దేశాలకు వెళ్లాలంటే అత్యధికంగా అనుసంధానత ఉంది. ఈ నేపథ్యంలో ఢిల్లీ, ముంబై పట్టణాలకు విశాఖ నుంచి రాత్రి వేళ విమాన సర్వీసుల అవసరం ఎంతైనా ఉంది. ఇటీవల ఎయిర్ ఇండియా డైరెక్టర్‌ను కలిసిన ఆంధ్రప్రదేశ్ ఎయిర్ ట్రావెల్స్ అసోసియేషన్ (ఏపీఏటీఏ) ఢిల్లీ, ముంబైలకు రాత్రి వేళ విమాన సర్వీసులపై విజ్ఞప్తి చేసింది. అలాగే విశాఖ, హైదరాబాద్ మధ్య లేట్ నైట్, అర్లీ మార్నింగ్ వేళల్లో విమానాలు నడిపితే దేశంలో ఎక్కడ నుంచి ఎక్కడకైనా ఉదయం వెళ్లి రాత్రికి విశాఖ చేరుకునే వీలుంటుంది. ప్రస్తుతం రాత్రి ఏడు గంటల తరువాత ఈ రెండు పట్టణాల మధ్య సర్వీసులు లేవు. విశాఖ విమానాశ్రయంలో రాత్రి వేళలో విమానాలు పార్కింగ్ చేసుకునే అవకాశం ఉన్నప్పటికీ పలు విమానయాన సంస్థలు విముఖత చూపుతున్నాయి. విశాఖ నుంచి ఉదయాన్నే విజయవాడకు ఇండియన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఒక విమానం ఎయిర్‌పోర్టులో రాత్రి వేళ నిలిపి ఉంచుతున్నారు. మిగిలిన ప్రాంతాల నుంచి వచ్చిన విమానాలు తిరిగి వెళ్లేలా షెడ్యూల్ మేరకు నడుస్తున్నాయి. రాత్రి వేళ వచ్చే విమానాలు రాత్రి వేళ పార్కింగ్ చేయాలంటే అందుబాటులో వసతి సదుపాయం అవసరం.



విమాన క్రూ రాత్రి వేళల్లో బసచేసి, తిరిగి ఉదయాన్నే విధులకు హాజరయ్యేందుకు వీలుగా ఉంటుంది. ఇక విశాఖ అంతర్జాతీయ విమానాశ్రయంగా ఉన్నప్పటికీ ప్రస్తుతం వీఐపీ లాంజ్‌లో వసతి కొరత వేధిస్తోంది. ప్రస్తుతం విమానాశ్రయం వీఐపీ లాంజ్‌లో కేవలం నాలుగు మాత్రమే గదులు బసకు వీలుగా ఉన్నాయి. వీటికి అదనంగా మరో 10 గదులు ఏర్పాటు చేస్తే దేశీయ, విదేశీ ప్రయాణీకులు కొద్దిసేపు విశ్రాంతి అవసరాలు తీరుతాయి. ఈ సమస్యలను ఎయిర్‌పోర్టు అథారిటీ దృష్టికి తీసుకు వెళ్లనున్నట్టు ఏపీఏటీఏ ఉపాధ్యక్షుడు నరేష్ కుమార్ 'ఆంధ్రభూమి'కి తెలిపారు. ఇటీవల తాము ఢిల్లీలో పలు అంశాలపై ఎయిర్ ఇండియా డైరెక్టర్‌ను కలిసి చర్చించామని, త్వరలోనే తమ ప్రతిపాదనలు పరిష్కరించనున్నట్టు హామీ ఇచ్చారని తెలిపారు.

ఆంధ్రభూమి

జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ

బుధవారం, 6 ఫిబ్రవరి 2019

జనం నిలదీయాలి..

అఫ్ఘనిస్థాన్ నుంచి, పాకిస్తాన్ నుంచి, బంగ్లాదేశ్ నుంచి తరిమివేతకు గురైన భరతమాత బిడ్డలకు మన దేశ పౌరసత్వం కల్పిస్తామన్నది ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పదే పదే చెబుతున్న మాట! మూడవ తేదీన జమ్మూ కశ్మీర్‌లోని లడక్‌లో పర్యటించిన సందర్భంగా ఈ హామీని ప్రధాని మరోసారి పునరుద్ధరించారు. ఇందుకోసం ప్రభుత్వం 1955 నాటి ''పౌరసత్వపు చట్టానికి'' సవరణలను చేయతలపెట్టింది. ఈ సవరణలను పార్లమెంటు ఆమోదించినట్టయితే పొరుగు దేశాల నుంచి తరిమివేతకు గురైన దాదాపు రెండు లక్షల మంది ఇస్లామేతర మతాల 'భారతీయుల'కు మళ్లీ మన దేశపు పౌరసత్వం లభిస్తుందని 2016లో ప్రచారమైంది. తరిమివేతకు గురైన వారు ఒకప్పుడు 'అఖండ భారత్' పౌరులన్నది చారిత్రక సత్యం. గత నెలలో లోక్‌సభ ఆమోదించిన ఈ 'సవరణ'ను రాజ్యసభలో కొన్ని రాజకీయ పక్షాలు వ్యతిరేకిస్తుండడం నడుస్తున్న చరిత్ర. ఇది మొదటి వైపరీత్యం. అస్సాంలో 'పౌరుల జాతీయ సూచిక'- నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజెన్స్- ఎన్‌ఆర్‌సి- రూపొందడం వల్ల ఆ ప్రాంతంలో అక్రమంగా నివసిస్తున్న విదేశీయులు బయటపడతారు. ఈ అక్రమ ప్రవేశకులను దేశం నుంచి బహిష్కరించడానికి వీలవుతుంది. కానీ ఈ 'జాతీయ సూచిక' రూపొందరాదని కొన్ని రాజకీయ పక్షాలు వాంఛిస్తున్నాయి. ఈ 'సూచిక' రూపొందడం వల్ల లక్షల మందికి దేశంలో నిలువనీడ లేకుండా పోతుందన్నది ఈ పక్షాల వాదన. కానీ ఇలా నిలువనీడ లేకుండాపోనున్న వారు ఈ దేశంలోకి అక్రమంగా చొరబడి తిష్ఠవేసినవారు, వారి వారసులు. దశాబ్దులపాటు బంగ్లాదేశ్ నుంచి అస్సాంలోకి, బెంగాల్‌లో ఇతర ఈశాన్య ప్రాంతాలలోకి లక్షల మంది అక్రమంగా చొరబడిపోయారు. ఈ చొరబాటుదారులలో జిహాదీ బీభత్సకారులు కూడ వేల సంఖ్యలో ఉండడం బహిరంగ రహస్యం. 'ఎన్‌ఆర్‌సి'ని రూపొందించాలన్న కార్యక్రమం సర్వోన్నత న్యాయస్థానం వారి ఆదేశం ప్రకారం 2013 నుంచి కొనసాగుతోంది. ఈ 'చొరబాటు'వల్ల అస్సాంలోను, బెంగాల్‌లోను విదేశీయుల జనాభా విపరీతంగా పెరిగింది. మన దేశంలోకి రెండు కోట్ల మంది బంగ్లాదేశీయులు అక్రమంగా ప్రవేశించి తిష్ఠవేసి ఉన్నట్టు 2016 నవంబర్ 16న కేంద్ర ప్రభుత్వం రాజ్యసభకు తెలిపింది. ఈ అక్రమ ప్రవేశకులను మన దేశపు పౌరుల నుంచి వేఱుచేయడానికి వీలుగా 'ఎన్‌ఆర్‌సి' కార్యక్రమం మొదలైంది. నిజానికి దేశమంతటికీ 'ఎన్‌ఆర్‌సి' రూపొందాలన్నది 1950 దశకంలోనే ప్రభుత్వం ఆమోదించిన విధానం. ఇప్పుడు అస్సాంలో 'ఎన్‌ఆర్‌సి' రూపొందుతోంది. పశ్చిమ బెంగాల్‌లో కూడ రూపొందే అవకాశం ఉంది. కానీ 'ఎన్‌ఆర్‌సి'ని కొన్ని రాజకీయ పక్షాలు వ్యతిరేకిస్తున్నాయి. ఇలా వ్యతిరేకిస్తున్న పక్షాలలో బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అధ్యక్షత వహిస్తున్న తృణమూల్ కాంగ్రెస్ ముందు వరసలో ఉంది. ఇది రెండవ వైపరీత్యం. గత ఆగస్టులో అస్సాంకు వెళ్లి 'ఎన్‌ఆర్‌సి'కి వ్యతిరేకంగా 'ప్రదర్శనలు' జరుపనెంచిన తృణమూల్ కాంగ్రెస్ బృందం సభ్యులను అస్సాం పోలీసులు నిరోధించి వెనక్కి పంపారు. సోమ,మంగళవారాలలో మమతాబెనర్జీ బృందం వారు కలకత్తాలో జరిపిన అకాండ తాండవానికి 'ఎన్‌ఆర్‌సి' పట్ల వ్యతిరేకత కూడ ఒక కారణం!

పాకిస్తాన్‌లోను అఫ్ఘానిస్థాన్‌లోను బంగ్లాదేశ్‌లోను జిహాదీల హత్యాకాండ నుంచి తప్పించుకొని పారిపోయి శరణార్థులుగా తలదాచుకుంటున్నవారు హిందువులు. 1947లో 'అఖండ భారత్' విభజన జరుగకపోయి ఉండినట్టయితే, అంతకు పూర్వమే బ్రిటన్ దురాక్రమణదారులు మన దేశం నుంచి అఫ్ఘానిస్థాన్‌ను విడగొట్టకపోయినట్టయితే ఈ హిందువులు, ఈ భారతీయులు- తరతరాలుగా ఈ మూడు ప్రాంతాలలోను నివసించినవారు తమ స్వస్థలాలను వదలిపెట్టవలసి వచ్చేది కాదు. ఎందుకంటె తరతరాలుగా అఖండ భారత్‌లో సర్వమత సమభావ సమాజం వికసించింది. అన్ని హైందవ జాతీయ మతాల వారు, విదేశాల నుంచి వ్యాపించిన యూదు, పారశీక, ఇస్లాం, క్రైస్తవ మతాలవారు సమాన అధికారాలతో హాయిగా జీవించారు. 1947 తరువాత ఇస్లాం మతస్థులు అధిక సంఖ్యలో ఉన్న బంగ్లాదేశ్‌లోను, పాకిస్తాన్‌లోను అల్పసంఖ్యలో ఉన్న ఇస్లామేతరులను 'జిహాదీ'లు నిర్మూలించడం మొదలైంది. అఫ్ఘానిస్థాన్‌లో కూడ 'జిహాదీ'ల బీభత్సకాండ నుండి తప్పించుకొని ప్రాణావశిష్టులైన ఇస్లామేతర మతాలవారు మన దేశానికి శరణార్థులుగా వచ్చేశారు. ఒకప్పటి అఖండ భారత పౌరులైన వీరందరూ అవశేష భారత్‌లో సహజంగానే పౌరులు. అఖండ భారత్‌లో వలెనే అవశేష భారత్‌లో కూడ సర్వమత సమభావ సమాజం యథాతథంగా కొనసాగుతోంది కనుక ఈ శరణార్థులు ఈ దేశంలో మాత్రమే తమకు భద్రత ఉందని భావిస్తున్నారు. ఇలాంటి శరణార్థుల సహజమైన భారతీయ వారసత్వపు హక్కులు, పౌర సత్వపు హక్కులు హరించిపోవడం 1947 నాటి అఖండ భారత విభజన ఫలితం. తమ దేశంలోనే శరణార్థులుగా మారిన ఈ శరణార్థులకు పౌరసత్వం కల్పించకపోవడం సహజ న్యాయసూత్రాలకు విరుద్ధం. కానీ ఈ సహజ న్యాయాన్ని అనేక రాజకీయ పక్షాలు ఎందుకని వ్యతిరేకిస్తున్నాయి? దేశ ప్రజలకు ఈ రాజకీయవాదులు సమాధానం చెప్పవలసి ఉంది.

ఇలా సహజమైన అర్హత ఉన్న శరణార్థులకు పౌరసత్వం ఇవ్వరాదని వాదిస్తున్న రాజకీయ పక్షాలవారు, బంగ్లాదేశ్ నుంచి బర్మా నుంచి మన దేశంలోకి చొరబడిన అక్రమ ప్రవేశకులకు మాత్రం మన దేశపు పౌరసత్వం ఇవ్వాలని వాదిస్తున్నారు. శరణార్థులు 'జిహాదీ'ల మతోన్మాదానికి బలైన వారు, ఇస్లాం మతేతర హిందువులు. అక్రమ ప్రవేశకులు ఇస్లాం మతస్థులు. ఈ అక్రమ ప్రవేశకులలో మన దేశంలో బీభత్సకాండను జరుపడం లక్ష్యంగా చొరబడిన 'జిహాదీ'లు కూడ ఉన్నారు. అందువల్ల జాతీయ నిష్ఠకల, దేశభద్రత పట్ల నిబద్ధతకల అన్ని రాజకీయ పక్షాలవారు శరణార్థులకు మన దేశపు పౌరసత్వం కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న చట్టాన్ని సమర్థించాలి, అక్రమ ప్రవేశకులను వెళ్లగొట్టడానికై రూపొందిన 'జాతీయ సూచిక'ను సమర్థించాలి. కానీ అనేక రాజకీయ పక్షాలు ఈ రెండు అంశాలలోను విపరీత విధానాన్ని అనుసరిస్తున్నాయి. శరణార్థులకు పౌరసత్వం కల్పించరాదట, అక్రమ ప్రవేశకులను వెళ్లగొట్టరాదట! ఇలాంటి రాజకీయ పక్షాలను జనం నిలదీయవలసిన అనివార్యం ఏర్పడి ఉంది. ఇలా నిలదీయడానికి మాధ్యమం ఎన్నికలలో ఈ మానవత్వం లేని పక్షాలను, అక్రమ ప్రవేశకులను సమర్థిస్తున్న పక్షాలకు వ్యతిరేకంగా వోట్లు వేయడం.. కేంద్ర ప్రభుత్వాన్ని నిర్వహిస్తున్న రాజకీయ పక్షాన్ని విపక్షాలు వ్యతిరేకించవచ్చు, ఓడించడానికి యత్నించవచ్చు. ఇదంతా ప్రజాస్వామ్య రాజ్యాంగ ప్రక్రియలో భాగం. కానీ సహజ మానవీయ న్యాయసూత్రాలను నిలబెట్టడంలోను, జాతీయ సమైక్యాన్ని ప్రాదేశిక సమగ్రతను ఆంతరంగిక భద్రతను పరిరక్షించడంలో అన్ని రాజకీయ పక్షాలకు సమాన బాధ్యత ఉంది. అన్ని రాజకీయ పక్షాలవారు ఈ జాతీయ భూమికపై నిలబడి ఆత్మమధనం చేసుకోవాలి!!


ఈ శరణార్థుల సమస్య, ఈ అక్రమ ప్రవేశకుల సమస్య- ఈ రెండూ మన పొరుగు దేశాలలోని బీభత్స రాజ్యాంగ వ్యవస్థలతో ముడివడి ఉన్నాయి. ఇస్లాం మతస్థులను తప్ప మరో మతం వారిని బతకనివ్వరాదన్న జిహాదీ స్వభావం ఈ పొరుగు దేశాల సమష్టి సమాజ స్వభావం.. అందువల్ల తమ దేశంలోని అల్పసంఖ్య మతస్థులను జిహాదీలు నిర్మూలిస్తున్నారు. మన దేశంలో ఇస్లాం మతస్థుల సంఖ్యను పెంచడానికై బంగ్లాదేశ్ నుంచి బర్మానుంచి అక్రమ ప్రవేశకులు చొరబడుతున్నారు. ఇస్లాం మతస్థులు అధిక సంఖ్యలో ఉన్న, ఇస్లాం మతస్థులు సంఖ్యా బాహుళ్యం సాధించిన దాదాపు అన్ని దేశాలలోను 'సర్వమత సమభావం' అడుగంటిపోవడానికి కారణం జిహాదీలు. సామాన్య ఇస్లాం ప్రజలకు ఈ జిహాదీ లక్ష్యాలతో సంబంధం లేదు.. మన దేశంలోని రాజకీయ పక్షాలు గ్రహించవలసిన అంతర్జాతీయ పాఠం ఇది!

మమ్మల్ని తోడేళ్ల పాల్జేశారు..

స్వాతంత్ర్య సముపార్జనమనే మహోన్నత లక్ష్యానికి తన జీవితాన్ని అంకితం చేసి చరిత్రలో నిలిచిపోయిన రాజకీయ, ధార్మిక నాయకుడు ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్. 'సరిహద్దు గాంధీ'గా ప్రఖ్యాతి పొందిన ఖాన్ 1890, ఫిబ్రవరి 6న బ్రిటిష్ ఇండి యాలోని పెషావర్ లోయలో సంపన్న కుటుంబంలో జన్మించారు. అతని తండ్రి బహ్రం ఖాన్ ఒక భూస్వామి. బ్రిటిష్ వారి ఎడ్వర్డ్స్ మిషన్ పాఠశాలలో చదువుతూ తెలివైన విద్యార్థిగా పేరు పొందారు.

మనుషుల్లో దేవుడిగా జాతిపిత గాంధీజీచే ప్రశంసలు పొందిన ఆయన జీవితం నేటికీ అందరికీ ఆదర్శప్రాయం. బ్రిటిష్ పాలకుల గుండెల్లో రైళ్లు పరుగెత్తించిన ఆయన పాకిస్తాన్‌లోని పంఖ్తూన్ రాష్ట్రంలో పఠాన్‌గా పుట్టి అహింసా మార్గమే ఆయుధంగా మార్చుకొని 'పఠాన్ యమ డేంజర్' అని అప్పటి పాలకులతో అనిపించుకున్న ధీరోదాత్తుడు. 'నేను ఆయుధంతో యుద్ధం చేసే పఠాన్‌ను కాను. ఏ పరిస్థితుల్లోనైనా నాది అహింసామార్గమే. పగ, ప్రతీకారాలు నాకు నచ్చవు. నన్ను అణచివేసి, హింసించిన వారిని కూడా క్షమిస్తాను' అన్న ప్రతిజ్ఞతతో 'కుదాయ్ కిద్మత్ గర్' పేరిట ఎర్ర చొక్కాల ఉద్యమం లేవనెత్తి భారత స్వాతంత్ర్య పోరాటానికి స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసిన శాంతికాముకుడు సరిహద్దు గాంధీ.

దేశ విభజన సమయంలో ఫఖ్తూన్ రాష్ట్రంలో చెలరేగిన అల్లర్లలో ముస్లింల దాడుల నుంచి ఎంతోమంది హిందువులను, సిక్కులను ఆయన కాపాడారు. ఆ సమయంలో ఆయనకు కుదాయ్ కిద్మత్ గర్ సేన ఎంతో సహాయపడింది. అల్లర్లను ఆపేందుకు ఆయన మహాత్మాగాంధీతో కలసి బిహార్ వెళ్లి ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. భారత్‌ను తగులబెడితే హిందూ, ముస్లిం, సిక్కు, క్రైస్తవులు అందరం దగ్ధం అవుతామని హెచ్చరించారు. శాంతి, సౌభ్రాతృత్వాలతో సమరాన్ని సాగించమని చెప్పారు. ఇటు బ్రిటీష్ ఇండియాలో, అటూ పాక్‌లో 27 ఏళ్లపాటు జైలు జీవితాన్ని అనుభవించిన సరిహద్దు గాంధీ అఫ్గాన్ లోని



గాంధీజీతో గఫార్ ఖాన్ మాట్లాడుతూ- 'మీకు అండగా నిలబడ్డాం.. మీతో పాటు పఠాన్లు దేశ స్వాతంత్ర్యం కోసం ఎన్నో త్యాగాలు చేశారు. మమ్మల్ని తోడేళ్ల పాల్జేశారు' అన్నారు. 'మాకు మరో అవకాశం ఇవ్వలేదు..' అని ఖాన్ తన బాధను వ్యక్తం చేస్తూ దేశ విభజన అనంతరం పెషావర్‌కే పరిమితం అయ్యారు.

కాబూల్ నగరానికి వెళ్లి ప్రవాస జీవితం గడిపారు. తుది శ్వాస విడిచేంత వరకు నమ్ముకున్న సిద్ధాంతానికే కట్టుబడి జీవించారు.

గాంధీజీ పిలుపు మేరకు 1930లో సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొనేందుకు ఆయన ఉట్మంజాయ్ నుంచి పెషావర్ వెళుతుండగా అరెస్ట్ చేశారు. ఇది తెలిసిన కుదాయ్ కిద్మత్ గర్ సేనకు చెందిన కార్యకర్తలు భారీ సంఖ్యలో పోలీస్ స్టేషన్‌ను చుట్టుముట్టారు. వారిపై కాల్పులు జరపాల్సిందిగా బ్రిటీష్ అధికారులు ఉత్తర్వులివ్వగా- 'కాల్పులు జరిపినా ఫర్వాలేదు. ప్రాణాలిస్తాం' అంటూ శాంతియుత నినాదాలతో సమన్వయం పాటించిన ప్రజలపై కాల్పులు జరిపేందుకు సైనికులు నిరాకరించారట. అదే సమయంలో అరెస్టయిన మహాత్మాగాంధీని, ఆయన అనుచరులను 1931 జనవరి నెలలో విడుదల చేశారు. ఖాన్‌ను మాత్రం విడుదల చేయలేదు. చివరకు గాంధీయే ఖాన్‌ను విడిపించారు. ఆ తర్వాతఖాన్ ను మళ్ళీ అరెస్ట్ చేసి నాలుగేళ్ల పాటు జైల్లో పెట్టారు. పోలీసులు అరెస్టులు చేయడం, ఏదో ఒక కారణాన్ని పేర్కొంటూ విడుదల చేయటం గఫార్ ఖాన్ జీవితంలో భాగమైపోయింది.

1929లో ప్రారంభమై 1948లో అదృశ్యమైన ఖుదా-యే-ఖిద్మత్ గర్ సేన స్వాతంత్రోద్యమంలో ప్రపంచ ప్రజలందరి జేజేలు అందుకుంది. గఫార్ ఖాన్ అభ్యర్థన మేరకు వాయవ్య సరిహద్దు రాష్ట్రంలో పర్యటించిన మహాత్మాగాంధీ మాట్లాడుతూ, 'ఖుదా-యే-ఖిద్మత్ గర్ కార్యకర్తల్లా ఓ వెయ్యిమంది తయారైతే చాలు, బానిసత్వమనే సామాజిక రుగ్మతను దేశం సరిహద్దులను దాటించవచ్చు' అని ప్రశంసించారు.

ఆ రోజుల్లో కుదాయ్ కిద్మత్ గర్‌కు ప్రజల్లో ఎంతో ఆదరణ ఉండేది. 1946లో జరిగిన ప్రావిన్షియల్ ఎన్నికలలో గఫార్ ఖాన్ నేతృత్వంలో కాంగ్రెస్ తిరిగి అధికారాన్ని చేపట్టింది. ముస్లింలీగ్‌కు మరోసారి పరాజయం తప్పలేదు. ఆ పరాభవం నుండి కోలుకునేందుకు ముస్లిం లీగ్ భారత్ విభజన యత్నాలకు ఊపిరి పోస్తూ, అధికార దాహార్తులైన రాజకీయ నేతలను, వ్యాపారవేత్తలను, పెట్టుబడిదారులను, భూస్వాములను అధికారం, ఆదాయం ఎరవేసి ఆకట్టుకోసాగింది. ఆంగ్లేయ అధికారులు, పాలకులు ముస్లింలీగ్‌కు మిత్రులుగా వ్యవహరించసాగారు. మొదటి నుంచి దేశ విభజనను వ్యతిరేకిస్తూ వచ్చిన ఖాన్ చివరకు నిర్ణయాన్ని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీకే వదిలేశారు. ఆ సమావేశం అత్యధిక మెజారిటీతో దేశ విభజన తీర్మానాన్ని ఆమోదించింది. విభజన అనివార్యం అనిపించే పరిస్థితులను గమనించిన ఖాన్ ఆవేదన చెందారు. 1947 మే 1న భారత జాతీయ కాంగ్రెస్ దేశ విభజనకు సూత్రప్రాయంగా అంగీకరించింది. జూన్ 3న విభజనకు సమ్మతి తెలియచేసింది. విభజన తీర్మానం ప్రవేశపెట్టగా దానిని వ్యతిరేకించిన ఏకైక వ్యక్తి ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్. ఆ రోజున గఫార్ ఖాన్ గాంధీజీతో మాట్లాడుతూ, 'మహాత్మా ఇక నుండి మమ్మల్ని పాకిస్తాన్ వారంటారు. విదేశీయులం అంటారు.. అవునా..? అంటూ గుండెల్లోతుల్లో నుంచి పెల్లుబికిన మనోవ్యధను వ్యక్తం చేశారు.

భారత విభజన జరిగితే వాయవ్య సరిహద్దు రాష్ట్రం పాకిస్తాన్ లోకి వెళ్ళే అవకాశం ఉంది. ముస్లింలీగ్ పాకిస్థాన్ లో ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంది. ఆ పరిణామాలు సంభవిస్తే అంతవరకు ముస్లింలీగ్ ను, విభజనను వ్యతిరేకించిన పాపానికి ఖాన్ సోదరులు, వారి అనుచరగణం, ఖుదా-యే-ఖిద్మత్ గర్ కార్యకర్తలు నూతన ప్రభుత్వ కక్షసాధింపు చర్యలకు గురికావాల్సి వస్తుంది. ఈ పరిస్థితులను అంచనా వేసిన ఖాన్ గాంధీజీతో మాట్లాడుతూ 'మీకు అండగా నిలబడ్డాం.. మీతో పాటు పఠాన్లు దేశ స్వాతంత్ర్యం కోసం ఎన్నో త్యాగాలు చేశారు. మమ్మల్ని తోడేళ్ల పాల్జేశారు' అన్నారు. 'మాకు మరో అవకాశం ఇవ్వలేదు..' అని ఖాన్ తన బాధను వ్యక్తం చేస్తూ దేశ విభజన అనంతరం పెషావర్‌కే పరిమితం అయ్యారు.

ఖాన్ అన్నట్లుగానే ఖుదా-యే-ఖిద్మత్ గర్ కార్యకర్తలు అణచివేతకు గురికావాల్సి వచ్చింది. బ్రిటీష్ ప్రభుత్వ కాలంలో 15 ఏళ్లు జైలు జీవితం చవిచూసిన గఫార్ ఖాన్ ను నూతన ప్రభుత్వం ఏమీ చేయలేకపోయింది. తన అనుచరుల పరిస్థితి ఆయనకు ఆందోళనకు గురి చేసింది. స్వాతంత్ర్య సమరయోధులైన ఖుదా-యే-ఖిద్మత్ గర్ కార్యకర్తలపై పాక్ ప్రభుత్వం ఎటువంటి కక్షసాధింపు చర్యలకు పాల్పడినా తాను సహించనని గఫార్ ఖాన్‌కు గాంధీజీ ఊరట కలిగించారు. కానీ అది ఊరటగానే మిగిలిపోయింది. ఖాన్, ఆయన అనుచరులు పాకిస్థాన్ పాలకవర్గాల చేతుల్లో పలు ఇక్కట్లపాలయ్యారు. ఈ విషయాలను గఫార్ ప్రస్తావిస్తూ- 'ముస్లిం లీగ్ వారు ఖుదా-యే-ఖిద్మత్ నాయకులను అంతం చేయాలని తమ కార్యకర్తలను ప్రోత్సహిస్తున్నారు. ఇస్లాంకు వ్యతిరేకులైన అందరినీ ఉరితీస్తారని బహిరంగ సభలలో ప్రకటిస్తున్నారు..' అని బాధను వ్యక్తం చేశారు. అక్కడి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడి జైలు పాలయ్యారు. 1960వ దశకంలో జైలు నుంచి విడుదలయ్యాక అఫ్గాన్‌కు ప్రవాసం వెళ్లారు.

1969లో మహాత్మాగాంధీ శతజయంతి ఉత్సవాల సందర్భంగా గఫార్ ఖాన్ భారత్ వచ్చారు. అదే సమయంలో అహ్మదాబాద్ సహా దేశంలోని పలు చోట్ల హిందూ, ముస్లింల మధ్య అల్లర్లు చెలరేగాయి. ఆయన అహ్మదాబాద్ వెళ్లి అల్లర్లను ఆపేందుకు మూడు రోజులపాటు నిరాహార దీక్ష చేశారు. అల్లర్ల అనంతరం హిందూ ప్రాంతాల్లో హిందువులు, ముస్లిం ప్రాంతాల్లో ముస్లింలు సహాయక చర్యల్లో పాల్గొనడం చూసి ఆయన దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

1985లో భారత జాతీయ కాంగ్రెస్ స్వర్ణోత్సవాలకు గఫార్ ఖాన్ తన కుమారుడు వలి ఖాన్‌తో కలిసి భారత్‌కు వచ్చారు. 1987లో వైద్య చికిత్స నిమిత్తం భారతదేశం వచ్చిన ఆయనను 'భారతరత్న' అవార్డుతో మన ప్రభుత్వం వారు గౌరవించారు. భారత ఉపఖండంలో గాంధీజీకి ప్రతిరూపంగా నిలిచిన ఆయన 98 వయసులో- 1988 జనవరి 20న పెషావర్‌లో కన్నుమూశారు. ఆయన స్మారకార్థం 2012లో చర్సడాలో ఓ యూనివర్సిటీని పాక్ ప్రభుత్వం స్థాపించింది.

-దామరాజు నాగలక్ష్మి
nagalakshmidamaraju@gmail.com

రాజకీయ క్రీడ.. చట్టంతో చెలగాటం..

కోల్‌కతా పోలీసు కమిషనర్ సీబీఐ విచారణకు హాజరు కావల్సిందేనని సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాలపై ఇటు తృణముల్ కాంగ్రెస్, అటు బీజేపీ వర్గాలు నైతిక విజయం తమదంటే తమదేనని ప్రకటించుకున్నాయి. శారదా చిట్‌ఫండ్ కుంభకోణం కేసులో అత్యున్నత దర్యాప్తు సంస్థ సీబీఐ ఆదేశాలను ఉల్లంఘించడం నేరమా? కాదా?? దర్యాప్తునకు సహకరించమని పదే పదే సీబీఐ కోరుతున్నా కోల్‌కతా పోలీసు కమిషనర్ ఎందుకు నిరాకరిస్తున్నారు? ఆయనను విచారించడానికి వెళ్లిన 40 మంది సీబీఐ అధికారులను కోల్‌కతా పోలీసులు ఎందుకు అదుపులోకి తీసుకోవల్సి వచ్చింది? మరుసటి రోజు స్థానిక సీబీఐ జేడీ పంకజ్ శ్రీవాస్తవ్‌పై పాత కేసును తిరగతోడి విచారణకు హాజరుకమ్మని పోలీసులు నోటీసులు ఎందుకు ఇచ్చారు? దీనిని కేంద్రానికి, రాష్ట్రానికి మధ్య జరుగుతున్న పోరుగా ఎందుకు మలుస్తున్నారు? 'సహకార సమాఖ్య' వ్యవస్థను కాలరాస్తున్నది ఎవరు?

రాష్ట్రాలను తన గుప్పిట్లోకి తెచ్చుకునేందుకు సీబీఐని కేంద్రం ఒక అస్త్రంగా వాడుకుంటుంటే, రాష్ట్రాలూ అదే బాటలో తమకు నచ్చని వ్యక్తులను, శక్తులను అదుపు చేసేందుకు స్థానిక పోలీసులను ప్రయోగిస్తున్నాయి. అధికారం కోసం రాజకీయ పార్టీలు వ్యవస్థలను దుర్వినియోగం చేస్తున్న మాట బహిరంగ రహస్యమే. ఏపీ, తమిళనాడు, కేరళ, ఒడిశా, బెంగాల్, యూపీ, బిహార్, మహారాష్ట్రల్లో ఈ వైనం కళ్లారా చూసిందే. తాజాగా బెంగాల్ ఇందుకు వేదికైంది. వాస్తవానికి ఇది కేవలం కోల్‌కతా కేసుకే పరిమితమా? కానే కాదు, దీని వెనుక ఉన్న పని చేస్తున్న 'పెద్ద నెట్‌వర్క్'ను పరిశీలిస్తే తప్ప అసలు వివాదం అర్థం కాదు. సీబీఐ అధికారులు కోల్‌కతా కమిషనర్‌ను ఎందుకు విచారించాలనుకున్నారు? అన్న చోట మొదలు పెడితే కేసు పూర్వపరాలు అర్థమైపోతాయి. కోల్‌కతా కమిషనర్ రాజీవ్ కుమార్‌ను శారద చిట్‌ఫండ్ కుంభకోణంలో సీబీఐ విచారించాలనుకుంది. సుప్రీం ఆదేశాల మేరకు ఇప్పటికే పలు మార్లు ఆయనకు నోటీసులు ఇచ్చింది. చిట్‌ఫండ్ కుంభకోణంపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)కు ఆయన చీఫ్‌గా వ్యవహరిస్తున్నారు. కేసు దర్యాప్తు పేరిట నాన్చుడు ధోరణి ప్రదర్శిస్తూ నిందితులను కాపాడుతూ, సాక్ష్యాలను ధ్వంసం చేస్తున్నారనేది సీబీఐ వాదన. ఈ క్రమంలోనే సీబీఐ అధికారులు కోల్‌కతాలోని జాయింట్ డైరెక్టర్ పంకజ్ శ్రీవాస్తవ్ నేతృత్వంలో కమిషనర్ వద్దకు వెళ్లారు.

2000 సంవత్సరంలో శారద చిట్‌ఫండ్ కుంభకోణం జరిగింది. 239 డొల్ల కంపెనీల ద్వారా అధిక వడ్డీ చెల్లింపుల పేరుతో రూ. 4వేల కోట్లను 1.7 కోట్ల మంది డిపాజిటర్ల నుండి వసూలు చేశారు. అదే సమయంలో రోజ్‌వేలీ కంపెనీ 15వేల కోట్ల రూపాయలను వసూలుచేసింది. ఈ వ్యవహారంపై 2012లో డిపాజిట్‌దారులు ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు ప్రారంభించగా శారదాచిట్ ఫండ్ సంస్థ వ్యవస్థాపకులు పరారయ్యారు. 2013 ఏప్రిల్‌లో సుదీప్తో సేన్, ఆయన సహచరుడు దేబ్‌జాని ముఖర్జీలు పరారయ్యారని గుర్తించి వారిని 2013 ఏప్రిల్ 18న కశ్మీర్‌లో ప్రస్తుత కోల్‌కతా కమిషనర్ రాజీవ్‌కుమార్ అరెస్టు చేశారు. అపుడు రాజ్యసభ ఎంపీగా ఉన్న కునాల్ ఘోష్ అరెస్టుకు ప్రభుత్వం 'సిట్'ను ఏర్పాటు చేసింది. ఈ వ్యవహారంపై దర్యాప్తు బాధ్యతను సీబీఐకి అప్పగించాలని కోరుతూ అబ్దుల్ మన్నన్ సుప్రీంలో పిటిషన్ దాఖలు చేశారు. సీబీఐ అప్పటి తృణముల్ కాంగ్రెస్ నేత రజత్ మజుందార్‌ను అరెస్టు చేసింది. ఆయనతో పాటు ఎంపీ శ్రీమ్‌జోయ్ బోస్, రవాణా మంత్రి మదన్ మిత్రలను అరెస్టు చేసింది.





కేంద్రంలో ఉన్న బీజేపీ బెంగాల్‌లో తన ఉనికి చాటుకోవాలని చూస్తోందన్నది సుస్పష్టం. బీజేపీకి బెంగాల్‌లో చోటు లేకుండా చేయాలన్నది తృణముల్ కాంగ్రెస్ వ్యూహం. కేంద్ర, రాష్ట్రాల మధ్య ఉన్న ఈ పోరును సీబీఐ- స్థానిక పోలీసులు మధ్య వివాదంగా మలిచారు. కేంద్ర, రాష్ట్రాల మధ్య ఉండాల్సిన పరిపాలనా సంబంధమైన సర్దుబాటు అత్యంత క్లిష్ట సమస్యగా మారిపోతోంది. కేంద్రం, రాష్ట్రాల మధ్య దూరం పెరుగుతుంది. ఈ పరిస్థితిని ముందుగానే ఊహించిన రాజ్యాంగ నిర్మాతలు ఆర్టికల్ 256 నుండి 263 వరకూ ఉన్న ప్రకరణల్లో పరిపాలనా సంబంధాలను తెలియజేశారు. ఇంకో పక్క చిన్న చిన్న వివాదాలను పరిష్కరించుకోవడానికి అంతర్రాష్ట్ర మండలి, నీతి ఆయోగ్ పనిచేస్తూనే ఉన్నాయి. ప్రభుత్వాలకు అధికారం ఉన్నది చెలాయించడానికి కాదు, ప్రజలకు మేలు చేయడానికే...

2015 జూన్‌లో రోజ్‌వ్యాలీ గ్రూప్ ఎండీ గౌతం కుందును ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అరెస్టు చేసింది. అదే సమయంలో మమతా బెనర్జీ సహచరుడు ముఖుల్ రాయ్‌ను సీబీఐ ప్రశ్నించింది. 2016 డిసెంబర్‌లో తృణముల్ కాంగ్రెస్ ఎంపీ తపస్‌పాల్, సుదీప్ బందోపాధ్యాయలను సీబీఐ అరెస్టు చేసింది. 2017 నవంబర్ 3న ముకుల్‌రాయ్ బీజేపీలో చేరడంతో వ్యవహారంలో మార్పులు వచ్చాయి. 2018లో మమతా బెనర్జీ పెయింటింగ్స్‌ను ఎక్కువ ధరకు కొనుగోలుచేశారనే పేరుతో నిందితుల నుండి వాటిని సీబీఐ స్వాధీనం చేసుకుంది. గత ఏడాది ఫిబ్రవరి 2న ఈ రెండు కేసులను సమీక్షించిన సీబీఐ రాజీవ్ కుమార్‌ను ప్రశ్నించాలని నిర్ణయించుకుంది. గత నెలలో రోజ్‌వ్యాలీలో పెట్టుబడులకు సంబంధించి శ్రీకాంత్ మెహతాను అరెస్టు చేసింది. ఈ క్రమంలోనే సీబీఐ బృందం కమిషనర్ కార్యాలయానికి వచ్చింది. దీనికి ప్రతిగా కోల్‌కతా పోలీసులు సీబీఐ జాయింట్ డైరెక్టర్ పంకజ్ శ్రీవాస్తవకు నోటీసులు జారీ చేశారు. దీనికీ ఓ నేపథ్యం ఉంది.

సెంట్రల్ రోలర్ మిల్స్ ప్రైవేటు లిమిటెడ్ అనే సంస్థపై సీబీఐ దాడులు చేసిన సందర్భంగా అడ్డుకున్నారనే నెపంతో తనను సీబీఐ అధికారులు నిర్బంధించి హింసించారని పేర్కొంటూ వైభవ్ ఖత్తర్ అనే వ్యక్తి స్థానిక సిటీ సివిల్ కోర్టును ఆశ్రయించారు. కేసుతో సంబంధం లేని వైభవ్ ఖత్తర్‌ను నిర్బంధించిన సీబీఐ అధికారులపై కేసు నమోదు చేయాలని సివిల్ కోర్టు ఇచ్చిన ఆదేశాలతో సిటీ పోలీసులు కోల్‌కతా భవానీపుర పోలీసు స్టేషన్‌లో జనవరి 21న కేసు నమోదు చేశారు. వైభవ్‌ను నిర్బంధించిన సీబీఐ బృందానికి పంకజ్ శ్రీవాస్తవ్ నేతృత్వం వహించారనేది ఆరోపణ. ఇంతకీ సీబీఐ సెంట్రల్ రోలర్ మిల్స్‌పై ఎందుకు దాడి చేసిందీ అనేదే ప్రస్తుత వివాదానికి కీలకం. ఆ మిల్స్ యజమాని దీపేష్ చందర్ బిహార్‌లో జరిగిన పశుదాణా కుంభకోణం కేసులో అప్రూవర్. ఈకేసు దర్యాప్తు కొనసాగుతున్న సమయంలోనే అప్పటి సీబీఐ డైరెక్టర్ అలోక్ వర్మ, డిప్యూటీ రాకేష్ ఆస్థానల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేలా వైరం నెలకొంది. ఇద్దరికి ఇద్దరూ వేర్వేరు కేసుల్లో ఇరికించుకునే క్రమంలోనే పశుదాణా కుంభకోణం దర్యాప్తులో ఆస్థానా అక్రమాలకు పాల్పడ్డారని, కేసును తప్పుదారి పట్టించారని దీపేష్ చందర్‌తో చెప్పించారు. ఆ క్రమంలోనే ఆయన మిల్లుపై సీబీఐ దాడి చేసింది. దీపేష్‌ను అదుపులోకి తీసుకుని హింసిస్తున్న సమయంలో ఆయన సీబీఐ కస్టడీ నుండి తప్పించుకుని పారిపోయారు. కోల్‌కతా పోలీసులు ఆయన జాడను గుర్తించి అరెస్టు చేశారు. ఆయన అరెస్టయ్యేలోగా సీబీఐలో అనేక పరిణామాలు జరిగిపోయాయి. అలోక్‌వర్మ, రాకేష్ ఆస్థానా ఇద్దరూ అక్కడి నుండి బదిలీ అయ్యారు. తాత్కాలిక సీబీఐ డైరెక్టర్ నాగేశ్వరరావు కూడా తప్పుకున్నారు. కొత్త డైరెక్టర్ రిషీకుమార్ శుక్లా బాధ్యతలు స్వీకరించారు. ఈ మొత్తం ఎపిసోడ్‌లో ఎవరికివారు తమదే పైచేయి కావాలనే పట్టుదల ఒక పక్క, ఇంకొకరిని ఇరికించాలనే కుట్రలు సుస్పష్టమవుతున్నాయి. సీబీఐలో అప్పటి డైరెక్టర్ అలోక్ వర్మ, డిప్యూటీ రాకేష్ ఆస్థానాల మధ్య లుకలుకలు, పరస్పర ఫిర్యాదులు వెలుగుచూశాక ఎంతో ప్రతిష్ఠాత్మకం అనుకున్న సంస్థలు మసిబారిన తర్వాత ప్రజల్లో నమ్మకాన్ని కల్పించేదెవరు? చట్టసభలపైనా, పాలనా వ్యవస్థలపైనా పెదవి విరుస్తున్న ప్రజలకు తాజా పరిణామాలు- ఏ వ్యవస్థపైనా నమ్మకం లేని పరిస్థితిని కల్పిస్తున్నాయి.

రాజకీయాల క్రీడలో భాగంగా ప్రభుత్వాలు చట్టాన్ని తమ చుట్టంగా మలుచుకోవడం సగటు భారతీయుడికి అర్థం అవుతూనే ఉంది. తాజా పరిణామాలు స్వేచ్ఛకు ప్రతీక అనుకోవాలా? ప్రజాస్వామ్య స్ఫూర్తిగా తీసుకోవాలా? రాజ్యాంగం ఇచ్చిన హక్కుగా భావించాలా? కేంద్రంతో రాష్ట్రాలకు ఉన్న పేచీ ఇప్పటిది కాదు, రాష్ట్రాలు ఎదురుతిరిగిన సందర్భాల్లో కేంద్రం ఉపయోగించుకునే ఆయుధాలు రెండు. అవి అత్యవసర పరిస్థితి విధించడం లేదా సీబీఐ దర్యాప్తు పేరిట కేసులు నమోదు చేయడం. రాష్ట్రాలను గాడిలోకి తెచ్చుకోవాలనుకున్న ప్రతిసారీ కేంద్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా చేసే కార్యక్రమం ఏమిటో దేశ ప్రజలందరికీ తెలిసిందే.

బెంగాల్ పరిణామాలు చూస్తుంటే, కేంద్రంలో ఉన్న బీజేపీ బెంగాల్‌లో తన ఉనికి చాటుకోవాలని చూస్తోందన్నది సుస్పష్టం. బీజేపీకి బెంగాల్‌లో చోటు లేకుండా చేయాలన్నది తృణముల్ కాంగ్రెస్ వ్యూహం. కేంద్ర, రాష్ట్రాల మధ్య ఉన్న ఈ పోరును సీబీఐ- స్థానిక పోలీసులు మధ్య వివాదంగా మలిచారు. కేంద్ర, రాష్ట్రాల మధ్య ఉండాల్సిన పరిపాలనా సంబంధమైన సర్దుబాటు అత్యంత క్లిష్ట సమస్యగా మారిపోతోంది. కేంద్రం, రాష్ట్రాల మధ్య దూరం పెరుగుతుంది. ఈ పరిస్థితిని ముందుగానే ఊహించిన రాజ్యాంగ నిర్మాతలు ఆర్టికల్ 256 నుండి 263 వరకూ ఉన్న ప్రకరణల్లో పరిపాలనా సంబంధాలను తెలియజేశారు. ఇంకో పక్క చిన్న చిన్న వివాదాలను పరిష్కరించుకోవడానికి అంతర్రాష్ట్ర మండలి, నీతి ఆయోగ్ పనిచేస్తూనే ఉన్నాయి. ప్రభుత్వాలకు అధికారం ఉన్నది చెలాయించడానికి కాదు, ప్రజలకు మేలు చేయడానికి, సమాఖ్య, సమానత్వం, సంక్షేమ రాజ్యాలను నెలకొల్పడానికనే భావన రానిదే ఈ వివాదాలు ప్రజలకు సంకటంగా మారడం ఖాయం.

-బీవీ ప్రసాద్ 98499 98090

విదూషక పాత్రలో గద్దర్!

వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో 16 స్థానాలు గెలుస్తామని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర రావు విసిరిన సవాల్‌ను తాను ఛాలెంజ్‌గా తీసుకుంటున్నట్టు ప్రజా గాయకుడు గద్దర్ ఈమధ్య ఓ సన్మాన సభలో ప్రకటించారు. లోక్‌సభ ఎన్నికల వేడి ఇంకా రాజుకోలేదు, కేసీఆర్ అలాంటి సవాల్ విసరనూ లేదు. 16 స్థానాలు గెలుస్తామని సందర్భోచితంగా చెప్పిన దాన్ని 'విసిరిన సవాల్'గా భావిస్తే ఏమిటి అర్థం? తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం నుంచి ప్రతిపక్షాలు ఇప్పటికీ ఊపిరి తీసుకోలేని పరిస్థితి కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో గద్దర్ ఇలా అసంబద్ధ ప్రకటన చేయడం విడ్డూరం. కేసీఆర్‌పై గజ్వేల్ నుంచి పోటీ చేస్తానని ఊదరగొట్టిన గద్దర్ ఎన్నికల బరివైపు కన్నెత్తి చూడలేదు. విపక్షాలన్నీ తనను బలపరుస్తేనే పోటీచేస్తానని మెలిక పెట్టడంలోనే ఆయన గాంభీర్యమేమిటో తేటతెల్లమైంది. ఇలా విదూషకుని పాత్రలో ఒదిగిపోయి ప్రకటనలు చేస్తూ పొద్దుపుచ్చడం గద్దర్‌కు వెన్నతో పెట్టిన విద్య. 'సీరియస్‌నెస్' లేని వ్యవహారాలు నడపడం ఆయన నైజం. తాజాగా కేసీఆర్ సవాల్‌ను స్వీకరిస్తున్నట్టు గద్దర్ చేసిన ప్రకటన సైతం ఆ బాపతే!

గద్దర్ ఏ రాజకీయ పార్టీకీ ప్రాతినిధ్యం వహించడం లేదు. రాజకీయ పార్టీ పెడతానని అసెంబ్లీ ఎన్నికల ముందు చాలా ఊరించాడు. గతంలోనూ ఆ ప్రయత్నం తీవ్రంగా చేసినా సాధ్యం కాలేదు. దాంతో గాయకుడిగానే కొనసాగుతూ, విదూషకుని పాత్రను పోషిస్తున్నాడు. కేసీఆర్ విసరని సవాల్‌ను స్వీకరిస్తానని ప్రకటించడం వెనకాల గద్దర్ మానసిక స్థితి ఎలాంటిదో వెల్లడవుతోంది. తనకుతాను ఎక్కువగా ఊహించుకునే మానసిక వైక్లబ్యంతో ఆయన బాధపడుతున్న వైనం స్పష్టంగా అవగతమవుతోంది. గజ్వేల్‌లో పోటీచేస్తానన్న విషయాన్ని గాని, 16 ఎంపీ సీట్లు తెరాస సొంతమన్న మాటపై స్పందనను గాని పరిశీలిస్తే ఆయన అత్యుత్సాహం, అత్యాశ స్పష్టంగా వెల్లడవుతోంది. ఏ రాజకీయ పార్టీతో అనుబంధం లేకుండా, తనకంటూ ఓ పార్టీ లేకుండా సవాల్ స్వీకరించే స్థాయి ఎలా సాధ్యమో ఆయనకే తెలియాలి. ఆయన 'సత్తా'ఏమిటో ఇటీవలి ఎన్నికల్లో తేలిపోయాక ఇప్పుడు ఇలా సవాల్ విసరడమంటే- విదూషకుని వ్యవహారంగాక ఏమవుతుంది? ఓ బాధ్యతాయుత పౌరునిగా ఇలా సమాజంలో గందరగోళం సృష్టించేందుకు ప్రయత్నించడం భావ్యమా? తానేమిటో, తన సత్తా ఏమిటో, స్థాయి ఏమిటో గుర్తెరిగి వ్యవహరించడంలోనే ఎవరికైనా శోభనిస్తుంది. అలాగాక హనుమంతుని కుప్పిగంతుల మాదిరి గెంతితే ఎవరికి ఉపయోగం? ఎప్పుడో ఓసారి అలా జరిగితే ఎవరైనా అర్థం చేసుకునే వీలుంటుంది. ఆ వైఖరి జీవన విధానంగా మారితే ఎలా అర్థం చేసుకుంటారు? విదూషకుడిగానే పరిగణిస్తారు!

తన సన్మాన సభలోనే మావోయిస్టుల నినాదమైన 'సామాజిక తెలంగాణ' నినాదాన్ని గద్దర్ వినిపించారు. రూపం లేని, అమూర్తమైన ఆ నినాదంతో ఇప్పటికీ సమాజంలో గందరగోళం సృష్టించేందుకు పూనుకుంటే ఎలా? ఏ సమాజంలోనైనా ప్రజలందరూ 'పెత్తనం' చెలాయించరు. అది సాధ్యం కాదు. కాని అలా జరగాలని కోరుకోవడంలో గల 'ఉన్మత్తత' ఎలాంటిదో విశ్లేషించుకుంటే తేటతెల్లమవుతుంది. ఆ పూటకు ఆకర్షణీయ నినాదాలు ఇచ్చి పది మంది 'చప్పట్లు' కొట్టగానే రెచ్చిపోయి ప్రకటనలు గుప్పిస్తే గొప్ప సమాజం వైపు అడుగులు వేసినట్టు అవదు. నిర్మాణాత్మక రీతిలో ప్రయాణం కొనసాగినప్పుడే పది మంది ప్రశంసిస్తారు. పేదలకు అది ఉపకరిస్తుంది. పేదల పేర ఇలా పచ్చి అవకాశవాద వ్యవహారాలు నడపడం ఏ మాత్రం శోభనివ్వదు. దశాబ్దాలుగా గద్దర్ శైలి, నడక, గాలివాటు వ్యవహారం అందరూ గమనిస్తూనే ఉన్నారు. కాసేపు నవ్వించి, నాలుగు 'పంచ్'లు వేయడం, అదే దార్శనికత అని భావించడం భావ దారిద్ర్యం కాదా?

అదేరోజు ఆయన 'సేవ్ కాన్‌స్టిట్యూషన్, సేవ్ డెమొక్రసీ' నినాదంతో త్వరలో పల్లెపల్లెలో తిరుగుతానని, ముఖ్యంగా యువత తనకు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. వేల చేపల్ని మింగిన పిల్లి శాంతి జపం చేసినట్టుగా ఉంది ఈ వ్యవహారం. నిన్న మొన్నటివరకు రాజ్యాంగంపై విశ్వాసం లేదని, వ్యవస్థను కూకటి వేళ్ళతో కూలదోయాలని పిలుపునిచ్చిన వ్యక్తి ఇప్పుడు రాజ్యాంగ ప్రతిని పట్టుకుని 'సేవ్ కాన్‌స్టిట్యూషన్... సేవ్ డెమొక్రసీ...' అంటూ పల్లెలు తిరుగుతాడట! ఇది విదూషకుని వ్యవహారంగాక ఇంకేమిటి? పార్లమెంట్ ఓ పందుల దొడ్డి అని అభివర్ణించిన వ్యక్తి ఇప్పుడు సేవ్ డెమొక్రసీ అంటూ యాత్ర చేస్తాడట. మావోయిస్టుల్లో ఒకడిగా సాయుధ మార్గంలో పాలనా వ్యవస్థను, పార్లమెంటరీ వ్యవస్థను కూల్చివేయాలని పిలుపునిచ్చిన వ్యక్తి ఆ నోటితోనే ఆ పార్లమెంట్‌ను, ఈ వ్యవస్థను నడుపుతున్న రాజ్యాంగాన్ని కాపాడండి అంటూ ఊరేగడం వింతల్లోకెల్ల వింతగాక ఏమవుతుంది?

సమాజాన్ని సమూలంగా కూల్చేందుకు తాను పదివేల మందిని అడవుల్లోకి పంపానని స్వయంగా, గర్వంగా చెప్పుకున్న వ్యక్తి అలా పంపినవారిప్పుడు దండకారణ్యంలో తుపాకులతో భద్రతా బలగాలపై విరుచుకుపడుతూ, మందుపాతరలతో వాహనాలను పేల్చేస్తూ, ఆదివాసీలను ఇన్‌ఫార్మర్ల పేర కాల్చి చంపుతూ ఉంటే ఇక్కడ గద్దర్ 'సేవ్ డెమొక్రసీ' అని ఊరేగుతాడట. ఇది ఎంతటి హాస్యాస్పదం? ఇది విదూషకుని వ్యవహారం కాదా? సమాజానికి నష్టదాయకమైనదిగాక ఉపయుక్తమైనదవుతుందా?

సమాజంలో సంస్కరణలు తీసుకువచ్చేవారి మానసిక స్థితి ఎంతో ఆరోగ్యవంతంగా ఉండాలి. వర్తమాన ప్రపంచ స్థితిగతులపై సరైన అవగాహన, అంచనా ఉండాలి. క్రమశిక్షణతో మెలగాలి, త్యాగాలకు సిద్ధంగా ఉండాలి. గద్దర్‌లో ఇవేవీ కాగడా పెట్టి వెతికినా కనిపించవు. మావోల భావజాలం 'నీడ'లో తానో 'దూది శిఖరం'గా నిలవాలన్న తాపత్రయం తప్ప అందులో నిజాయితీ ఇసుమంత కనిపించదు. ఆ నిజాయితీ ఉంటే ఎన్నికల ముందు ఇన్ని కుప్పిగంతులు వేసి ఉండేవాడు కాదు. పూటకో మాట, పుత్ర వాత్సల్యంతో ఎక్కేగుమ్మం.. దిగే గుమ్మంగా తిరిగేవాడు కాదు. ఆఖరికి చంద్రబాబు కడుపులో తలపెట్టేవాడే కాదు. ఇదంతా దేన్ని స్ఫురింప జేస్తుంది? నిస్సందేహంగా విదూషకుని అవతారాన్నే...

21వ శతాబ్దంలో విదూషకుల మాటలకు విలువలేదు. జ్ఞానదారులు విస్తృతమవుతున్నాయి. ఆ దారుల వెంట అశేష ప్రజల ప్రస్థానం కొనసాగుతోంది. వారికి స్ఫూర్తినిచ్చే గాయకుడే నిజమైన గాయకుడు... వారిని ముందుకు నడిపేవాడే నిజమైన నాయకుడు. గద్దర్ విదూషకుని పాత్రను విసర్జించి ఈ రకమైన పాత్రను ఇకనైనా పోషిస్తాడా..?

-వుప్పల నరసింహం
99857 81799

డెడ్‌లైన్ పొడిగించం

○ జాతీయ పౌర రిజిస్టర్ జాప్యంపై సుప్రీం కోర్టు ఆగ్రహం ○ కేంద్రంపై కన్నెర్ర




న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: జాతీయ పౌర రిజిస్టర్ ప్రక్రియపై కేంద్రం అనుసరిస్తున్న వైఖరిని తప్పుబడుతూ సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. జాతీయ పౌరరిజిస్టర్‌ను రూపొందించడానికి మరో రెండు వారాల గడువు కావాలని, సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీసు విభాగం ఎన్నికల విధుల్లో ఉందని కేంద్రం కోర్టును అభ్యర్థించింది. ఎటువంటి పరిస్థితుల్లో జాతీయ పౌర రిజిస్టర్‌ను నిర్దేశించినట్లుగా జూలై 31వ తేదీలోగా ముగించాలని, గడువును పొడిగించమని కోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గగోయ్ నేతృత్వంలోని ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. కేంద్రం జాతీయపౌర రిజిస్టర్‌ను సత్వరమే పూర్తి చేసేందుకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నట్లు కనపడడం లేదని జస్టిస్ గగోయ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. గత నెల24 తేదీన ఈ కేసు విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఈ ఏడాది జూలై 31వ తేదీలోగా ఎన్‌ఆర్‌సి ప్రక్రియను ముగించాలని స్పష్టం చేసిన విషయం విదితమే.

వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఈ ప్రక్రియను జాప్యం చేయవద్దని కోర్టు రాష్ట్ర ఎన్‌ఆర్‌సీకో ఆర్డినేటర్‌ను ఆదేశించింది. గత ఏడాది జూలై 30వ తేదీన ఎన్‌ఆర్‌సి ముసాయిదాను ప్రకటించారు. మొత్తం 3.29 కోట్లలో 2.89 కోట్ల మంది పేర్లు ఎన్‌ఆర్‌సిలో ఉన్నాయి. కాగా 40,70,707 మందిలో 37,59,630 పేర్లను తొలగించారు. 2,48,077 మంది పేర్లను పరిశీలనలో ఉంచారు. గత ఏడాది డిసెంబర్ 31వ తేదీలోపల ఈ ప్రక్రియను పూర్తి చేయాలని కోర్టు ఆదేశించింది.

నిర్ణీత గడువులోగా ఎన్‌ఆర్‌సీ

○ స్పష్టం చేసిన కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్



న్యూఢిల్లీ: అసోం పౌరుల కోసం ఉద్దేశించిన జాతీయ పౌర రిజస్టర్ (ఎన్‌ఆర్‌సీ)ని సకాలంలో పూర్తి చేసేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. మంగళవారం ఇక్కడ పీటీఐ ప్రతినిధితో ఆయన మాట్లాడుతూ ఎన్‌ఆర్‌సీ ప్రక్రియ నిర్ణీత కాలవ్యవధిలోనే పూర్తి చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ జాబితాలో విదేశీయులు లేదా భారతదేశానికి చెందిన ఏ పౌరుడినీ చేర్చబోమని ఆయన స్పష్టం చేశారు. అసోంలోని స్థానికులకు మాత్రమే ఉద్దేశించిన ఈ జాతీయ పౌర రిజిస్టర్ న్యాయబద్ధంగా అమలు చేసేందుకు వీలుగా అవసరమైన నిధులతోపాటు ఎలాంటి సహకారమైనా అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వచ్చిందని ఆయన అన్నారు. 'ఎన్‌ఆర్‌సీని నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేసేందుకు మా ప్రభుత్వం కట్టుబడి ఉంది' అని కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మరోసారి స్పష్టం చేశారు. జాతీయ పౌర రిజిస్టర్ తుది జాబితా ప్రక్రియ రూపకల్పనను కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నాశనం చేస్తోందని, ఈ ప్రక్రియ సజావుగా సాగేందుకు కేంద్ర సహకరించడం లేదని సుప్రీంకోర్టు మంగళవారం వ్యాఖ్యానించింది. అంతేకాకుండా ఎన్‌ఆర్‌సీ జాబితాను ఈ ఏడాది జూలై 31లో పూర్తి చేయాలని, అంతకుమించి గడువు పెంచే ప్రశక్తే లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఎన్‌ఆర్‌సీ జాబితా తయారీపై సుప్రీంకోర్టు డెడ్‌గడువు విధించిన కొన్ని గంటల్లోనే కేంద్ర మంత్రి తాజాగా ప్రకటన చేయడం గమనార్హం.

సభలో ఈ గొడవేంటి?

○ విపక్షం గలభా.. స్పీకర్ చీవాట్లు

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: 'సుప్రీం కోర్టును విశ్వసించరు.. సీబీఐని విశ్వసించరు.. మీకే అంతా అర్థం అవుతుందని భావిస్తారు.. ఏమిటిది?' అంటూ లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ పోడియం వద్ద గొడవ చేస్తున్న తృణమూల్ కాంగ్రెస్, తెలుగుదేశం, ఇతర ప్రతిపక్ష సభ్యులకు చీవాట్లు పెట్టారు. అటు రాజ్యసభలోనూ టీఎంసీ, తెలుగుదేశం, ఇతర ప్రతిపక్ష సభ్యులు మంగళవారం కూడా సీబీఐ అధికారులు కోల్‌కత్తాలో నగర పోలీసు కమిషనర్ నివాసానికి వెళ్లడం పట్ల అభ్యంతరం తెలిపారు. వారు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలిస్తూ సభా కార్యక్రమాలను అడ్డుకోవటంతో చైర్మన్ ఎం.వెంకయ్యనాయుడు సభను బుధవారానికి వాయిదా వేశారు.

లోక్‌సభ ఉదయం సమావేశం కాగానే స్పీకర్ సుమిత్రా మహాజన్ మొదటి ప్రశ్నను చర్చకు చేపట్టగానే టీఎంసీ, తెలుగుదేశం, ఇతర ప్రతిపక్షాలు సభ్యులు పోడియం వద్దకు వచ్చి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి వ్యవతిరేకంగా నినాదాలిచ్చారు. కళ్యాణ్ బెనర్జీ ఇతర టీఎంసీ సభ్యులు, తెలుగుదేశం సభ్యులు కింజారపు రామ్మోహన్ నాయుడు, మురళీమోహన్, పండుల రవీంద్రబాబు తదితరులు పోడియం ముందు నిలబడి 'చౌకీదార్ చోర్ హై' (కాపలాదారు దొంగ) అంటూ నినాదాలిచ్చారు. సుమిత్రా మహాజన్ వారిని శాంతపరిచేందుకు పలు విధాల ప్రయత్నించారు. 'మీరు ప్రస్తావిస్తున్న అంశంపై సుప్రీం కోర్టులో విచారణ జరుగుతోంది.. సీబీఐ కూడా తన వాదనలు వినిపిస్తోంది.. ఈ నేపథ్యంలో మీరు ఇక్కడ గొడవ చేయటం మంచిది కాదు' అని ఆమె హితవు చెప్పారు. పార్లమెంటును పని చేయనివ్వండి.. మీరిలా పోడియం వద్దకు వచ్చి గొడవ చేయటం ఎంతమాత్రం మంచిది కాదని ఆమె పలుమార్లు చెప్పారు. దేశంలోని వ్యవస్థకు బాధ్యతలున్నాయి.. మీరిలా పార్లమెంటును అడ్డుకోవటం మంచిది కాదు.. మీరిక్కడ నిలబడి నినాదాలివ్వడం ఎంతమాత్రం సమర్థనీయం కాదని ఆమె పలుమార్లు స్పష్టం చేశారు. మీరిలా సుప్రీం కోర్టును విశ్వసించకుండా గొడవ చేయటం వలన సమస్యలు పరిష్కారం అవుతాయా? అని ప్రతిపక్ష సభ్యులను ప్రశ్నించారు. ఆ తరువాత సభను మధ్యాహ్నం పన్నెండు గంటల వరకు వాయిదా వేశారు. తిరిగి సమావేశమైనప్పుడు అధికార పత్రాలను సభకు సమర్పింపజేసి జీరో అవర్‌లో పలువురు సభ్యులకు మాట్లాడే అవకాశం ఇచ్చారు. ప్రతిపక్ష సభ్యుల నినాదాల మధ్యనే ఐదుగురు సభ్యుల చేత మాట్లాడించారు. నినాదాలు శ్రుతిమించటంతో సభను రెండు గంటల వరకు వాయిదా వేయకతప్పలేదు. ఆ తరువాత రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ చేపట్టారు.

ద్వైపాక్షిక సంబంధాలపై ముందడుగు

○ అభివృద్ధి, పర్యావరణం, ఇంధన వనరులపై కలిసి పనిచేయాలని ఇరు దేశాలు నిర్ణయం

○ ప్రధాని మోదీ, మొనాకో రాజు అల్బర్ట్ మధ్య చర్చలు ఫలప్రదం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: వాణిజ్యం, పెట్టుబడులపై ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకోవాలని భారత్, మొనాకో దేశాలు నిర్ణయించాయి.

వాతావరణ మార్పు, ఉగ్రవాదంపై కూడా పరస్పరం సమాచారం మార్చుకునేందుకు తగిన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని ఇరు దేశాలు తీర్మానించాయి. మంగళవారం ఇక్కడ ప్రధాని నరేంద్రమోదీ, మొనాకో దేశ రాజుఫ్రిన్స ఆల్బర్ట్ 2 ఇక్కడ సమావేశమై అభివృద్ధికి చెందిన అంశాలపై చర్చించారు. అంతకుముందు మొనాకోరాజు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను కలుసుకున్నారు. ఇరుదేశాలు దౌత్యపరంగా సంబంధాలను పటిష్టం చేసుకోవాలని ప్రకటనలో విదేశాంగ శాఖ మంత్రిత్వ శాఖ పేర్కొంది. భారత్‌ను సందర్శించే మొనాకో దేశాధికారులకు వీసా నిబంధనలను సడలించాలని నిర్ణయించారు. మౌలిక సదుపాయాల రంగాల్లో పెట్టుబడులు పెట్టనున్నట్లు భారత్ పేర్కొంది. ఉభయ దేశాలు పరస్పర ప్రయోజనాలతో అభివృద్ధి అజెండాతో ముందడుగు వేయాలని నిర్ణయించాయి.



న్యూఢిల్లీలో మంగళవారం సమావేశమైన ప్రధాని మోదీ, మొనాకో దేశ రాజుఫ్రిన్స ఆల్బర్ట్ 2

విదేశాంగ శాఖ ప్రతినిధి రావేష్ కుమార్ మాట్లాడుతూ 2007లో మొనాకోతో ద్వైపాక్షిక సంబంధాలను ప్రారంభించినట్లు చెప్పారు. అంతకుముందు విదేశాంగ శాఖ మంత్రి సుష్మాస్వరాజ్ మొనాకో రాజు ఆల్బర్ట్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నరు. సంప్రదాయేతర ఇంధన వనరులు, పర్యావరణ అంశాలపై ఇరు దేశాలు కలిసి పనిచేయాలని నిర్ణయించాయి.

సుప్రీం తీర్పు మమతకు చెంపపెట్టు

○ కేంద్రమంత్రి స్మృతి ఇరానీ



న్యూఢిల్లీ: శారదా చిట్‌ఫండ్ కుంభకోణంపై సీబీఐ దర్యాప్తునకు సంబంధించి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి చెంపపెట్టులాంటిదని బీజేపీ వ్యాఖ్యానించింది. శారదా చిట్‌ఫండ్ కుంభకోణం కేసు పారదర్శకంగా జరగాల్సి ఉండగా, దీనిని రాజకీయం చేయాలని చూసిన ముఖ్యమంత్రికి ఎదురుదెబ్బ తగిలిందని, సుప్రీం తీర్పును తమ పార్టీ స్వాగతిస్తోందని కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ అన్నారు. శారదా చిట్‌ఫండ్ కుంభకోణంపై పోలీస్ కమిషనర్ పాత్రపై సుప్రీంకోర్టు మంగళవారం తీర్పునిచ్చిన అనంతరం ఇక్కడ మీడియా సమావేశంలో కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ మాట్లాడారు. 'సుప్రీం తీర్పును బీజేపీ స్వాగతిస్తోంది. అదే సమయంలో ఈ అంశాన్ని రాజకీయం చేయాలని చూసిన పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రికి గట్టి దెబ్బ తగిలింది. దర్యాప్తును చట్టపరంగా నీతి, నిజాయితీగా జరిగేందుకు సహకరించాలి. దాదాగిరి చేయాలనుకుంటున్న మమత తన తీరును మార్చుకోవాలి' అని కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ సూచించారు. చిట్‌ఫండ్ కుంభకోణంపై సీబీఐ మేఘాలయలోని షిల్లాంగ్‌లో జరిపే దర్యాప్తు బృందం ఎదుట కోల్‌కతా పోలీస్ కమిషనర్ రాజీవ్ కుమార్ హాజరు కావాలని సుప్రీంకోర్టు మంగళవారం ఆదేశించింది. అయితే, పోలీస్ కమిషనర్‌ను తక్షణమే అరెస్టు చేయవద్దని సుప్రీం సీబీఐకి సూచించింది.

సానుభూతి ఓట్లతో టీఎంసీకి లబ్ధి!

○ బెంగాల్‌లో రాష్ట్రపతి పాలనకు బీజేపీ రాష్ట్ర నాయకుల విముఖత

కోల్‌కతా, ఫిబ్రవరి 5: శారద చిట్‌ఫండ్ కుంభకోణం కేసులలో కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) దర్యాప్తు వ్యవహారంపై తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రంతో తీవ్ర స్థాయిలో ఘర్షణకు దిగినప్పటికీ పశ్చిమ బెంగాల్‌లో రాష్ట్రపతి పాలన విధించాలనే ఆలోచనకు ఆ రాష్ట్రానికి చెందిన బీజేపీ నాయకులు అంత సుముఖంగా లేనట్టు కనిపిస్తోంది. రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధిస్తే రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ విజయావకాశాలపై ప్రతికూల ప్రభావం చూపుతుందని వారు భావిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికలు జరుగనున్న తరుణంలో కేంద్ర ప్రభుత్వం పశ్చిమ బెంగాల్‌లో రాష్ట్రపతి పాలన విధిస్తే మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ తనకు అన్యాయం జరిగిందంటూ పెడబొబ్బలు పెట్టడం ద్వారా సానుభూతి ఓట్లను సంపాదిస్తుందని ఆ రాష్ట్ర బీజేపీ నాయకులు మంగళవారం పేర్కొన్నారు. 'రాష్ట్రపతి పాలన విధించాలనే ఆలోచనకు మా పార్టీ రాష్ట్ర శాఖ సుముఖంగా లేదని మాత్రం నేను చెప్పగలను' అని బీజేపీ రాష్ట్ర నాయకుడు ఒకరు ఒక వార్తాసంస్థకు చెప్పారు. టీఎంసీ చాలా వేగంగా ప్రజల మద్దతు కోల్పోతోందని మరో బీజేపీ నాయకుడు పేర్కొన్నారు. 'ఈ స్థితిలో రాష్ట్రపతి పాలన విధిస్తే, రాజకీయ విద్వేషంతో అలా చేశారని టీఎంసీ ఆరోపిస్తుంది. సానుభూతి ఓట్లను సంపాదిస్తుంది. మేము అలా ఎందుకు జరగనివ్వాలి?' అని ఆ నాయకుడు ప్రశ్నించారు. సహజంగానే పశ్చిమ బెంగాల్ ప్రజలు ఎల్లవేళలా కేంద్ర ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తున్న పార్టీకే ఓటు వేస్తున్నారని ఆయన అన్నారు. ఆదివారం కేంద్రానికి, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వానికి మధ్య తీవ్ర స్థాయిలో ఘర్షణ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన అంశం తెరపైకి వచ్చింది.

దొందూ దొందే!

○ తృణమూల్, బీజేపీపై ఏచూరి విసుర్లు ○ సుప్రీం తీర్పుపై హర్షం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: భారతీయ జనతా పార్టీ (బీజేపీ), తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) రెండూ కూడా అవినీతి పార్టీలేనని సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి విమర్శించారు. ఈ రెండు పార్టీలు శారద చిట్ ఫండ్ కుంభకోణంలో కొల్లగొట్టిన సొమ్మును పంచుకోవడంలో కుమ్మక్కయ్యాయని సుప్రీంకోర్టు మంగళవారం జారీ చేసిన ఆదేశాలు వెల్లడించాయని ఆయన పేర్కొన్నారు. ఈ రెండు పార్టీలు ఏ స్థాయికి దిగజారాయో అత్యున్నత న్యాయస్థానం జారీ చేసిన ఆదేశాలు బహిర్గతం చేశాయని ఆయన అన్నారు. సీతారాం ఏచూరి మంగళవారం ఇక్కడ విలేఖరులతో మాట్లాడుతూ కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) శారద చిట్‌ఫండ్ కుంభకోణానికి సంబంధించి కోల్‌కతాలో దర్యాప్తు ప్రారంభించడంలో ఎలాంటి తప్పు లేదని, అయితే, సీబీఐ తనంత తానుగా దర్యాప్తు ప్రారంభించడం అభ్యంతరకరమని ఆయన పేర్కొన్నారు. 'న్యాయస్థానం ఒక కేసులో దర్యాప్తు చేయాల్సిందిగా సీబీఐని ఆదేశించినప్పుడు, సీబీఐ దర్యాప్తు కోసం ఏదయినా రాష్ట్రంలోకి గాని, ప్రాంతంలోకి గాని ప్రవేశించినప్పుడు అది ఆ రాష్ట్ర ప్రభుత్వంపై గాని, రాష్ట్ర ప్రభుత్వ అధికారాలపై గాని దాడిగా అన్వయించేలా ఉండకూడదు. సీబీఐ రాష్ట్ర ప్రభుత్వ అనుమతి లేకుండా తనంత తానుగా చర్యలు తీసుకోవడం, దర్యాప్తు జరపడం అభ్యంతరకరం. ఇది నియమాలను ఉల్లంఘించడమే. ఇక్కడ అలాంటి అంశం లేదు. అందువల్ల ఇది కేంద్ర-రాష్ట్ర సంబంధాలకు సంబంధించిన సమస్య కాదు' అని ఏచూరి పేర్కొన్నారు. 'టీఎంసీ, బీజేపీ రెండూ కూడా అవినీతి పార్టీలు. సుప్రీంకోర్టు ఆదేశాలతో ఈ రెండు పార్టీలు కుమ్మక్కయిన విషయం బయటపడింది. ఈ స్కాంలో టీఎంసీకి చెందిన ఉన్నత స్థాయి నాయకత్వాన్ని కూడా విచారించాలి. అనేక మంది టీఎంసీ ఎంపీలు ఇప్పటికే అరెస్టులను, చార్జిషీట్లను ఎదుర్కొన్నారు. మరి బీజేపీ ఈ కుంభకోణం దర్యాప్తు కోసం ఎందుకు అయిదేళ్లు ఆగింది? అవినీతి సభ్యులను తనలోకి తెచ్చుకోవడానికే కదా?' అని ఆయన పేర్కొన్నారు.



ఇదిలా ఉండగా, సుప్రీంకోర్టు ఆదేశాలు మమతా బెనర్జీ నేతృత్వంలోని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వానికి పెద్ద దెబ్బ అని, సీబీఐకి నైతిక విజయమని కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్ అన్నారు. చట్టానికి ఎవరూ అతీతులు కాదని కోర్టు ఆదేశాలు వెల్లడించాయని ఆయన పేర్కొన్నారు.

రోగ నిరోధక శక్తికి ముప్పే

○ వాతావరణ మార్పులపై తాజా అధ్యయనం

టోక్యో, ఫిబ్రవరి 5: వాతావరణంలోని మార్పులు మానవ శరీరంలోని వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతాయని, ముఖ్యంగా వేడిగాలుల వల్ల శరీరంలోని రోగనిరోధక శక్తి తగ్గి ఇన్‌ఫ్లూయంజా లాంటి జ్వరాల బారిన పడే ప్రమాదం ఉందని ఒక పరిశోధన వెల్లడించింది. జపాన్‌లోని టోక్యో యూనివర్సిటీకి చెందిన బృందం జరిపిన పరిశోధనలో భవిష్యత్‌లో సంభవించే వాతావరణ మార్పులు ఏంటి, దానికి సంబంధించి వేక్సినేషన్, పౌష్టికాహారం విషయంలో మనం తీసుకోవాల్సిన చర్యల గురించి పరిశోధనలు జరిపారు. వాతావరణంలోని పెనుమార్పుల కారణంగా పంట దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతుందని, పోషక విలువలు తగ్గుముఖం పడతాయని పేర్కొన్న ఈ బృందం వేడిగాలులు వంటి వాటివల్ల మానవశరీరంలో రోగనిరోధక శక్తి సైతం తగ్గుతుందని, దీంతో విషజ్వరాల బారిన పడే ప్రమాదం ఉందన్న విషయాన్ని సైతం కనుగొంది. పిఎన్ఏఎస్ జర్నల్‌లో ప్రచురితమైన ఈ పరిశోధన ఫలితాల ప్రకారం.. ఫ్లూ అన్నది సాధారణంగా శీతాకాలంలో వచ్చే జబ్బు. అనగా వాతావరణం చల్లగా ఉన్నప్పుడు శరీరంలో రోగ నిరోధక శక్తి తగ్గడం వల్ల ఈ వ్యాధి వచ్చే అవకాశం ఉంది. అయితే వాతావరణం వేడిగా ఉన్నప్పుడు సైతం మానవుని శరీరంలో రోగ నిరోధక శక్తి తగ్గుతుందని తమ పరిశోధనలో వెల్లడైందని పరిశోధన బృందంలోని అసోసియేట్ ప్రొఫెసర్ టకీషి తెలిపారు. ఇన్‌ఫ్లూయంజా వైరస్ అటు వేడి, చల్ల గాలుల వాతావరణంలో జీవించి ఉంటుం ది. సాధారణంగా శీతాకాలంలో ఈ వ్యాధి బారిన ఎక్కువమంది పడుతుంటారు. అయితే ఈ వైరస్ వాతావరణం వేడిగా ఉన్నప్పుడు ఎలా స్పందిస్తుంది అన్న దానిపై వీరు పరిశోధన చేశారు. ఆరోగ్యంగా ఉన్న కొన్ని ఆడ ఎలుకలను 22 డిగ్రీల సెల్సియస్ వాతావరణం ఉండే చల్లటి గదిలో, 36 డిగ్రీల సెల్సియస్ వాతావరణం ఉండే వేడి గదిలో ఉంచి పరిశోధనలు జరిపారు. అయితే ఈ వైరస్ అధిక వేడి వాతావరణం ఉండే గదిలో ఎలుకలపైనే ఎక్కువగా దాడి చేసినట్టు వారు నిర్ధారించారు.

మమత రూటే వేరు!

○ రాజీవ్ కుమార్‌పై నిన్న నిప్పులు.. నేడు ప్రశంసలు

కోల్‌కొతా, ఫిబ్రవరి 5: ఆ నాయకురాలే... ఆ నోరే. కాని పదేళ్లలో ఎంత మార్పు ? ఈ రోజు దేశ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనం తాజా ఎపిసోడ్. పదేళ్ల క్రితం వామపక్ష ప్రభుత్వం అధికారంలో ఉండగా ప్రస్తుతం వివాదస్పదంగా మారిన కోల్‌కొతా పోలీసు కమిషనర్ రాజీవ్ కుమార్‌ను అప్పుటి ప్రతిపక్షనేత, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ తూర్పారబట్టారు. పోలీసు అధికారి రాజీవ్ కుమార్‌పై విమర్శల జల్లు కురిపించిన మమతా ఈ రోజు ఆకాశానికేత్తేశారు. వామపక్ష ప్రభుత్వం ఆదేశాలతో ఆ నాటి పోలీసు అధికారిరాజీవ్ కుమార్ తమ ఫోన్లను ట్యాపింగ్ చేస్తున్నారంటూ మమతా బెనర్జీ హల్ చల్ చేశారు. కాని వామపక్ష ప్రభుత్వం మమత ఆరోపణలను తోసిపుచ్చింది. 1989 ఐపీఎస్ బ్యాచికి చెందిన రాజీవ్ కుమార్ ఈ రోజు కోల్‌కొతా పోలీసు కమిషనర్‌గా ఉన్నారు. సీబీఐ అధికారులు రాజీవ్ కుమార్‌ను విచారించేందుకు వస్తే మమతా బెనర్జీ అడ్డుకున్నారు. రాజీవ్ కుమార్ సచ్చీలుడని కితాబునిచ్చారు. రెండు రోజులుగా రాజీవ్ కుమార్ కోసం ముఖ్యమంత్రి హోదాలో మమత ధర్నా చేశారు. ఈ కేసులో ప్రధాన వ్యక్తి పోలీసు కమిషనర్ రాజీవ్ కుమార్ ఐఐటీ రూర్కీ ఇంజనీరింగ్ కాలేజీలో కంప్యూటర్ సైన్స్ చేశారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఈ అధికారి గతంలో స్పెషల్ టాస్క్‌ఫోర్స్‌లో జాయింట్ కమిషనర్, సీఐడీ డీజీగా పనిచేశారు. మావోయిస్టులను ఏరివేరేసే ఆపరేషన్లను నిర్వహించారు. మావోయిస్టుల ఏరివేత కార్యక్రమంలో చురుకుగా పాల్గొనడమే కాకుండా మంచి పేరుతెచ్చుకున్న రాజీవ్ కుమార్ గురించి ఢిల్లీ మాజీ పోలీసు కమిషనర్ నీరజ్ కుమార్ డయల్ డీ ఫర్ డాన్ అనే పుస్తకంలో ప్రస్తావించారు. రాజీవ్ కుమార్ సాహసమైన అధికారి అని కితాబునిచ్చారు. రాజీవ్ కుమార్ తన వద్ద పనిచేసే పోలీసులకు అండగా ఉంటారు. నిజమైన నాయకత్వ లక్షణాలు రాజీవ్ కుమార్‌లో ఉన్నాయన్నారు. పోలీసు శాఖలో రాజీవ్ కుమార్‌కు మంచి పేరుంది. 2011లో మమతా బెనర్జీ అధికారంలోకి వచ్చిన వెంటనే రాజీవ్ కుమార్‌ను ప్రాధాన్యత లేని పోస్టుకు పంపాలనుకున్నారు. కాని ఆ పనిచేయవద్దని సీనియర్ పోలీసు అధికారులు వారించారు. 2012లో బిదనానగర్ పోలీసు కమిషనరేట్‌ను ఏర్పాటు చేసినప్పుడు రాజీవ్ కుమార్‌ను పోలీసు కమిషనర్‌గా నియమించారు.కోల్‌కొతా పోలీసుకమిషనరేట్‌కు 21వ పోలీసు కమిషనర్‌గా 2016లో బాధ్యతను స్వీకరించారు.

ఎంపీలో 70 శాతం ఉద్యోగాలు స్థానికులకే

○ సీఎం కమల్‌నాథ్ వెల్లడి ○ మేనిఫెస్టోలో హామీలు అమలు

భోపాల్, ఫిబ్రవరి 5: మధ్యప్రదేశ్‌లోని కాంగ్రెస్ ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు ప్రకటించింది. పరిశ్రమల్లో 70 శాతం ఉద్యోగాలు స్థానికులకే ఇవ్వాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి కమల్‌నాథ్ ప్రభుత్వం పరిశ్రమలకు పలు రాయితీలు ప్రకటించారు. ఎన్నికల మేనిఫెస్టోలోనూ స్థానిక యువత ఉపాధికి సంబంధించి పలు హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ వాటి అమలుపై దృష్టి సారించింది. 70 శాతం ఉద్యోగాలు స్థానిక యువతతోనే భర్తీ చేయాలని భర్తీ చేయాలని,ఇది తప్పనిసరని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈమేరకు ఓ అధికారిక ప్రకటన జారీ చేశారు.'ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు అమలుకు మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఇందులో భాగంగానే 70 శాతం స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలన్న నిర్ణయం'అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. పరిశ్రమలన్నీ కచ్చితంగా దీన్ని అమలుచేయాలని సీఎం ఆదేశించారు. బిహార్, యూపీ నుంచి వస్తున్న యువకులను చేర్చుకోవడం వల్లే స్థానికులకు ఉపాధి లేకుండాపోతోందన్న ఆందోళన ఎప్పటి నుంచో ఉంది. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో కమల్‌నాథ్ ఇదే అంశాన్ని లేవనెత్తారు. తాము అధికారంలోకి వస్తే స్థానికులకే ప్రాధాన్యత కల్పిస్తామని హామీఇచ్చారు. పరిశ్రమంలో స్థానిక యువతకు 70 శాతం ఉద్యోగాలు కల్పిస్తేనే ప్రభుత్వ రాయితీలు అందుతాయని సీఎం స్పష్టం చేశారు. దీనికి సంబంధించి ఫైల్‌పై సంతకం చేసినట్టు ముఖ్యమంత్రి కమల్‌నాథ్ ట్వీట్ చేశారు.

పారిస్‌లో అగ్ని ప్రమాదం

○ 10 మంది సజీవ దహనం

○ అపార్ట్‌మెంట్‌లో ఘటన

పారిస్, ఫిబ్రవరి 5: ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో ఓ అపార్ట్‌మెంట్‌లో జరిగిన ఘోర అగ్ని ప్రమాదంలో 10 మంది దుర్మరణం చెందారు. నైరుతీ పారిస్‌లోని ఎర్లాంగర్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. పది మంటలకు ఆహుతికాగా 30 మందిని రక్షించారు. అపార్ట్‌మెంట్ ఎనిమిదో అంతస్తులో మంటలు లేచినట్టు ప్రత్యక్ష సాక్షులు వెల్లడించారు. అందరూ చూస్తుండగానే మంటలు చుట్టుముట్టాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని సహాయ చర్యలు చేపట్టారు. ప్రమాదానికి గల కారణాలు మాత్రం తెలియరాలేదు. చాలా సేపుదట్టమైన పొగ, మంటలు ఎగసిపడుతునే ఉన్నాయని పారిస్ పాలనాధికారి రేమే హెట్జ్ వెల్లడించారు. 30 మందిని రక్షించామని, కొందరు ఇంకా భవనంలో ఉండే అవకాశం ఉందని అధికారులు ఆందోళన చెందుతున్నారు. మంగళవారం తెల్లవారుజామున 1 గంట ప్రాంతంలో ప్రమాదం సంభవించింది. 200 మంది అగ్నిమాపక సిబ్బంది కృషి చేయగా మంటలను అదుపులోకి తేవడానికి ఐదు గంటల పట్టింది. తొలుత ఓ మహిళ రక్షించమంటూ పెద్దపెద్దగా అరుస్తూ కనిపించిందని ప్రత్యక్ష సాక్షి చెప్పారు. అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకునే సరిగే మంటలు మొత్తం వ్యాపించాయి.

వేసవిలో 142 ప్రత్యేక రైళ్లు

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 5: వచ్చే వేసవిలో ప్రయాణీకుల రద్దీని దృష్టిలో పెట్టుకుని దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక రైళ్లను నడపనుంది. మార్చి 1 నుంచి మే నెలాఖరు వరకూ వీటిని నడుపుతారు. హైదరాబాద్ నుంచి విజయవాడ, కాకినాడ, నర్సాపూర్, రాయచూర్, కర్నూల్, తిరుపతి మార్గాల్లో ప్రత్యేక సర్వీసులుంటాయి. కాకినాడ- రాయచూర్-కాకినాడ మధ్య 80 ప్రత్యేక రైళ్లు తిప్పుతారు. కాకినాడ- రాయచూర్ మధ్య 07245 రైలు కాకినాడలో మధ్యాహ్నం 2.25 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8.30 గంటలకు రాయచూర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 07246 రైలు రాయచూరులో మధ్యాహ్నం 2.05 గంటలకు బయలుదేరి మర్నాడు ఉదయం 8.30 గంటలకు కాకినాడ చేరుకుంటుంది. ఈ రైళ్లు వారానికి మూడు రోజులు నడుపుతారు. సామర్లకోట, రాజమండ్రి, భీమవరం, గుడివాడ, విజయవాడ, గుంటూరు, దొనకొండ, నంద్యాల, డోన్, గుంతకల్, ఆదోని, మంత్రాలయం, రాయచూరు స్టేషన్లలో ఆగుతాయి. అలాగే కాకినాడ- కర్నూల్ మధ్య 52 ప్రత్యేక రైళ్లు నడుపుతారు. కాకినాడ- కర్నూల్ మధ్య మార్చి 5వ తేదీ నుంచి మే 30 వ తేదీ వరకు ప్రత్యేక రైళ్లు తిప్పుతారు. కాకినాడలో 07237 రైలు సాయంత్రం 6.45 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8.10 గంటలకు కర్నూల్ చేరుకుంటుంది. ఆరున కర్నూల్‌లో సాయంత్రం 4 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7.30 గంటలకు కాకినాడకు చేరుకుంటుంది. అలాగే నర్సాపూర్- హైదరాబాద్ మధ్య ఐదు ప్రత్యేక రైళ్లు నడపనున్నారు. నర్సాపూర్ నుంచి హైదరాబాద్‌కు మార్చి 3,10,17,24,31వ తేదీల్లో ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేశారు. 07258 రైలు నర్సాపూర్‌లో సాయంత్రం 6 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 4.45 గంటలకు హైదరాబాద్ చేరుకుంటుంది. ఈ రైలు పాలకొల్లు, భీమవరం, ఆకివీడు, గుడివాడ, విజయవాడ, గుంటూరు, పిడుగురాళ్ళ, మిర్యాలగూడ, నల్లగొండ, హైదరాబాద్ స్టేషన్లలో ఆగుతుంది. అలాగే హైదరాబాద్- విజయవాడ మధ్య ఐదు ప్రత్యేక రైళ్లు తిప్పుతారు. ఇవి మార్చి 4,11,18,25, ఏప్రిల్ 1వ తేదీ వరకూ నడుస్తాయి. 07257 రైలు హైదరాబాద్‌లో రాత్రి 10.20 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6.35 గంటలకు విజయవాడ చేరుకుంటుంది. కాజీపేట, వరంగల్,ఖమ్మం విజయవాడ స్టేషన్లలో ఆగుతుందని దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో సీహెచ్ రాకేష్ వెల్లడించారు.

తప్పించుకున్న చిరుత...!



చిరుత వచ్చిందనే ప్రచారంతో లొల్ల గ్రామంలో గస్తీ తిరుగుతున్న యువకులు

ఆత్రేయపురం, ఫిబ్రవరి 5: తూర్పు గోదావరి జిల్లాలో సోమవారం సాయంత్రం హంగామా సృష్టించి, కొబ్బరిచెట్టుపై నక్కిన చిరుత అర్ధరాత్రి దాటిన తర్వాత 2 గంటల సమయంలో తప్పించుకుని పారిపోయింది. అటవీ శాఖ అధికార్లు ఏర్పాటుచేసిన వలలు, బోనును వెక్కిరిస్తూ చిరుత చీకటిలో కలిసిపోయింది. దీనితో చుట్టుపక్కల గ్రామాల్లో భయాందోళనలు నెలకొన్నాయి. చిరుత జాడ కోసం అటవీ శాఖాధికార్లు గాలింపు చేపట్టినా, మంగళవారం రాత్రి వరకూ ఫలితం లేకపోయింది. వివరాల్లోకి వెళితే... తూర్పు గోదావరి జిల్లా ఆత్రేయపురం మండలం అంకంపాలెంలోని పంట పొలాల్లో సోమవారం సాయంత్రం ప్రత్యక్షమైన చిరుత నలుగురిని గాయపరచి, కొబ్బరి చెట్టుపై నక్కిన సంగతి విదితమే. స్థానికుల సమాచారంతో రంగంలోకి దిగిన పోలీసు, అటవీ శాఖ అధికారులు చిరుతను పట్టుకోవడానికి చర్యలు చేపట్టారు. అప్పటికే చీకటి పడటంతో ఆ ప్రాంతంలో జనరేటర్ సాయంతో ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేశారు. చిరుత ఉన్న కొబ్బరి చెట్టు చుట్టూ వలలు పన్ని, ఒక బోను సైతం ఏర్పాటుచేశారు. డీఎఫ్‌వో నందనీ సలారియా తదితర అధికార్లు అక్కడే మకాం చేశారు. చిరుతను మత్తు ఇంజక్షన్లతో పడగొట్టడానికి విశాఖ నుండి ప్రత్యేక బృందాన్ని సైతం రప్పించారు. అయితే ఎంతకీ చిరుత చెట్టు దిగకపోవడంతో వ్యూహాత్మకంగా ఆ ప్రాంతంలో ఏర్పాటుచేసిన ఫ్లడ్ లైట్లు నిలిపివేశారు. చీకటిలో కిందకు దిగే చిరుత తాము ఏర్పాటుచేసిన వలలో గాని, బోనులో గాని చిక్కుకుంటుందని అధికార్లు భావించారు. అయితే అధికార్లు చేసిన ఏర్పాట్లన్నిటినీ వెక్కిరిస్తూ నెమ్మదిగా చెట్టు దిగిన చిరుత చీకట్లో మాయమయ్యింది. ఒక్కసారిగా తేరుకున్న అటవీ శాఖ అధికార్లు చిరుత వెళ్లిన దిశలో గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లేకపోయింది. ఇక మంగళవారం ఉదయం నుంచి ఆ ప్రాంతంలో హైడ్రామా నెలకొంది. చిరుతను అక్కడ చూశాం, ఇక్కడ చూశాం అంటూ వస్తున్న సమాచారంతో అధికారులు పరుగులు తీశారు. అయితే ఫలితం లేకపోయింది. మళ్లీ చిరుత ఎవరికీ కనిపించిన దాఖలాల్లేవు. దీనితో పరిసర గ్రామాల్లో భయాందోళనలు నెలకొన్నాయి. అటవీ శాఖ అధికారులు, స్థానిక పోలీసులు అమలాపురం రూరల్ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పంట పొలాలపై నిఘా వేశారు. స్థానిక చెంచు జాతీయులు కూడా వారి కుక్కలతో గాలింపు చర్యల్లో పాల్గొంటున్నారు. జిల్లా అటవీ శాఖ అధికారి అనంత శంకర్ మాట్లాడుతూ ఒక కిలోమీటరు లేదా రెండు కిలోమీటర్లలో కొత్త ప్రదేశం కాబట్టి దాగి ఉండవచ్చునని చెప్పారు. ఆ చిరుత కనిపించగానే దానిని బంధించేందుకు సిద్ధంగా అన్ని చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. చిరుత పులి సంచారంతో నేపథ్యంలో మంగళవారం ర్యాలి, అంకంపాలెం గ్రామాల్లోని పాఠశాలలకు సెలవు ప్రకటించినట్టు ఎంఈవో వరప్రసాద్ తెలిపారు.

అటవీ శాఖ అధికార్లపై ఆగ్రహం

చెట్టుపై నక్కి కళ్లకు కనిపిస్తున్న చిరుతను చేజేతులా వదిలేశారంటూ అంకంపాలెం గ్రామస్థులు అటవీశాఖ అధికార్లపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. మంగళవారం వేకువజామున చిరుత తప్పించుకున్నట్టు తెలిసిన వెంటనే ఆ ప్రాంతంలోనే గుమిగూడివున్న గ్రామస్థులు అధికార్లను నిలదీశారు. ఇప్పుడు తమ పరిస్థితి ఏమిటని ఆగ్రహం వ్యక్తంచేశారు. గ్రామీణ ప్రాంతం కావడంతో తమ పశువులకు రక్షణ ఉండదని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

వైకాపా గూటికి చీరాల ఎమ్మెల్యే ఆమంచి

• 13న ఒంగోలులో జగన్ సమక్షంలో చేరే అవకాశం

• బుజ్జగించడానికి రంగంలోకి దిగిన మంత్రి శిద్దా, టీడీ జనార్దన్

ఆంధ్రభూమి బ్యూరో

ఒంగోలు, ఫిబ్రవరి 5: ప్రకాశం జిల్లా టీడీపీలో రాజకీయ ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. ఇప్పటివరకు కొన్ని నియోజకవర్గాల్లోని నేతల మధ్య అసమ్మతి బెడద ఎక్కువగా ఉన్నప్పటికీ తాజాగా చీరాల శాసనసభ్యుడు ఆమంచి కృష్ణమోహన్ టీడీపీని వీడి వైఎస్‌ఆర్ కాంగ్రెస్‌పార్టీ గూటికి చేరనున్నారని తెలిసింది. ఈనెల 13న వైకాపా అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒంగోలుకు రానున్న నేపథ్యంలో ఆయన సమక్షంలో వైకాపా తీర్థం పుచ్చుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ సందర్భంగా చీరాల మునిసిపాలిటీ, వేటపాలెం మండలాలకు చెందిన ముఖ్య అనుచరులతో మంగళవారం పందిళ్ళపల్లిలోని తన స్వగృహంలో ఆమంచి ప్రత్యేక సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఒక్కొక్కరితో విడివిడిగా సమాలోచనలు జరిపారు. ఆయన ముఖ్య అనుచరులంతా వైసీపీ గూటికి చేరేందుకు సుముఖత వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. అదేవిధంగా చీరాలలో రెండు గ్రూపులను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రోత్సహిస్తున్నారని, అందులో భాగంగానే శాసనమండలి సభ్యురాలు పోతుల సునీతకు పార్టీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలిగా అధిష్టానం నియమించిందన్న అసంతృప్తి ఆమంచి వర్గీయుల్లో నెలకొంది. అదేవిధంగా చీరాల నియోజకవర్గంలోని బలమైన సామాజికవర్గం కూడా ఆమంచికి మద్దతుగా నిలిచేట్టు కనిపించటం లేదన్న వాదన ఆమంచి వర్గీయుల నుండి వినిపిస్తోంది. ఇదిలాఉండగా అటవీశాఖమంత్రి శిద్దా రాఘవరావు, పార్టీ ముఖ్యనాయకుడు టీడీ జనార్దన్ పందిళ్ళపల్లిలోని ఆయన నివాసంలో ఆమంచి కృష్ణమోహన్‌తో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. టీడీపీ తరపున ప్రత్యేకంగా చూసుకుంటామని, ముఖ్యమంత్రి సైతం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని చెప్పినట్లు పార్టీవర్గాల ద్వారా సమాచారం.

ప్రాజెక్టుల నిర్మాణానికి పూనుకుంటే టీడీపీకి జై

• పదవుల కోసం మా కుటుంబం పాకులాడదు

• కేంద్ర మాజీ మంత్రి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి

కోడుమూరు, ఫిబ్రవరి 5: దశాబ్దాల కాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల నిర్మాణానికి తెలుగు దేశం ప్రభుత్వం పూనుకుంటే తాను ఆ పార్టీలో చేరేందుకు సిద్ధమని కేంద్ర మాజీమంత్రి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి స్పష్టం చేశారు. కర్నూలు జిల్లా కోడుమూరులో మంగళవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన వల్ల కాంగ్రెస్ పార్టీ చాలా బలహీనమైందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వచ్చే ఎన్నికల్లో పొత్తు పెట్టుకుని ఎన్నికల్లో పోటీకి వెళ్లాలని పార్టీ అధిష్టానానికి సూచించినా తన మాట ఖాతరు చేయలేదని విచారం వ్యక్తం చేశారు. అంతేగాక తాను పార్టీ వీడుతున్నట్లు వస్తున్న కథనాలపై కాంగ్రెస్ పార్టీ పెద్దలు తనతో మాట్లాడటం లేదని అసహనం వ్యక్తం చేశారు. అందుకే పార్టీలో చేరే ప్రస్తావనను పక్కనపెట్టి ఈ ప్రాంతంలోని రైతుల సంక్షేమం కోసం ఇక్కడ పెండింగులో ఉన్న ప్రాజెక్టుల నిర్మాణాల విషయంపై ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడును కలిశానన్నారు. తన డిమాండ్లను ఆయన ముందుంచినట్లు కోట్ల తెలిపారు. ఈ డిమాండ్లను ఆమోదిస్తే తాను టీడీపీతో జతకట్టేందుకు సిద్ధమని చెప్పానన్నారు. రాజకీయ జీవితంలో రోషాలు, మీసాలు మెలేయడం తగదన్నారు. ప్రాంతాల అభివృద్ధి, రైతులు, ప్రజాసంక్షేమమే ముఖ్యం కాబట్టి ఆ దిశగా నేతలు, నాయకులు అడుగులు వేయాలని కోట్ల సూచించారు. అలాంటి నేతలనే ప్రజలు హర్షిస్తారన్నారు. వ్యక్తిగత లబ్ధి, స్వార్థ రాజకీయాలు, పదవుల కోసం పాకులాడే వారు రాజకీయాల్లో ఎక్కువ రోజులు నిలబడలేరన్నారు. కోట్ల కుటుంబం సిద్ధాంతాలు కలిగిన కుటుంబం, కాబట్టే ప్రజలు తమ వెంట ఉన్నారని, పదవుల కోసం కోట్ల కుటుంబం ఏనాడు పాకులాడలేదని, పదవులే కోట్ల కుటుంబాన్ని వరించాయని సూర్య గుర్తు చేశారు. కోట్ల కుటుంబంపై దశాబ్దాల తరబడి ఎనలేని ప్రేమాభిమానాలు చూపే ప్రజల సంక్షేమం చూడాల్సిన బాధ్యత తమపై ఉన్నందున ప్రజల భవిష్యత్ కోసం ప్రజలకు దూరమైన కాంగ్రెస్‌ను వీడి మరో పార్టీలో చేరే ఆలోచన చేస్తున్నానని వివరించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు లక్కసాగరం లక్ష్మీరెడ్డి, కోట్ల అభిమానులు కె. మధుసూదన్‌రెడ్డి, హేమాద్రిరెడ్డి, సీబీ లత, రఫీక్, గుంతకంటి వేణుగోపాల్‌రెడ్డి, లింగమూర్తి, లింగమయ్య, మాదులు, లింగన్న, రాఘవేంద్ర, వీరేష్, సాయరాజేంద్ర, గోట్ల తిమ్మప్ప, గిడ్డాయ్య ఆచారి తదితరులు పాల్గొన్నారు.

నిరశన వీడిన హజారే

• చర్చలు సంతృప్తికరం అంటూ వ్యాఖ్య



రాలెగాన్ సిద్ధి (మహారాష్ట్ర), ఫిబ్రవరి 5: గత ఏడు రోజులుగా లోక్‌పాల్, లోకాయుక్తల కోసం నిరాహార దీక్ష చేస్తూ వచ్చిన సామాజిక కార్యకర్త అన్నా హజారే మంగళవారం విరమించారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్, కేంద్ర మంత్రులతో జరిపిన చర్చలు సంతృప్తికరంగా ముగిసినందున నిరసన వ్రతాన్ని వీడుతున్నానని హజారే స్పష్టం చేశారు. అంతకుముందు హజారేను కలసిన ఫడ్నవిస్, కేంద్ర మంత్రులు వెంటనే దీక్షను విరమించాలని కోరారు. లోక్‌పాల్, లోకాయుక్తలను అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల జాప్యాన్ని నిరసిస్తూ వారం రోజుల కిందట ఆమరణ నిరాహార దీక్ష చేపట్టిన సామాజిక కార్యకర్త అన్నా హజరేను మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్‌తో పాటు ఇద్దరు కేంద్ర మంత్రులు మంగళవారం పరామర్శించారు. వృద్ధాప్యంతోపాటు ఆరోగ్య పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఆమరణ దీక్షను విరమించాలని వారు హజారేను కోరారు. అపరిష్కృతంగా ఉన్న లోక్‌పాల్, లోకాయుక్తల ఏర్పాటులో జరుగుతున్న జాప్యంతోపాటు రైతుల సమస్యలు పరిష్కారించాలని డిమాండ్ చేస్తూ గతనెల 30 నుంచి అహమ్మద్‌నగర్ జిల్లాలోని తన స్వగ్రామం రాలెగాన్ సిద్ధిలో 81 ఏళ్ల అన్నా హజారే ఆమరణ నిరసనకు దిగారు. హజారే గత ఏడు రోజుల్లో నాలుగున్నర కేజీల బరువు తగ్గారు. సామాజిక కార్యకర్త హజారే ఆమరణ దీక్ష, అతని ఆరోగ్య పరిస్థితుల గురించి తెలుసుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్, ఇద్దరు కేంద్ర మంత్రులు రాధా మోహన్ సింగ్, సుభాష్ భామ్రే, మహారాష్ట్ర మంత్రి గిరీష్ మహాజన్‌తో కలసి మంగళవారం పరామర్శించారు. ఆమరణ నిరాహార దీక్షను విరమించాలని అన్నా హజారేకు వారు విజ్ఞప్తి చేశారు. అయితే. లోక్‌పాల్, లోకాయుక్తలను ఏర్పాటు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న జాప్యం తనను మరింత అసంతృప్తికి గురిచేస్తోందని అన్నా హజారే ముఖ్యమంత్రి ఎదుట తన అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. ఈ విషయంలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవిస్ జోక్యం చేసుకుని ఇందుకు తగిన పరిష్కార మార్గాన్ని ప్రతిపాదిస్తే తన దీక్షను విరమించే విషయం గురించి ఆలోచిస్తానని హజారే స్పష్టం చేశారు. అంతేకాకుండా ఎన్నికల సంస్కరణలు, రైతుల మేలుకు ఉద్దేశించిన స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను తక్షణం అమలు చేయాలని సామాజిక కార్యకర్త అన్నాహజారే డిమాండ్ చేశారు. ఇదిలావుండగా, తన డిమాండ్ల సాధన కోసం గత వారం రోజులుగా అన్నాహజారే ఆమరణ దీక్ష చేస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విషయమై స్పష్టమైన హామీ ఇవ్వనందుకు అసంతృప్తి వ్యక్తం చేస్తూ మంగళవారంనాడు ప్రభుత్వ అధికారులెవరినీ హజారే దీక్ష చేపట్టిన గ్రామంలోకి రానివ్వకుండా స్థానికులు అడ్డుకున్నారు.

లబ్ధి పొందే దేశాల్లో భారత్

• అమెరికా-చైనా వాణిజ్య యుద్ధంపై ఐరాస

ఐక్యరాజ్య సమితి, ఫిబ్రవరి 5: ప్రపంచంలోనే అతి పెద్ద ఆర్థిక వ్యవస్థలయిన అమెరికా, చైనా మధ్య సాగుతున్న వాణిజ్య ఉద్రిక్తతల వల్ల లబ్ధి పొందే కొన్ని దేశాలలో భారత్ ఉందని ఐక్యరాజ్య సమితి (ఐరాస) తన తాజా నివేదికలో వెల్లడించింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గతేడాది మార్చిలో చైనా నుంచి దిగుమతి అయ్యే ఉక్కు, అల్యూమినియం ఉత్పత్తులపై భారీగా సుంకాలను విధించినప్పటి నుంచి ఇరు దేశాల మధ్య వాణిజ్య యుద్ధం కొనసాగుతోంది. ఇరు దేశాల మధ్య సాగుతున్న వాణిజ్య యుద్ధం ప్రపంచ వాణిజ్య యుద్ధానికి దారితీస్తుందేమోననే భయాందోళనలు నెలకొన్నాయి. అమెరికా వైఖరికి ప్రతిస్పందనగా చైనా కూడా అమెరికా ఉత్పత్తుల దిగుమతులపై బిలియన్ల కొద్దీ డాలర్ల సుంకాలను విధించింది. అమెరికా, చైనా మధ్య సాగుతున్న ఈ వాణిజ్య యుద్ధం దేశీయ ఉత్పత్తిదారుల ప్రయోజనాలను కొంతవరకు పరిరక్షిస్తుందని ఐరాస నిపుణులు సోమవారం పేర్కొన్నారు. కాని, ఈ వాణిజ్య వివాదాలు పరిష్కారం కాకుంటే వీటి పర్యవసానాల ప్రతికూల ప్రభావం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై భారీగా ఉంటుందన్నారు. వాణిజ్యం, అభివృద్ధిపై ఐరాస సదస్సు (యూఎన్‌సీటీఏడీ) తాజాగా విడుదల చేసిన నివేదికలో నిపుణులు ఈ అంచనాలను వ్యక్తం చేశారు.

1వ పేజీ తరువాయి

సంక్షేమం.. అభివృద్ధి

పోర్ట్‌పాలసీ-2015కు అనుగుణంగా 2025 నాటికి భావనపాడు, కాకినాడ, మచిలీపట్నం, రామాయపట్నం పోర్టులను అందుబాటులోకి తీసుకురావాలని బడ్జెట్‌లో ప్రతిపాదించింది. విశాఖపట్నం- చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌కు అవసరమైన రుణసేకరణ జరపటం ద్వారా పూర్తిస్థాయిలో ఉపాధి కల్పనకు మార్గం వేయాలనేది ప్రభుత్వ లక్ష్యంగా బడ్జెట్‌లో ప్రస్తుతించారు. దీంతో పాటు యువతకు ప్రభుత్వ ఉద్యోగాల్లో అవకాశం కోసం ప్రభుత్వం 42వేల పోస్టులను నేరుగా భర్తీ చేయాలని నిర్ణయించింది. ఇందులో ఉపాధ్యాయ, ప్రభుత్వ విభాగాలకు చెందిన పోస్టులు ఉన్నాయి. కారుణ్య నియామకాల విధానాన్ని సరళీకరించనున్నారు.

డ్రైవర్లకు ప్రత్యేక సాధికార సంస్థ

ఆటో, ట్రాక్టర్, లారీ డ్రైవర్ల సంక్షేమానికి రూ.150 కోట్లతో ప్రత్యేక 'సాధికార సంస్థ'ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. డ్రైవర్లకు సంక్షేమ, బీమా పథకాల అమలుకు ఈ సంస్థను ప్రభుత్వం ప్రతిపాదించింది.

యువజన సాధికారతలో భాగంగా నిరుద్యోగ భృతిని వెయ్యి నుంచి రెండువేల రూపాయలకు పెంచుతూ ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రతిపాదించింది. ముఖ్యమంత్రి యువనేస్తం కింద ఇప్పటికే 4.3 లక్షల మందికి భృతి అందిస్తున్నారు. పెట్టుబడుల ఆకర్షణ.. పరిశ్రమల స్థాపనతో ఉపాధి కల్పన జరిగే దిశగా బడ్జెట్‌లో ప్రాధాన్యతలు కల్పించింది.

సాంఘిక సంక్షేమ సాధికారతలో భాగంగా గతేడాది కంటే ఈ ఏడాది 28 శాతం అధికంగా ఎస్సీ సబ్‌ప్లాన్‌కు రూ.14,367 కోట్లు, ఎస్టీ సబ్‌ప్లాన్‌ను 29 శాతం పెంచుతూ రూ.5385 కోట్లు, బీసీ సబ్‌ప్లాన్‌కు 33 శాతం అధికంగా రూ.16,226 కోట్లు కేటాయించింది.

ఆర్థికంగా వెనుకబడిన వర్గాల సంక్షేమానికి ఈ బడ్జెట్‌లో రూ.3వేల కోట్లు కేటాయించారు. ఇందులో కాపు కార్పొరేషన్‌కు రూ.1000 కోట్లు, బ్రాహ్మణ కార్పొరేషన్‌కు రూ.100 కోట్లు, వైశ్య, క్షత్రియ కార్పొరేషన్లకు రూ.50 కోట్ల చొప్పున కేటాయింపులు జరిగాయి. చంద్రన్న బీమా పథకానికి 28 శాతం అధికంగా రూ354 కోట్లతో ప్రతిపాదించారు.

వైద్య, ఆరోగ్యానికి రూ.10,032 కోట్లు

తాజా బడ్జెట్‌లో వైద్య, ఆరోగ్యశాఖకు ప్రభుత్వం కేటాయింపులు పెంచింది. గత ఏడాది కంటే 18.53 శాతం అదనంగా రూ.10,032 కోట్లు కేటాయించింది. ఇందులో ఎన్టీఆర్ భరోసా కింద వైద్యసేవ పథకానికి రూ.1200 కోట్లుగా ప్రతిపాదనలు చేసింది. మానవ వనరుల అభివృద్ధిలో భాగంగా ప్రజారోగ్యం మెరుగుదలతో పాటు మాతా, శిశు మరణాల తగ్గింపు, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్, చంద్రన్న సంచార చికిత్స, ఎన్టీఆర్ వైద్య పరీక్ష, ఎన్టీఆర్ వైద్యసేవ, ముఖ్యమంత్రి బాల సురక్ష, ఉచిత డయాలసిస్ కార్యక్రమాలను అమలు చేస్తున్న ప్రభుత్వం ఈ ఏడాది ఈ విభాగానికి రూ.29,955 కోట్లు కేటాయించింది. అమరావతి నివాసితుల ఆరోగ్య పథకంతో సహా ప్రతి జిల్లాలో క్యాన్సర్ సెంటర్లను అందుబాటులోకి తేవాలని నిర్ణయించింది.

విద్యారంగంలో రూ.11,360 కోట్ల పెట్టుబడి అంచనా

రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న విశ్వవిద్యాలయాల్లో మౌలిక సదుపాయాలు, నాణ్యతా ప్రమాణాలను పెంచటంతో పాటు నూతన విశ్వవిద్యాలయాల స్థాపన ద్వారా రానున్న పదేళ్లలో రూ.11,360 కోట్ల పెట్టుబడులు రాగలవని అంచనా. మధ్యాహ్న భోజనంలో పోషక విలువలను పెంపొందించటంతో పాటు కళాశాల విద్య, పాలిటెక్నిక్ కళాశాలలకు కూడా విస్తరించాలని నిర్ణయించింది.

వ్యవసాయ యాంత్రికీకరణకు రూ.300.17 కోట్లు, పశువులకు బీమా కింద రూ.200 కోట్లు, పశుగ్రాసం అభివృద్ధికి రూ.200 కోట్లు, ఉద్యానవన కార్యక్రమాలకు రూ.124 కోట్లు, మత్స్య ఉత్పత్తుల అభివృద్ధికి మరో రూ.100 కోట్లు కేటాయించారు.

డ్వాక్రా మహిళలకు పసుపు, కుంకుమ పథకానికి ఈ బడ్జెట్‌లో రూ.4వేల కోట్లు, వడ్డీలేని రుణాల కింద మరో రూ.1100 కోట్లు, చంద్రన్న బీమాకు రూ.354.02, చేనేత కార్మికుల జీవన ప్రమాణాల మెరుగుదలకు రూ.225 కోట్లు, పదో తరగతిలోపు విద్యార్థులకు అమలుచేస్తున్న పౌష్టికాహార పథకానికి రూ.156.72 కోట్ల మేర కేటాయింపులు జరిగాయి. చంద్రన్న పెళ్లి కానుక కింద బీసీలకు రూ.175 కోట్లు, ఎస్సీ, ఎస్టీలకు రూ.128.21కోట్లు, మైనారిటీలకు దుల్హన్ పథకానికి రూ.100 కోట్లు కేటాయించింది. ఎన్టీఆర్ పింఛన్‌లకు భారీగా కేటాయింపులు జరిపారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి రూ.10,401.05 కోట్లు దివ్యాంగుల పింఛన్లకు రూ.2133.62 కోట్లు, డప్పు కళాకారులకు రూ.108 కోట్లు, హెచ్‌ఐవీ రోగులకు రూ.100.20 కోట్లు ఈ బడ్జెట్‌లో ప్రతిపాదించారు. రాజధాని భూ సమీకరణ రైతులకు రూ.226.27 కోట్లు కేటాయించింది.

ఢిల్లీలోనే తేల్చుకుంటాం

విజయమే కాకుండా అధికారులకు మరింత బలాన్నిచ్చే అంశమని పేర్కొన్నారు. కాగా, ప్రధాని మోదీకి వ్యతిరేకంగా ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న పోరాటాన్ని లక్ష్యానికి చేరువ చేస్తామని, తదుపరి ఆందోళన కార్యక్రమాలను ఖరారు చేయడానికి విపక్ష నేతలు ఈ నెల 13-15 తేదీల్లో ఢిల్లీలో సమావేశమవుతారని చంద్రబాబు తెలిపారు. ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, ఎవరికీ భద్రత లేకుండా పోయిందని మోదీ సర్కార్‌పై ధ్వజమెత్తిన చంద్రబాబు 'ప్రస్తుతం దేశంలో పరిస్థితి ఎమర్జెన్సీ కంటే దారుణంగా ఉంది'అని వ్యాఖ్యానించారు. ఎవరైనా నోరెత్తితే జైల్లో పడేస్తున్నారని ఆరోపించిన చంద్రబాబు 'ఇది ఎమర్జెన్సీకంటే దారుణం'అని అన్నారు. మొత్తం 23 ప్రతిపక్ష పార్టీల ప్రతినిధిగా తాను ఇక్కడికి వచ్చానని, శరద్ పవార్,కుమారస్వామి, అఖిలేష్ యాదవ్ సహా అనేక మంది నేతలు తక్షణమే దీక్ష విరమించాలని మమతను కోరారని చెప్పారు. అయితే ఈ పోరాటం ఇక్కడితో ఆగిపోదని, దీన్ని దేశ రాజధానికి తీసుకెళ్లి అనుకున్న లక్ష్య తీరాలకు చేరుస్తామని చంద్రబాబు చెప్పారు. మమతా బెనర్జీని ఫెడరల్ ఫ్రంట్ రూపకర్తగా అభివర్ణించిన ఆయన రానున్న లోక్‌సభ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ పార్టీ మొత్తం 42సీట్లనూ గెలుచుకుంటుందని చెప్పారు. ప్రతిపక్ష పార్టీలను ఒకే తాటిపైకి తీసుకురావడంలో మమతా బెనర్జీ అత్యంత కీలక భూమిక పోషిస్తున్నారని మీడియాతో అన్నారు.

లాభసాటిగా వ్యవసాయం

పదేళ్ల పాలనలో రైతులు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారని, దిగుబడి తగ్గి తీవ్రంగా నష్టపోయారన్నారు. విత్తనాలు, ఎరువుల కోసం లాఠీ దెబ్బలు తిన్నారని, కరెంట్ కోసం పొలాలకు వెళ్లి మరణించారన్నారు. దేశంలోనే వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్ పెట్టిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వానిదే అన్నారు. వ్యవసాయంతో దేశం మొత్తంపై వృద్ధి 2.4 శాతం ఉండగా ఏపీలో 11 శాతం ఉందన్నారు. రైతు ఆదాయాన్ని రెట్టింపు చేశామని, సూక్ష్మ సేద్యంలో దేశంలోని తొలి పది జిల్లాల్లో ఆరు ఏపీలోనే ఉన్నాయన్నారు. ఇక్కడ పెన్షన్ల కింద సంవత్సరానికి కొందరికి రూ. 24వేలు మరికొందరికి రూ. 36 వేలు అందజేస్తున్నామని అదే కేంద్రం రూ.6వేలు సహాయం ప్రకటిస్తూ ఐదు ఎకరాల భూమి ఉండాలని షరతు పెట్టి ఆ మొత్తాన్ని కూడా కుటుంబంలో ఒక్కరికే అందజేస్తామని చెబుతోందన్నారు. ఈ చర్చలో మంత్రి సోమిరెడ్డి చంద్రమోహనరెడ్డి, మంత్రి ఆదినారాయణరెడ్డి, సభ్యులు రామానాయుడు, ఎస్వీఎస్ వర్మ, చిరంజీవులు, తదితరులు పాల్గొన్నారు.

జీవీఎల్‌పై హక్కుల నోటీసు

ప్రవర్తించారని వ్యాఖ్యానించినట్టు పేర్కొన్నారు. అసెంబ్లీ రూల్స్ ఆఫ్ ప్రోసీజర్ ఆఫ్ కండక్ట్‌కు ఇది విరుద్ధమని, జీవీఎల్ వ్యాఖ్యలు అసెంబ్లీ గౌరవాన్ని కించపరిచేలా ఉన్నాయని నోటీసులో పేర్కొన్నారు. పార్లమెంట్‌లో పెద్దల సభలో సభ్యునిగా ఉంటున్న జీవీఎల్ తీరు చట్టసభలను గౌరవించేలా ఉండాలన్నారు. కానీ ఆయన మాత్రం చట్ట సభ గౌరవాన్ని దిగజార్చేలా వ్యవహరిస్తున్నారన్నారు. అసెంబ్లీతో పాటు రాష్ట్ర ముఖ్యమంత్రిని కించపరచడం ద్వారా జీవీఎల్ సభా హక్కుల ఉల్లంఘనకు పాల్పడ్డారని, అందువల్ల ఈ కేసును తక్షణమే సభా హక్కుల కమిటీకి అప్పగించాలని కోరారు. జీవీఎల్‌పై చర్య తీసుకునే విధంగా తక్షణమే కార్యాచరణను ప్రారంభించాలని శ్రావణ్‌కుమార్ కోరారు. దీనిపై స్పీకర్ కోడెల శివప్రసాదరావు స్పందిస్తూ నిబంధనల ప్రకారం తగిన చర్య తీసుకుంటామన్నారు.

సెక్యూరిటీల ద్వారా అదనంగా రూ.36వేల కోట్లు

• కేంద్ర ప్రభుత్వ ప్రణాళికలు సిద్ధం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: ప్రస్తుతం నడుస్తున్న ఆర్థిక సంవత్సరావసరాలకు అనుగుణంగా డేటెడ్ సెక్యూరిటీల ద్వారా 36వేల కోట్ల రూపాయలు అదనంగా సమీకరించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో ప్రభుత్వం విడుదల చేసిన కేలండర్ మేరకు ప్రభుత్వ బాండ్ల ద్వారా చేపట్టిన చివరి ట్రాంచే కాలపరిమితి వచ్చే మార్చి 8తో ముగుస్తుంది. ఈక్రమంలో వచ్చే మార్చి 11నుంచి 15 వరకు, 18నుంచి 22 చేపట్టే రెండు ట్రాంచేల ద్వారా ఒక్కోదఫా 18వేల కోట్ల రూపాయలు మొత్తం 36 వేల కోట్ల రూపాయలు సమీకరించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది.

ఈ క్రమంలో రీటైల్, సంస్థాగత ఇన్వెస్టర్లకు సక్రమంగా మదుపుచేసేందుకు అనుకూలంగా ప్రణాళికలు రూపొందించుకోవడానికి, పారదర్శకతను, అర్హతను ప్రభుత్వ సెక్యూరిటీ మార్కెట్లో పొందేందుకు డేటెడ్ సెక్యూరిటీలతో కూడిన ఓ క్యాలండర్‌ను ఈ నెల 4 నుంచి మార్చి 31 వరకు అమలయ్యే విధంగా రూపొందించడం జరిగింది. రిజర్వుబ్యాంకు చట్టాల మేరకు ఈ క్యాలండర్‌కు రూపకల్పన జరిగిందని ఈ సందర్భంగా విడుదల చేసిన పత్రికా ప్రకటన వెల్లడించింది. ఈ క్యాలండర్‌లో పేర్కొన్న నోటిఫైడ్ సొమ్ము, ఇస్యూయెన్స్ కాలవ్యవధి, మెచూరిటీ తదితర అంశాల్లో ఇన్వెస్టర్లకు అనుగుణంగా సరళతర విధానాలను అమలు చేసే చర్యలకు ప్రభుత్వం ఉపక్రమించింది. ఈ క్రమంలోనే నాన్ స్టాండర్డ్ మెచూరిటీ, ఫ్లోటింగ్ రేట్ బాండ్లు, రీటైల్ ఇన్‌ఫ్లేషన్ లింక్డ్ బాండ్లు వంటివి తీసుకురావడానికి చర్యలు చేపట్టిందని అధికార వర్గాలు వెల్లడించాయి. ఇవి ప్రభుత్వ అవసరాలు, మార్కెట్ పరిస్థితులనుబట్టి ఉంటాయి. అలాగే గ్రీన్ షూ ఐశ్చికాలపై రూ.1000 కోట్లు అదనంగా సమీకరించేందుకు హక్కులను ఉంచుకునేలా ప్రభుత్వం ఆర్బీఐతో చర్చలు సాగిస్తోంది.

ఏపీ పోలీస్‌పై నమ్మకం లేదు

హత్యకేసు అనంతరం ఏసీపీ మల్లారెడ్డితో రాకేశ్ ఫోన్ సంభాషణలు జరిపినట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీసులు గుర్తించినట్లు ఆరోపణలు వచ్చాయి. దీంతో ఏసీపీ మల్లారెడ్డిని బదిలీ చేస్తూ రాచకొండ కమిషనర్ మహేశ్‌భగవత్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కేసుకు సంబంధించిన కమిషనర్ మీడియాతో మాట్లాడుతూ ఓ కేసు సందర్భంగా రాకేశ్‌రెడ్డి ఇబ్రహీంపట్నం ఏసీపీ మల్లారెడ్డితో పరిచయం పెంచుకున్నాడని చెప్పారు. రాకేశ్‌తో ఫోన్‌లో టచ్‌లో ఉన్నట్లు ఆరోపణలు వచ్చాయని, విచారణ చేపట్టనున్న నేపథ్యంలో బదిలీ వేటు వేసినట్లు వివరించారు. ఏసీపీ మల్లారెడ్డిపై విచారణ జరుపుతున్నామని, విచారణ అనంతరం వివరాలు వెల్లడించనున్నట్లు పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం ఏసీపీగా వనస్థలిపురం ఏసీపీ గాంధీ నారాయణకు అదనపు బాధ్యతలు అప్పగించినట్లు వెల్లడించారు.

..నాలుగు రాష్ట్రాలకు నీళ్లు

తెలంగాణ మధ్య కాళేశ్వరం ప్రాజెక్టు కోసం సీఎం కేసీఆర్ తన వద్దకు వచ్చారని, 8 రోజుల్లో అన్ని అనుమతులూ ఇచ్చామని, దేశ అభివృద్ధి కోసం బీజేపీ ఎన్నడూ రాజకీయాలు చేయలేదన్నారు. హిమాలయాలకు దూరంగా ఉన్న రాష్ట్రాల్లో నీటి సమస్య ఎక్కువగా ఉంటుందని, అందుకే మోదీ వచ్చాక ప్రధాని సంచయ్ యోజనలో భాగంగా కర్నాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రల్లో ప్రాజెక్టులకు అనుమతి ఇవ్వడం జరిగిందన్నారు. 99 ప్రాజెక్టుల్లో 66 ప్రాజెక్టులు ఈ జూన్‌లో ప్రారంభం కాబోతున్నాయని పేర్కొన్నారు. ప్రాజెక్టుల అనుమతులే కాదు, నాబార్డు నుండి నిధుల ఏర్పాట్లు కూడా చేశామని చెప్పారు. నదుల అనుసంధానం కన్నా, నాన్ హిమాలయన్ రాష్ట్రాలకు నదుల నీళ్లు, సముద్రంలో కలవకుండా చూడాలని అనుకున్నామని అన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా పార్టీ పరంగా అనేక కార్యక్రమాలను నిర్వహిస్తామని కేంద్ర మంత్రి గడ్కరీ చెప్పారు. కేవలం ఎన్నికల్లో గెలవడం కాదని, ప్రజలకు మనం ఏం చేశామో, ఏం చేస్తున్నామో కూడా చెప్పాలన్నారు. ఆర్థిక వివక్ష లేకుండా ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు పది శాతం రిజర్వేషన్లు కల్పించామని, ఆయుష్మాన్ భారత్ ద్వారా రూ.10పది లక్షల ఉచిత వైద్యాన్ని అందిస్తున్నామని, పోస్టు ఆఫీసుల్లో బ్యాంకింగ్ సేవలు అందించేలా తీర్చిదిద్దామని చెప్పారు. తల్లి పిల్లలకు ఉజ్వల్ యోజన పథకస్పు, ప్రతి ఇంటికీ విద్యుత్ సదుపాయం కల్పించామని చెప్పారు. ప్రతిపక్షాలన్నీ మోదీకి వ్యతిరేకంగా ఒక్కటైనా, మరోమారు మోదీ ప్రధాని కావడం ఖాయమని అన్నారు.

క్రీడాభూమి

పొట్టి సిరీస్‌పై కన్ను!


నేటి నుంచి భారత్ - న్యూజిలాండ్ టీ20

- జట్టులోకి రిషభ్ పంత్
- గాయంతో మార్టిన్ గుప్తిల్ దూరం





నెట్ ప్రాక్టీస్ సెషన్‌లో పాల్గొన్న భారత ఆటగాళ్లు



వెల్లింగ్టన్, ఫిబ్రవరి 5: వరుసగా సిరీస్‌లు నెగ్గి జోరుమీదున్న టీమిండియా న్యూజిలాండ్‌తో నేటి నుంచి జరిగే పొట్టి సిరీస్ (టీ20)పై కన్నేసింది! ఇటీవల జరిగిన వన్డే సిరీస్‌ను 4-1తో నెగ్గిన భారత్, మూడు మ్యాచ్‌ల టీ20ని సైతం గెలుచుకునేందుకు ప్రణాళికలు రూపొందిస్తోంది. యువ వికెట్ కీపర్, బ్యాట్స్‌మన్ రిషభ్ పంత్ జట్టులో చేరడంతో భారత్ మరింత బలంగా కనిపిస్తోంది. దీంతో రెగ్యులర్ కెప్టెన్ విరాట్ కోహ్లీ లేకపోయినా సిరీస్‌ను గెలుస్తామనే ధీమాగా ఉంది. ఇక కెప్టెన్ రోహిత్ శర్మ న్యూజిలాండ్‌తో జరిగిన చివరి రెండు వన్డేల్లో బ్యాటింగ్‌లో విఫలమైనా టీ20లో ఘనమైన రికార్డే ఉంది. శిఖర్ ధావన్, మహేంద్రసింగ్ ధోనీ, రిషభ్ పంత్, దినేష్ కార్తీక్ తో ఇటు టాప్ ఆర్డర్, అటు మిడిలార్డర్ బలంగా కనిపిస్తోంది. చివరి వన్డేలో టాప్ ఆర్డర్ పూర్తిగా విఫలమవ్వగా మిడిలార్డర్ బ్యాట్స్‌మెన్లు చేసిన పరుగులతో విజయం సాధించిన విషయం తెలిసిందే. మరోవైపు 19 ఏళ్ల ఆటగాడు శుభ్‌మాన్‌గిల్ ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ నిరాశ పరచడంతో, టీ20కి తుది జట్టులో చోటు దక్కే అవకాశం తక్కువే. బౌలర్ల విషయానికొస్తే యార్కర్ స్పెషలిస్ట్ జస్ప్రీత్ బూమ్రా లేకపోవడంతో మహమ్మద్ సిరాజ్, ఖలీల్ అహమ్మద్‌తో పాటు సిద్దార్థ్ కౌల్, విజయ్‌శంకర్‌ల మధ్య పోటీ నెలకొనే అవకాశముంది. న్యూజిలాండ్‌తో చివరి రెండు వన్డేలు ఆడిన ఖలీల్ అహమ్మద్ పరుగులు ఎక్కువగా ఇవ్వకపోయినప్పటికీ ఒక్క వికెట్ తీసుకోకపోవడం గమనార్హం. భువనేశ్వర్ కుమార్, కేదార్ జాదవ్, కుల్దీప్ యాదవ్, హార్దిక్ పాండ్య, కృనాల్ పాండ్య, యుజువేంద్ర చాహల్ బౌలింగ్ విభాగం బలంగా కనిపిస్తోంది. మరోవైపు ఇప్పటికే వన్డే సిరీస్ కోల్పోయిన కివీస్ ఎలాగైనా టీ20 సిరీస్‌ను గెలవాలనే పట్టుదలతో ఉంది. అయితే స్టార్ బ్యాట్స్‌మన్, ఓపెనర్ మార్టిన్ గుప్తిల్ వెన్నెముక గాయంతో పూర్తిగా కోలుకోలేకపోవడంతో అతడి స్థానంలో ఆల్ రౌండర్ జేమ్స్ నీషమ్ జట్టులోకి వచ్చాడు. అలాగే డరియల్ మిచెల్, బ్లయర్ టిక్‌నర్‌లు మొదటిసారి జట్టుకు ఎంపిక కావడం తమకు కలిసొస్తుందంటున్నాడు కెప్టెన్ విలియమ్సన్. బౌలింగ్ విభాగంలో ట్రెంట్ బౌల్ట్ లేకపోవడం ఆతిథ్య జట్టుకు కొంత నష్టం కలిగించే అంశమే.

కివీస్‌దే పైచేయి..

పొట్టి ఫార్మాట్‌లో ఇప్పటివరకు న్యూజిలాండ్ జట్టే పైచేయి సాధించింది. ఇరు జట్ల మధ్య మూడు టీ20 సిరీస్‌లు జరగ్గా కివీస్ రెండు, భారత్ ఒక సిరీస్ గెలుచుకున్నాయి. 2008-09 మధ్య రెండు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో ఇరు జట్లు తలపడగా న్యూజిలాండ్ 2-0తో గెలిచింది. ఆ తర్వాత 2012-13 మధ్య మరోసారి రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో పాల్గొనగా 1-0తో విజయం న్యూజిలాండ్‌నే వరించింది. చివరిసారిగా 2017-18లో జరిగిన మూడు మ్యాచ్‌ల టీ20ని టీమిండియా 2-1తో గెలుచుకుంది.

జట్టులో హార్దిక్, కృనాల్ సోదరులు..

న్యూజిలాండ్‌తో జరిగే టీ20 సిరీస్‌లో హార్దిక్ పాండ్య, కృనాల్ పాండ్య తొలిసారిగా కలిసి ఆడనున్నారు. వీరిద్దరూ ఇప్పటివరకు భారత్ తరపున అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడడం ఇదే మొదటిసారి. గతంలో భారత జట్టులో మహిందర్ అమర్ నాథ్, సురీంధర్ అమర్‌నాథ్ సోదరులు, ఇర్ఫాన్, పఠాన్ సోదరులు ఆడిన విషయం తెలిసిందే.

న్యూజిలాండ్ జట్టు: కేన్ విలియమ్సన్ (కెప్టెన్), డౌగ్ బ్రాస్‌వెల్, కొలిన్ డీగ్రాండ్‌హోం, లాకీ ఫెర్గూసన్, స్కాట్ కుగ్గే లైజిన్, డరియల్ మిచెల్, కొలిన్ మున్రో, జిమ్మీ నీషమ్, మిచెల్ సాంత్నార్, టిమ్ సీఫర్ట్, ఇష్ సోదీ, టిమ్ సౌథీ, రాస్ టేలర్.

భారత జట్టు: రోహిత్ శర్మ (కెప్టెన్), శిఖర్ ధావన్, రిషభ్ పంత్, దినేష్ కార్తీక్, కేదార్ జాదవ్, ఎంఎస్ ధోనీ, కృనాల్ పాండ్య, కుల్దీప్ యాదవ్, యుజువేంద్ర చాహల్, భువనేశ్వర్ కుమార్, సిద్దార్థ్ కౌల్, ఖలీల్ అహమ్మద్, శుభ్‌మాన్ గిల్, విజయ్ శంకర్, హార్దిక్ పాండ్య, మహమ్మద్ సిరాజ్.

జట్టులో కుల్దీప్ నెంబర్ వన్ స్పిన్నర్

- టీమిండియా కోచ్ రవిశాస్త్రి



వెల్లింగ్టన్, ఫిబ్రవరి 5: 'కుల్దీప్ అంతర్జాతీయ మ్యాచుల్లో అద్భుతంగా రాణిస్తున్నాడు. అతడికే మా మొదటి ప్రాధ్యాన్యత. జట్టులో ఒకే స్పిన్నర్‌ని తీసుకునే అవకాశం ఉంటే కుల్దీప్‌నే తీసుకుంటాం' అని టీమిండియా హెడ్ కోచ్ రవిశాస్త్రి స్పష్టం చేశాడు. మంగళవారం రవిశాస్త్రి క్రిక్ బజ్ వెబ్‌సైట్‌తో మాట్లాడుతూ కుల్దీప్ యాదవ్ జట్టు సీనియర్ స్పిన్నర్లు రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజా కంటే మెరుగైన బౌలర్ అని కొనియాడారు. ఇటీవలి కాలంలో విదేశాల్లో కుల్దీప్ ప్రదర్శన చూస్తే అర్థమవుతందని పేర్కొన్నాడు. ఆస్ట్రేలియాతో సిడ్నీ వేదికగా జరిగిన టెస్టులో కుల్దీప్ ఐదు వికెట్లు పడగొట్టిన విషయం తెలిసిందే. ఈ విషయాన్ని ప్రస్తావించిన రవిశాస్త్రి ప్రస్తుతానికి మాకు కుల్దీప్ యాదవ్ నెం. 1 బౌలర్ అని పునరుద్ఘటించాడు.

ప్రపంచకప్‌కు పాక్ కెప్టెన్‌గా సర్ఫరాజ్

- స్పష్టం చేసిన పీసీబీ



లాహోర్, ఫిబ్రవరి 5: దక్షిణాఫ్రికా ఆటగాడు ఆండిల్ పెహ్లువాకియాపై వర్ణ వివక్ష వ్యాఖ్యలు చేసి నాలుగు మ్యాచ్‌ల నిషేధం ఎదుర్కొంటున్న పాక్ కెప్టెన్ సర్ఫరాజ్ అహ్మద్‌కు పాక్ క్రికెట్ బోర్డు (పీసీబీ) మద్దతుగా నిలిచిన విషయం తెలిసిందే. కాగా, సర్ఫరాజ్ వ్యాఖ్యలు క్రికెట్ ప్రపంచాన్ని విస్తుపోయేలా చేశాయి. వెంటనే తేరుకున్న సర్ఫరాజ్ అహ్మద్ బహిరంగ క్షమాపణలు చెప్పినా, ఐసీసీ (అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్) మాత్రం నాలుగు మ్యాచ్‌ల నిషేధం విధించింది. దీనిపై పాక్ క్రికెట్ బోర్డు అసంతృప్తిని వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. మరోవైపు ప్రపంచకప్‌కు పాక్ సారథిగా సర్ఫరాజ్‌ను కొనసాగిస్తారా లేదా అనే వదంతులు సైతం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుండడంతో పాక్ క్రికెట్ బోర్డు స్పందించింది. ప్రపంచకప్‌కు పాక్ సారథిగా సర్ఫరాజ్ అహ్మద్ కొనసాగుతాడని స్పష్టం చేసింది.

లంక కెప్టెన్‌గా దిముత్ కరుణరత్నే



శ్రీలంక, ఫిబ్రవరి 5: దక్షిణాఫ్రికాలో ఈ నెల 13 నుంచి పర్యటిస్తున్న శ్రీలంక జట్టుకు దిముత్ కరుణరత్నే కెప్టెన్‌గా వ్యవహరించనున్నట్లు లంక బోర్డు స్పష్టం చేసింది. గత ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ పర్యటనల్లో దారుణంగా విఫలమైన రెగ్యులర్ కెప్టెన్ దినేష్ చండిమల్‌ను బోర్డు జట్టు నుంచి తప్పించింది. అతడి స్థానంలో దిముత్ కరుణరత్నే కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. కరుణరత్నేకు కెప్టెన్‌గా ఇదే మొదటి సిరీస్ కావడం గమనార్హం. లంక జట్టు ఫిబ్రవరి 13 నుంచి మార్చి 24 వరకు దక్షిణాఫ్రికాతో రెండు టెస్టులు, 5 వన్డేలు, మూడు టీ20లు ఆడనుంది.

వాణిజ్యభూమి

రెండు రోజుల నష్టాల నుంచి కోలుకున్న రూపాయి


- డాలర్‌తో 23 పైసలు బలపడిన విలువ



ముంబయి, ఫిబ్రవరి 5: వరుసగా రెండు రోజుల నష్టాల పరంపర నుంచి భారత రూపాయి మంగళవారం కోలుకుంది. అమెరికన్ డాలర్‌తో 23పైసలు బలపడి రూపాయి విలువ 71.57 రూపాయలకు చేరింది. విదేశీ నిధులు పెద్దమొత్తంలో పెట్టుబడులుగా రావడంతోబాటు, దేశీయ మార్కెట్లు లాభాలతో ముగియడం రూపాయి బలోపేతానికి దోహదం చేసిందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఆర్బీఐ ఎంపీసీ సమీక్షా సమావేశంతో మదుపర్లు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. అలాగే ఆసియన్ మార్కెట్లలో అత్యధిక శాతం మంగళవారం చాంద్రమాన సంవత్సరారంభంతో మూతపడ్డాయి. 'మూడు రోజుల ఆర్బీఐ ఎంపీసీ సమీక్షా సమావేశం ముగిసిన అనంతరం 7న తీసుకునే నిర్ణయంపై తమ కంపెనీ దేశీయ మార్కెట్ విశ్లేషణలు ఆధారపడి ఉంటాయ'ని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ విభాగం పీసీజీ, మూలధన మార్కెట్ వ్యూహాల అధిపతి వీకే శర్మ తెలిపారు. తొలుత డాలర్‌తో 71.72 రూపాయలుగా ఆరంభమైన భారత రూపాయి విలువ ఆ తర్వాత 71.55 నుంచి 71.80 మధ్య కదలాడి చివరిగా 23 పైసలు బలపడి 71.23 రూపాయల వద్ద ముగిసింది. విదేశీ నిధులు ఎక్కువగా వెనక్కు మళ్లడంతోబాటు, ముడిచమురు ధరలు పెరగడం రూపాయి విలువ మరింత పెరగకుండా నిరోధించాయన్నారు. విదేశీయులు 420 కోట్ల రూపాయల విలువైన వాటాలు కొనుగోలు చేయగా, దేశీయ సంస్థాగత మదుపర్లు 194.31 కోట్ల రూపాయల విలువైన వాటాలను కొనుగోలు చేశారని మంగళవారం నాటి ప్రాథమిక గణాంకాలు వివరించాయి. కాగా డోనాల్డ్ ట్రంప్ స్టేట్ ఆఫ్‌ది యూనియన్ ప్రసంగంతో డాలర్ సూచీల్లోని ఆరు కరెన్సీలు అధిక విలువ (0.13శాతం)ను సంతరించుకున్నాయి.

స్వల్ప లాభాలతో ముగిసిన మార్కెట్ సూచీలు


- 34.07 పాయింట్లు లాభపడిన సెన్సెక్స్
- 22.10 పాయింట్లు పెరిగిన నిఫ్టీ
- ఆర్బీఐ మానిటరీ విధాన కమిటీ
- సమీక్షా సమావేశంపై మదుపర్ల దృష్టి




ముంబయి, ఫిబ్రవరి 5: దేశీయ ఈక్విటీ మార్కెట్ సూచీలు మంగళవారం ఊగిసలాట, అస్థిరతలకులోనై మళ్లీ కోలుకుని దృఢంగామారి చివరికి స్వల్ప లాభాలతో ముగిశాయి. రిజర్వు బ్యాంకు మానిటరీ పాలసీ సమీక్షా సమావేశం కొనసాగుతున్న సందర్భంగా మదుపర్లు ఆచితూచి వ్యవహరించారు. విదేశీ మార్కెట్ల నుంచి ఆశించినంత సానుకూలత లేకపోవడం సైతం దేశీయ మార్కెట్ల ఊగిసలాటకు కారణమని వాణిజ్య నిపుణులు అంచనా వేస్తున్నారు. ఆరంభ దశలో వత్తిడికి గురైన సెన్సెక్స్ చివరికి 34.07 పాయింట్ల స్వల్ప ఆధిక్యతతో 36,616.81 వద్ద ముగిసింది. అలాగే నిఫ్టీ సైతం 22.10 పాయింట్లు ఎగబాకి 0.09 శాతం ఆధిక్యతతో 10,934.35 వద్ద ముగిసింది. సెన్సెక్స్ ప్యాక్‌లో హీరోమోటోకార్ప్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, బజాజ్ ఆటో, మారుతీ, మహీంద్రా అండ్ మహీంద్రా కంపెనీలు అధిక లాభాలను ఆర్జించాయి. ఈ సంస్థలు సుమారు 2.66 శాతం అదనపు లాభాలను ఆర్జించినట్టు గణాంకాలు చెబుతున్నాయి.

నష్టపోయిన కంపెనీలివే..

సెన్సెక్స్ ప్యాక్‌లోని టాటా మోటార్స్, కోల్ ఇండియా, ఓఎన్‌జీసీ, టాటాస్టీల్, యెస్‌బ్యాంక్, సన్‌ఫార్మా, ఐటీసీ, ఐసీఐసీ బ్యాంక్ నష్టపోయాయి. ఈ సంస్థలు సుమారు 2.63 శాతం నష్టపోయాయి. రిజర్వు బ్యాంకు మానిటరీ విధానంపై జరుగుతున్న సమీక్షా సమావేశంలో ఏ నిర్ణయం జరుగుతుందో వేచిచూద్దాం అనే ధోరణిని మంగళవారం మదుపర్లు ప్రదర్శించారని మార్కెట్ పరిశీలకులు పేర్కొంటున్నారు. మూడు రోజులపాటు జరిగే ఆర్బీఐ మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) సమావేశం మంగళవారం నుంచి ఆరంభమైంది. ప్రత్యేకించి కీలకమైన రేట్లపై ఈ సమీక్షా సమావేశంలో నిర్ణయం తీసుకునే అవకాశాలున్నాయంటున్నారు. తక్కువ ద్రవ్యోల్బణం విషయంలో ఆర్బీఐ తన వైఖరిని మార్చుకునే అవకాశాలున్నాయంటున్నారు. అలాగే వార్షిక సవాళ్లు, చమురు ధరల పెరుగుదల వంటి సమస్యలున్న దృష్ట్యా రేట్లకు కోతవిధించే అవకాశాలు మాత్రం లేదని పరిశీలకులు భావిస్తున్నారు. ఇలావుండగా బీఎస్‌ఈ స్మాల్ కాప్‌లో మంగళవారం ప్రభుత్వ, ప్రైవేటు రంగాలకు సంబంధించినంత వరకు లోహ, ఎఫ్‌ఎమ్‌సీజీ సూచీలు నష్టాలను చవిచూడగా, బీఎస్‌ఈ మిడ్‌కాప్‌లోని మోటారు వాహనాలు, ఫైనాన్షియల్ సర్వీసులు లాభాలతో సంతరించుకున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లలో జపాన్‌కు చెందిన నిక్కీ 0.19 శాతం నష్టపోగా, చైనాకు చెందిన బౌర్సెస్‌తోబాటు దక్షిణ కొరియా, సింగపూర్, ఇండోనేషియా మార్కెట్లు మంగళవారం చాంద్రమానం ప్రకారం కొత్త యేడాది ప్రారంభమవుతున్న దృష్ట్యా మూతపడ్డాయి. యూరో జోన్‌లో ఫ్రాంక్‌ఫర్ట్‌కు చెందిన డాక్స్ .83 శాతం, పారిస్‌కు చెందిన సీఏడీ-40 0.77 శాతం, లండన్‌కు చెందిన ఎఫ్‌టీఎస్‌ఈ 1.12 శాతం వంతున లాభాలను ఆర్జించాయి. డాలర్‌తో భారత రూపాయి విలువ మళ్లీ పుంజుకుని 4 పైసలు బలపడింది. ముడిచమురు ధరలు అంతర్జాతీయ మార్కెట్లో బ్యారల్‌పై 0.64 శాతం పెరిగి 62.91 డాలర్లకు చేరింది.






బులియన్

ముంబయిలో		హైదరాబాద్‌లో	
బంగారం (22 క్యారెట్స్)		**బంగారం (22 క్యారెట్స్)**	
1 గ్రాము:	రూ. 3,249.00	1 గ్రాము:	రూ. 3,187.01
8 గ్రాములు:	రూ.25,992.00	8 గ్రాములు:	రూ. 25,496.00
10 గ్రాములు:	రూ. 32,490.00	10 గ్రాములు:	రూ. 31,870.00
100 గ్రాములు:	రూ.3,24,900.00	100 గ్రాములు:	రూ. 3,18,700.00
బంగారం (24 క్యారెట్స్)		**బంగారం (24 క్యారెట్స్)**	
1 గ్రాము:	రూ. 3,474.866	1 గ్రాము:	రూ. 3,408.556
8 గ్రాములు:	రూ. 27,798.928	8 గ్రాములు:	రూ. 27,268.448
10 గ్రాములు:	రూ. 34,748.66	10 గ్రాములు:	రూ. 34,085.56
100 గ్రాములు:	రూ. 3,47,486.6	100 గ్రాములు:	రూ. 3,40,855.6
వెండి		**వెండి**	
8 గ్రాములు:	రూ. 331.20	8 గ్రాములు:	రూ. 331.20
10 గ్రాములు:	రూ. 414.00	10 గ్రాములు:	రూ. 414.00
100 గ్రాములు:	రూ. 4,140.00	100 గ్రాములు:	రూ. 4,140.00
ఒక కిలో:	రూ. 41,400.00	ఒక కిలో:	రూ. 41,400.00

మ్యూచువల్ ఫండ్స్‌లోకి నిధుల వెల్లువ

- గత జనవరిలో రూ.7వేల కోట్లకు పైగా పెట్టుబడులు
- ఈక్విటీల నుంచి రూ.5,264 కోట్లు ఉపసంహరించుకున్న ఎఫ్‌పీఐలు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: దేశీయ మార్కెట్లలోని మ్యూచువల్ ఫండ్స్‌లోకి గడచిన జనవరి నెలలో రూ.7వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. గడచిన యేడాది ఇదే నెలలో రూ.5,200 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. విదేశీ పోర్టుపోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐలు) భారత ఈక్విటీ మార్కెట్లలోని వాటాల విక్రయాలకు పాల్పడటంతో మ్యూచువల్ ఫండ్ నిర్వాహకులకు వరంగా మారిందని మార్కెట్ రంగ నిపుణులు అంచనా వేస్తున్నారు. సెబీ డిపాజిటరీస్ గణాంకాల మేరకు మ్యూచువల్ ఫండ్ నిర్వాహకులు గడచిన నెలలో రూ.7,160 కోట్ల విలువైన వాటాలను కొనుగోలు చేయించినట్టు తెలిసింది. మరోవైపు ఎఫ్‌పీఐలు రూ.5,264 నిధులను వెనక్కు తీసుకున్నారు. కాగా ప్రధానంగా దేశీయ రీటైల్ ఇన్వెస్టర్లు సిస్టమేటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (ఎస్‌ఐపీ) ద్వారా పెట్టుబడులు కొనసాగించారని విశ్లేషకులు అంచనావేస్తున్నారు. రాబోయే నెలల్లో సైతం ఈ ట్రెండ్ కొనసాగి నిధులు వెల్లువలా వచ్చే అవకాశాలున్నాయంటున్నారు. ఎస్ఐపీలో చిన్నమొత్తాల్లో సైతం వారం, నెల, త్రైమాసిక విధాల్లో పెట్టుబడులు పెట్టే వీలుంటుంది. ఇది ఒకరకంగా రికరింగ్ డిపాజిట్ల వంటివే. కాగా ఈక్విటీ మార్కెట్ల నుంచి నిధులు వెనక్కు మళ్లడాన్ని పరిశీలిస్తే మదుపర్లు వేచిచూసే ధోరణిని ప్రదర్శించారని అవగతమవుతుందని సీనియర్ మార్కెట్ విశ్లేషకుడు హిమాంశు శ్రీవాత్సవ పేర్కొన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల ఫలితాలు, దేశ ఆర్థిక స్థితిపై మదుపర్లు ప్రధాన దృష్టి కేంద్రీకరించారని తేటతెల్లం అవుతోందన్నారు. ప్రపంచ వాణిజ్య యుద్ధం, ముడిచమురు ధరల పెరుగుదల, కరెన్సీ విలువ తదితర అంశాలు సైతం మదుపర్లు పరిగణనలోకి తీసుకుని ముందుకెళుతున్నారని వివరించారు.

ఆర్థిక లావాదేవీలే అంతమొందించాయి

జయరాం హత్య కేసులో వీడిన మిస్టరీ

• నిందితులు రాకేష్‌రెడ్డి, అతడి డ్రైవర్ • వివరాలు వెల్లడించిన కృష్ణా ఎస్పీ

నందిగామ, ఫిబ్రవరి 5: ఆర్థిక లావాదేవీల వ్యవహారంలోనే ఎన్ఆర్ఐ చిగురుపాటి జయరాం హత్యకు గురయ్యారని, ఈ కేసులో ప్రధాన నిందితుడితో పాటు మరొకరిని అరెస్టు చేసినట్టు కృష్ణా జిల్లా ఎస్పీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి తెలిపారు. మంగళవారం సాయంత్రం నందిగామ డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. జయరాం హత్య కేసులో రాకేష్‌రెడ్డితో అతని డ్రైవర్ శ్రీనివాస్‌లను నిందితులుగా గుర్తించామన్నారు. డబ్బు కోసమే పథకం ప్రకారం జయరాంను హత్య చేసినట్టు తమ దర్యాప్తులో వెల్లడయిందన్నారు. రాకేష్‌రెడ్డిపై హైదరాబాదులో పలు కేసులు కూడా ఉన్నాయన్నారు. గతంలో జయరాం కంపెనీలో సమస్య ఏర్పడినప్పుడు ఆయన మేనకోడలు శిఖాచౌదరికి రాకేష్ రెడ్డి సహకరించారని, తరువాత వారి మధ్య కొన్నేళ్లు పరిచయం కొనసాగిందన్నారు. గత నెల 30న రాకేష్‌రెడ్డి ఒక మహిళ పేరుతో వాట్సప్ సందేశం పంపి జయరాంను ఇంటి నుంచి బయటకు పిలిపించి బంధించాడని, తనకు గతంలో ఇవ్వాల్సిన డబ్బులు వడ్డీతో కలిసి 6కోట్లు చెల్లించాలని డిమాండ్ చేశాడన్నారు. జయరాంతో అతడి స్నేహితులు కొందరికి డబ్బు కోసం ఫోన్ చేయించాడన్నారు. ఒకరి నుండి రూ.6లక్షలు తెప్పించారన్నారు. 31వ తేదీ వరకూ డబ్బుల కోసం ఎదురుచూసి డబ్బులు రాకపోవడంతో జయరాంపై రాకేష్ రెడ్డి దాడి చేశాడని, జయరాం సోఫాలో పడిపోవడంతో సోఫాకు ముఖం ఒత్తిపెట్టి ఊపిరి ఆడకుండా చేసి హత్య చేశాడన్నారు. అనంతరం హైదరాబాదులో పరిచయస్తులైన ఇద్దరు పోలీసు అధికారులకు ఫోన్ చేసి విషయం చెప్పాడన్నారు. వారి సూచనల మేరకు వాచ్‌మెన్ సహాయంతో కారులో జయరాం మృతదేహాన్ని తీసుకువచ్చి ఐతవరం సమీపంలో జాతీయ రహదారి పక్కన కారుతో సహా వదిలివెళ్లిపోయాడన్నారు. ఈ కేసులో ఇంకెవరి ప్రమేయం అయినా ఉందా అనే విషయం పూర్తిస్థాయి దర్యాప్తులో తేలుతుందన్నారు. నిందితులను కోర్టుకు హాజరుపర్చిన తరువాత కోర్టు అనుమతితో విచారణకు కస్టడీలోకి తీసుకుంటామని తెలిపారు. నిందితుడి కాల్ డేటాలో ఉన్న తెలంగాణకు చెందిన ఇద్దరు పోలీసు అధికారుల విషయం అక్కడి ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చామన్నారు. ఇక్కడి పోలీసు అధికారుల సమాచారంతో ఆ ఇద్దరు అధికారులపై బదిలీ వేటు వేసినట్టు సమాచారం. కాగా హతుడి భార్య మాత్రంలో మేనకోడలు శిఖా చౌదరి పాత్ర కూడా ఉండి ఉంటుందని, పూర్తి స్థాయిలో దర్యాప్తు జరిపి న్యాయం చేయాలని పోలీసులకు తెలియజేసినట్టు సమాచారం. శిఖా చౌదరి, రాకేష్‌రెడ్డి గతంలో స్నేహితులేనని, కానీ ప్రస్తుతం వారి మధ్య సంబంధాలు లేనట్టు తెలిసిందని ఎస్పీ చెప్పారు. పూర్తి స్థాయిలో దర్యాప్తు కొనసాగుతుందని ఎస్పి త్రిపాఠి వెల్లడించారు. ఈ సమావేశంలో డీఎస్పీ బోస్ తదితర అధికారులు పాల్గొన్నారు.



నిందితులను చూపి వివరాలు వెల్లడిస్తున్న కృష్ణా జిల్లా ఎస్పీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి



భారతీయ విద్యార్థులపై విచారణ

• తొలి రోజు తెలుగు విద్యార్థుల తరపున అటార్నీ వాదనలు • విచారణ పూర్తయ్యేవరకూ ఫెడరల్ కస్టడీలోనే

• బెయిల్‌పై విడుదలైతే అరెస్టులు అనివార్యం • అంతా తెలిసే తప్పు చేస్తున్న విద్యార్థులు: అమెరికా వాదన

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 5: అమెరికా మిచిగన్ ఫెడరల్ కోర్టులో డిటెన్షన్‌లో ఉన్న 8 మంది తెలుగు విద్యార్థులపై విచారణ ప్రారంభమైంది. థియోడాటర్ లివిన్ యునైటెడ్ స్టేట్స్ మిచిగన్ ఫెడరల్ కోర్టు హౌస్‌లో ఫర్మింగ్టన్ యూనివర్శిటీ విద్యార్థులను ఒకొక్కరిని విచారించారు. 8 మంది విద్యార్థుల తరపున అమెరికన్ తెలంగాణ అసోసియేషన్ ఏర్పాటు చేసిన అటార్నీలు తమ వాదనలు వినిపించేందుకు సిద్ధమయ్యారు. తొలి రోజు అటార్నీ ఎడ్వర్డ్ బజుకా తమ వాదనలు వినిపించారు. ట్రయిల్ వివరాలను అమెరికన్ తెలంగాణ అసోసియేషన్ ప్రతినిధి వెంకట్ మంతెనకు అటార్నీ బజుకా వివరించారు. వీలైనంత తొందరగా విద్యార్థులు విడుదలయ్యేలా ప్రయత్నిస్తున్నామని మంతెన చెప్పారు. ట్రయిల్ కోర్టులో విచారణ పూర్తయ్యేంత వరకూ తెలుగు విద్యార్థులను ఫెడరల్ కస్టడీలోనే ఉంచాలని వాదిస్తున్నామని అన్నారు. లేకుండే వారు బెయిల్‌పై విడుదల అయితే యూఎస్ఐసీఈ (అమెరికా ఇమిగ్రేషన్ కస్టమ్స్ ఎన్‌ఫోర్సుమెంట్) వారిని అరెస్టు చేసే ముప్పు ఉందని వారు వివరించారు. అందుకే కస్టడీని శిక్షగా పరిగణించకుండా చర్యలు చేపట్టామని అన్నారు. ఫెడరల్ కస్టడీలో ఉంటే శిక్ష పడినా, ఫెడరల్ కస్టడీలో ఉన్న రోజులకు శిక్షా కాలం మినహాయింపు లభిస్తుందని అదే యుఎస్ ఐసీఈ అరెస్టు చేస్తే ఇలాంటి మినహాయింపు కూడా దక్కదని వారు వివరించారు. కొంత సానుకూల నిర్ణయం వస్తుందని తాము భావిస్తున్నట్టు వారు చెప్పారు. ఇక డి-3గా ఉన్న విద్యార్థి ఫణీంద్ర కర్నాటికి బెయిల్ వచ్చిందని కానీ అతడిని అమెరికా ఇమిగ్రేషన్ కస్టమ్స్ అధికారులు అదుపులోకి తీసుకోలేదని, దానికి కారణం ఆయనకు హెచ్-1 వీసా ఉండటమేనని వారు వివరించారు. ప్రభుత్వం విద్యార్థులను అరెస్టు చేసే సమయంలో సీజ్ చేసిన సమయంలో చాలా ఫైళ్లు, ఫోన్‌కాల్స్ లిస్టు, డాటాను సేకరించిందని, ఈ డేటా వివరాలు తమకు కూడా అందాయని, ఈ డాటా చాలా పెద్ద మొత్తంలో ఉందని, వాటిని పరిశీలించేందుకు కొంత సమయం పడుతుందని అన్నారు. విచారణలో చాలా గోప్యంగా ఉంచాల్సిన విషయాలు ఉంటాయని, వాటిని ఈ దశలో వివరించలేమని అటార్నీ పేర్కొన్నారు. వచ్చే వారం సెకండ్ ట్రయిల్ ఉండే అవకాశం ఉందని, అందులో మిగిలిన తెలుగు విద్యార్థులకు సానుకూల తీర్పు వస్తుందని భావిస్తున్నామని అన్నారు. కాగా మరో పక్క అమెరికా ఇమిగ్రేషన్ అధికారులు మాత్రం భారత్ నుండి విచ్చిన విద్యార్థులు అంతా తెలిసే తప్పులు చేస్తున్నారని కావాలని వారు అక్రమంగా దేశంలోకి ప్రవేశించాలని చూస్తున్నారని తమ వాదన వినిపించారు.

మేం నిర్దోషులం..

వాషింగ్టన్: నకిలీ యూనివర్శిటీల్లో అనేక మంది విద్యార్థులను చేర్పించి మోసం చేసిన కేసులో తాము నిర్దోషులమని ఎనిమిది మంది భారతీయులు అమెరికా కోర్టుకు తెలిపారు. ఎనిమిది మంది నిందితుల్లో ఫణదీమప్ కర్నాటి లూయిస్ విల్లీలో హెచ్-1బీ వీసాపై ఉంటున్నారు. కెంటూకీ అనే వ్యక్తి పదివేల డాలర్లను చెల్లించి బెయిల్‌పై విడుదలయ్యారు. మిగిలిన నిందితులు భరత్ కాకిరెడ్డి, సురేష్ కందాల, ప్రేమ్ రాంపీసా, సంతోష్ సామా, అవినాష్ తక్కెళ్లపల్లి, అశ్వంత్ నూనే, నవీన్ ప్రతిపాటి డిటెన్షన్ సెంటర్‌లోనే ఉన్నారు. వీరంతా మిచిగాన్ తూర్పు జిల్లా డిటెన్షన్ సెంటర్‌లో ఉన్నారు. వీరిని అరెస్టు చేసిన తర్వాత పోలీసులు ఈ కోర్టులో హాజురపరిచారు. గత సోమవారం డెట్రాయిట్, ఫ్లోరిడా, వర్జీనియాలో వీరిని అరెస్టు చేశారు. కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆపరేషన్‌లో భాగంగా పోలీసులు వీరిని అరెస్టు చేశారు. ఈ విభాగం పోలీసులు మరో 130 మంది విద్యార్థులను కూడా అరెస్టు చేశారు. పోలీసులు అరెస్టు చేసిన ఎనిమిది మంది నిందితులు తాము నిర్దోషులమని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. కర్నాటి తరపున న్యాయవాది జాన్ డబ్ల్యు బ్రూస్టార్ వాదనలు వినిపిస్తూ, తమ క్లైంట్‌తో సహా మిగిలిన వారిపై చేసిన అభియోగాల్లో నిజం లేదన్నారు. మంచి రికార్డు కలిగి ఉన్నందుకు కర్నాటిని కోర్టు విడుదల చేసిందన్నారు. కర్నాటి పదేళ్ల క్రితం హెచ్-1బీ వీసాపై అమెరికాకు వచ్చారు. ఈ కేసులో అభియోగాలు రుజువైతే కనీసం ఐదేళ్ల శిక్ష పడుతుంది. ప్రాసిక్యూషన్ ప్రకారం 2017 ఫిబ్రవరి నుంచి ఈ ఏడాది జనవరి వరకు ఈ ఎనిమిది మంది నిందితులు వందలాది మంది విద్యార్థులను మోసం చేసి నకిలీ వర్శిటీల్లో చేర్పించారని పోలీసులు ఆరోపణ చేశారు. మెట్రో డెట్రాయిట్ వర్శిటీలో ఈ విద్యార్థులను చేర్పిస్తున్నారు. హోంల్యాండ్ సెక్యూరిటీ ఇన్విస్టిగేషన్ ఏజన్సీ ఈ కేసును దర్యాప్తు చేస్తోంది. తప్పుడు డాక్యుమెంట్ల ద్వారా విదేశీ విద్యార్థులను ఈ యూనివర్శిటీలో చేరేవిధంగా ఈ ఎనిమిది మంది నిందితులు కుట్రపన్నారని పోలీసులు అభియోగం మోపారు. కాగా నకిలీ డాక్యుమెంట్లతో వర్శిటీలో చేరామనే వాస్తవం 130 మంది విద్యార్థులకు తెలుసని పోలీసులు చెప్పారు.



ముగిసిన ఎస్పీ బాలు తల్లి అంత్యక్రియలు

• కన్నీటి వీడ్కోలు పలికిన కుటుంబ సభ్యులు



తల్లి పార్థివ దేహం వద్ద కన్నీటి పర్యంతమవుతున్న బాలు

ఆంధ్రభూమి బ్యూరో

నెల్లూరు, ఫిబ్రవరి 5: ప్రముఖ సినీ నేపథ్య గాయకుడు ఎస్పీ బాలసుబ్రమణ్యం మాతృమూర్తి శ్రీపతి పండితారాధ్యులు శకుంతలమ్మ అంత్యక్రియలు నెల్లూరులో విషణ్ణ వదనాల నడుమ మంగళవారం నిర్వహించారు. తల్లి మరణించే నాటికి లండన్‌లో ఉన్న ఎస్పీ బాలసుబ్రమణ్యం మంగళవారం మధ్యాహ్నానికి నెల్లూరుకు చేరుకున్నారు. తల్లి పార్థివ దేహాన్ని చూసిన వెంటనే బాలు కన్నీరుమున్నీరుగా రోదించారు. చివరకు బాధను దిగమింగుకొని తల్లి అంతిమసంస్కారాలకు ఆయన సిద్ధమయ్యారు. సాయంత్రం నగరంలోని తిప్పరాజువారి వీధిలో ఉన్న వారి స్వగృహం నుండి బయలుదేరిన అంతిమయాత్ర మహాప్రస్థానం వరకూ కొనసాగింది. చివరకు తల్లి పార్థివ దేహానికి బాలు నిప్పంటించారు. ఈ యాత్రలో బాలు సోదరి ఎస్పీ శైలజ భర్త ప్రముఖ సినీ నటుడు శుభలేఖ సుధాకర్, సినీ గేయరచయితలు వెన్నెలకంటి, సంగీత దర్శకుడు వాసూరావుతో పాటు నగర ప్రముఖులు పాల్గొన్నారు.

దక్షిణ మధ్య రైల్వే జీఎంగా గజానన్ మాల్యా

ఆంధ్రభూమి బ్యూరో



హైదరాబాద్, ఫిబ్రవరి 5: దక్షిణ మధ్య రైల్వే డివిజన్ నూతన జనరల్ మేనేజగా గజానన్ మాల్యా మంగళవారం బాధ్యతలు చేపట్టారు. అంతకు ముందు ఇక్కడ జీఎంగా పనిచేసి రైల్వే బోర్డు చైర్మన్‌గా బదిలీ అయిన వినోద్‌కుమార్ యాదవ్ స్థానంలో మాల్యా నియమితులయ్యారు. 1979 సంవత్సరంలో రైల్వేలో స్పెషల్ క్లాస్ రైల్వే అప్రెంటిస్‌గా గజానన్ మాల్యా సర్వీస్‌ను ప్రారంభించారు.

ఏపీకి అదనపు అప్పు అవకాశం లేదు

• రాజ్యసభలో కేంద్ర మంత్రి రాధాకృష్ణ

• నిర్దిష్ట పరిమితులకు లోబడినందున తెలంగాణకు అవకాశం

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: ఆర్థిక సంఘం విధించిన షరతులకు లోబడి పని చేయనందున 2018-19 సంవత్సరంలో 3 శాతం ఎఫ్ఆర్‌బీఎం పరిమితికి మించి అదనంగా అప్పులు చేసే అర్హతను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కోల్పోయిందని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పోన్ రాధాకృష్ణ మంగళవారం రాజ్యసభలో వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రం నిర్దిష్ట పరిమితులకు లోబడి ఉన్నందున 2018-19లో ఎఫ్ఆర్‌బీఎం పరిమితిని మించి అదనంగా రూ.2,052కోట్ల రుణాలు సమకూర్చుకునే అర్హతను సంపాదించుకున్నట్లు ఆయన తెలిపారు. వైఎస్ఆర్‌సీపీపి సభ్యుడు విజయ సాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు రాధాకృష్ణ రాత పూర్వకంగా ఇచ్చిన సమాధానంలో ఈ విషయాలు వెల్లడించారు. రాష్ట్ర విభజన మూలంగా రెవెన్యూలో ఏర్పడిన తీవ్ర అసమతౌల్యం కారణంగా ఎఫ్ఆర్‌బీఎం పరిమితిని ఒక శాతం సడలించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేసిన విజ్ఞప్తి తమకు చేరిందని ఆయన చెప్పారు. రాష్ట్ర స్థూల జాతీయోత్పత్తిపై ద్రవ్య లోటుకు అదనంగా 2018-19 సంవత్సరంలో 0.5 శాతం మేర రుణాలు సమీకరించుకునేందుకు అనుమతి ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు కోరినట్లు మంత్రి తెలిపారు. రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన విజ్ఞప్తులను పద్నాల్గవ ఆర్థిక సంఘం సిఫారసుల పరిధిలో పరిశీలించిన అనంతరం తెలంగాణకు మాత్రమే అదనంగా అప్పులు తీసుకునే అర్హత ఉన్నట్లు నిర్ధారణ జరిగిందని రాధాకృష్ణ తెలిపారు. పద్నాల్గవ ఆర్థిక సంఘం నివేదికపై పార్లమెంటు ఉభయ సభల్లో ప్రవేశపెట్టిన కార్యచరణ రిపోర్టు ప్రకారం 2015 నుండి 2020 వరకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణతోసహా దేశంలోని అన్ని రాష్ట్రాలు ఆయా రాష్ట్ర వార్షిక జీఎస్‌డీపీపై మూడు శాతం మించి రుణాలు తీసుకునేందుకు వీలులేదని మంత్రి స్పష్టం చేశారు.

రూ.62వేల కోట్లు ఇచ్చాం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేంద్ర ప్రాయోజిత పథకాల కింద 2014 నుండి 2019 ఫిబ్రవరి రెండో తేదీ వరకు రూ.62,168కోట్లను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిందని ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ మంగళవారం తెలిపారు. విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు జైట్లీ లిఖితపూర్వకంగా ఇచ్చిన సమాధానంలో ఈ విషయం వెల్లడించారు.

సీబీఐ ముందు హాజరు కావాల్సిందే

కోల్‌కతా పోలీస్ కమిషనర్‌కు సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: పశ్చిమబెంగాల్ ప్రభుత్వానికి సుప్రీంలో ఎదురుదెబ్బ తగిలింది. శారదా చిట్స్ కుంభకోణంలో కోల్‌కతా పోలీస్ కమిషనర్‌ను ప్రశ్నించడానికి వెళ్లిన సీబీఐ అధికారులను బెంగాల్ పోలీసులు నిర్బంధించగా, దానిపై వారు సోమవారం సుప్రీంను ఆశ్రయించగా, విచారణ మంగళవారానికి వాయిదా పడిన విషయం తెలిసిందే. శారదా చిట్‌ఫండ్ కుంభకోణం కేసుకు సంబంధించి కోల్‌కతా పోలీస్ కమిషనర్ రాజీవ్ కుమార్ సీబీఐ ముందు హాజరై దర్యాప్తుకు సహకరించాల్సిందేనని సుప్రీంకోర్టు మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. మేఘాలయ రాష్ట్రంలోని షిల్లాంగ్‌లో సీబీఐ ముందు రాజీవ్‌కుమార్ హాజరు కావాలని పేర్కొన్న సుప్రీం విచారణలో భాగంగా ఆయనను అరెస్టు చేయడం వంటి చర్యలు తీసుకోరాదని ఆదేశించింది. చీఫ్ జస్టిస్ రంజన్ గొగోయ్ నేతృత్వంలో జస్టిస్‌లు దీప్‌గుప్తా, సంజీవ్ ఖన్నాలతో కూడిన ధర్మాసనం కేసుకు సంబంధించి తన వివరణను ఈనెల 20లోగా తెలియజేయాలని రాజీవ్‌కుమార్‌ను ఆదేశించింది. ప్రస్తుతం పశ్చిమబెంగాల్ సిట్ వద్ద ఉన్న ఎలక్ట్రానిక్ ఎవిడెన్స్‌లను మార్చడం లేదా ధ్వంసం చేసే ప్రమాదం ఉందని, దానిపై తగు ఆదేశాలు జారీ చేయాలని సీబీఐ చేసిన రెండో ఆరోపణపై తదుపరి కేసు విచారణ తేదీన దానిని పరిశీలిస్తామని ధర్మాసనం తెలిపింది. కోర్టు ధిక్కారణకు పాల్పడ్డారని పశ్చిమబెంగాల్ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, కోల్‌కతా పోలీస్ కమిషనర్‌లపై సీబీఐ చేసిన ఆరోపణలపై వారు ఈనెల 18లోగా సమాధానం ఇవ్వాలని ఆదేశించింది. వీరి ముగ్గురి సమాధానాలు పరిశీలించిన తర్వాత వారు 20వ తేదీన వ్యక్తిగతంగా హాజరు కావాలా వద్ద అనే విషయాన్ని నిర్ధారిస్తామన్నారు. అటార్నీజ నరల్ కెకె వేణుగోపాల్, సోలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తొలుత 2014లో జరిగిన శరదా చిట్స్ కుంభకోణం కేసుకు సంబంధించిన వివరాలను క్లుప్తంగా వివరించారు. సుప్రీం ఆదేశం మేరకు ఈ కేసును సీబీఐకి అప్పగించిన తర్వాత ఈ కేసు విచారణకు రాజీవ్‌కుమార్ తమకు ససకరించడం లేదని వారు ఆరోపించారు. అంతేకాక రాజీవ్‌కుమార్ నేతృత్వంలోని సిట్ బృందం తమకు ఇంతవరకు ఈ కేసుకు సంబంధించిన అన్ని పత్రాలు అందజేయలేదని, వాటిలో కొన్ని మార్చి ఉన్నాయని వారు తెలిపారు. కేసుకు సంబంధించిన పూర్తి డేటా ఇవ్వలేదని, ఇచ్చిన వాటిలో ఉద్దేశపూర్వకంగా తొలగింపులు, చేర్పులు ఉన్నాయని చెప్పారు. 15 వేల కోట్ల కుంభకోణానికి సంబంధించిన ఈ కేసుకు సంబంధించి రాజీవ్‌కుమార్ తమ దర్యాప్తునకు అందుబాటులో ఉండేలా ఆదేశించాలని వారు కోర్టును కోరారు. 'కారణం ఏమీ లేకుండా ఆయన దర్యాప్తుకు ఎందుకు హాజరు కావడం లేదు?' అని ధర్మాసనం ఈ సందర్భంగా ప్రశ్నించింది. పశ్చిమ బెంగాల్ పోలీసుల తరపున హాజరైన సీనియర్ అడ్వకేట్ అభిషేక్ సంఘ్వీ సీబీఐ చేసిన ఆరోపణలను ఖండించారు. కోల్‌కతా పోలీస్ కమిషనర్‌ను వేధించడానికి, ఆయన పరువును తీయడానికి సీబీఐ ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ఈ కుంభకోణానికి సంబంధించి సిట్ దర్యాప్తుకు ప్రశంసలు వచ్చాయని, పలు రాష్ట్రాలకు సంబంధించి ఈ కేసు ముడిపడి ఉన్నందున దానిని సీబీఐకి అప్పగించారని ఆయన చెప్పారు. రాజీవ్‌కుమార్‌పై ఇంతవరకు ఎలాంటి ఎఫ్ఐఆర్ దాఖలు కాలేదని, చిట్‌ఫండ్ కుంభకోణం సహా ఏ కేసులోనూ ఆయన నిందితుడిగా లేరని ఆయన కోర్టుకు స్పష్టం చేశారు.

Printed and Published from Vijayawada by K.Sudhakar on behalf of Deccan Chronicle Holdings Limited at Deccan Chronicle Holdings Press, No.C 3 & 4, Patamata, Industrial Estate, Vijayawada. Chief Editor T.V.Ravi Reddy, Phones:2555284,2555185,2555287 Regd. No.AP/VJA/41/51/2000. RNI Registration No.52743/90

మాతృభూమి

పర స్త్రీలను తల్లులుగా
పర ధనమును మట్టివోలె భావించుటయే
పరమోన్నత సంస్కారము
సరళముగా పొందగల్గు సాయుజ్యమిదే

ఆంధ్రభూమి

బుధవారం, 6 ఫిబ్రవరి 2019



మానవత్వమా.. నీవెక్కడ?




అమ్మ గురించి నాలుగు మాటలు చెప్పండంటే, నలభై చెబుతామని ఆగమన్నా ఆగరు. సృష్టికి మూలం అమ్మ, అమ్మను మించిన దైవం లేదు, ఆదిగురువు అమ్మ, అమ్మా.. అమ్మా అంటూ ఎన్నో కవిత్వాలు, మరెన్నో వ్యాసాలు. పుస్తకాలు సైతం ముద్రించి అమ్మ యొక్క గొప్పతనాన్ని వర్ణిస్తుంటారు. కానీ సమాజంలో వృద్ధాశ్రమాల అవసరం ఎందుకొచ్చింది? తమ పుత్ర సంతానంతో అష్టకష్టాలు పడుతున్న పరిస్థితి కొంతమంది అమ్మలకెందుకు కలిగిందో ఆలోచించాల్సిన అవసరం వున్నది. కడుపులో పురుడు పోసుకున్నపుడు అమ్మకు కలిగే సంతోషానందాన్ని దేనితో వెలకట్టలేమన్నది జగమెరిగిన సత్యం. తమ ప్రాణాలతో సమానంగా పిల్లలను చూసుకుంటూ, అల్లారుముద్దుగా గోరుముద్దలు తినిపిస్తూ, కంటికి రెప్పగా కాపాడుకుంటున్న విషయం సైతం అందరికీ తెలిసిందే. ఇంత తెలిసిన సమాజంలో ఇంకా అమ్మలు కష్టాలు పడుతున్నారంటే కారణమేమిటి? ప్రత్యేకంగా ధనవంతులు, అపారజ్ఞానం కలిగిన ఉద్యోగస్తులకు చెందినవారే వారి తల్లిదండ్రులను వృద్ధాశ్రమాలలో వుంచుతున్నారంటే కారణం నేటి సమాజంలో మానవ సంబంధాలకంటే ఎక్కువ ప్రాముఖ్యత ఆర్థిక సంబంధాలకే ఇస్తున్నారని అర్థంగాక మానదు.

తమ పిల్లలు తిన్నారో, ఎలాగున్నారో, ఎక్కడున్నారో, ఏమైనా బాధలు పడుతున్నారేమో అనుకుంటూ మదనపడే అమ్మ, ఒక్క ఫోన్ కాల్‌తో ఒక్క మాట మాట్లాడితే చాలు కడుపునిండిన సంతోషంతో సంబరపడిపోతుంది. కానీ అలాంటి ఆలోచన ఎందుకు తమ అమ్మా నాన్నలపై పిల్లలకు కలగదో ఆలోచించాల్సిన ఆవశ్యకత ఉన్నది. తమ పిల్లలకోసం ఎంత వయసు వచ్చినా ఆరాటపడే అమ్మను కంటికి రెప్పలా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి కుమారులపై వున్నది.

అధికారులుగా చెలామణి అవుతూ తమ తల్లిని వృద్ధాశ్రమాలలో ఉంచిన వ్యక్తిని, ఎందుకు సార్ ఇలా చేశారు? పలువురికి ఆదర్శంగా ఉండాల్సిన మీరు, మీ అమ్మగారిని అక్కడ ఎందుకు ఉంచారంటే- మా అమ్మ అంటే నాకు అమితమైన ప్రేమ. అందుకే అక్కడ ఉంచాం. ఎందుకంటే నేను, మా ఆవిడా ఉద్యోగం చేయడం మూలంగా పొద్దున వెళ్లి, ఏదో చీకటిపడ్డాక ఇంటికి చేరుకుంటాము. రోజంతా అమ్మను ఎవరు చూసుకుంటారో తెలియక అక్కడ ఉంచాల్సి వచ్చిందని సెలవిచ్చారు. కానీ అమ్మ ప్రేమ తన బాగోగులకంటే, ఆమె కళ్ళముందు వారుంటేనే సంతోషంగా ఉంటుంది. అవసరమైతే సేవలు చేయడానికి ఎంతోమంది పేదలున్నారు. వారికీ పని కల్పించి ఇంట్లోనే అమ్మనుంచితే ఎంతో బాగుండేది కదా!

ఇంకొకరు, భార్య మూలంగా వృద్ధాశ్రమాలలో చేర్పుతారు. పనిచేసేంత ఓపిక, శక్తి ఉన్నంతవరకు ఇంట్లో అన్ని పనులకు వాడుకొని, చేతగాని సమయం ఆసన్నమైందంటే చాలు, ప్రతిదానికి వారిపై అరుస్తూ, చీటికి మాటికి మాటలతో వారి మనసును బాధకల్గించేలా, తమకు తాము ఇంట్లో నుండి బయటికెళ్లేలా చేస్తుంటారు. కానీ ఇక్కడ అలాంటివారు గమనించాల్సిన విషయం ఒకటుంది. ఎవ్వరూ ఎల్లప్పుడూ నిత్య యవ్వనంతో వుండరు. అందరూ ముసలివారు కావాల్సిందే. మనకీ అలాంటి దుస్థితి రావచ్చు. మనం వృద్ధులను అగౌరవపరిచినప్పుడు ఇంట్లో పిల్లలు చూస్తూ నేర్చుకొని భవిష్యత్తులో మనపై ప్రయోగించలేరని చెప్పగలమా? కాబట్టి ప్రతి ఒక్కరు వృద్ధాప్యంలో వున్నవారిని తల్లిదండ్రులుగా భావించి, చేదోడు వాదోడుగా వుంటూ, చిన్నతనంలో మనను ఎలా చూసుకున్నారో, వారిని సైతం అలా చూసుకుంటూ, ఇంట్లో పిల్లలకు సైతం అలాంటి మంచి విషయాలను బోధిస్తే, దృఢంగా నమ్మి అలా చేయడానికి ఆస్కారముంది. కాబట్టి ప్రతిఒక్కరు వృద్ధాప్యంలో అమ్మ, నాన్నలను కంటికి రెప్పలా చూసుకుంటూ వీలైనంత ఎక్కువ సమయాన్ని వారితో గడుపుతూ, వారి చివరి క్షణాలను ఆనందభరితం చేస్తే ఎంతో మేలు జరిగి జన్మ సార్థకమవుతుంది. అందరూ ఆ దిశగా పయనించాల్సిన అవసరముంది.



వాస్తవానికి ఏదైనా మన దగ్గర వున్నపుడు దాని విలువ తెలియదు. దూరమైతేనే దాని విలువ తెలుస్తుంది. వృద్ధాశ్రమాల దగ్గరికి వెళ్లి వారిని కదిలిస్తే తెలుస్తుంది, వారు పడ్డ కష్టాలు, అనుభవిస్తున్న తీరు, ఆ తల్లుల మనోవేదనను ఆపడం ఎవ్వరితరమూ కాదు.



పల్లెల్లో సైతం ఆస్తి తగాదాల కారణంగా అమ్మా నాన్నలను దూషించడం, కొట్టడం, ఇంట్లోనుండి గెంటెయ్యడం లాంటి వాటిని అక్కడక్కడా చూస్తూంటాం. ఏ కోణంలో చూసినా నేటి సమాజంలో ప్రేమ, ఆప్యాయతలలాంటివి ఏనాడో కనుమరుగైపోయాయి. సమస్త లోకాన్ని కేవలం డబ్బే శాసిస్తుందనడానికి ఇదొక నిదర్శనం.

అమ్మ ప్రేమను, నాన్న ప్రేమను ఎక్కువ కాలం నోచుకోనివారు అప్పుడప్పుడు వారిలేని లోటును వివరిస్తూ కన్నీళ్ల పర్యంతం కావడం కూడా అప్పుడప్పుడు చూస్తూంటాం. వాస్తవానికి ఏదైనా మన దగ్గర వున్నపుడు దాని విలువ తెలియదు. దూరమైతేనే దాని విలువ తెలుస్తుంది. వృద్ధాశ్రమాల దగ్గరికి వెళ్లి వారిని కదిలిస్తే తెలుస్తుంది, వారు పడ్డ కష్టాలు, అనుభవిస్తున్న తీరు, ఆ తల్లుల మనోవేదనను ఆపడం ఎవ్వరితరమూ కాదు.

వ్యాపారస్తులు సైతం ప్రైవేటుగా సకల సౌకర్యాలు కల్పిస్తూ, హాస్టల్స్ మాదిరిగా వృద్ధాశ్రమాలు నెలకొల్పి, అన్ని సేవలకుగాను కొంత సొమ్ము చెల్లించే విధంగా అక్కడక్కడా ఆశ్రమాలు నెలకొల్పినా ఆశ్చర్యపోనక్కరలేదు. ఇలాంటి దుస్థితికి చేరుకుంటున్నారంటేనే మానవత్వం ఏ మేరలో పొంగి పొర్లుతుందో తెలియకనే తెలుస్తుంది. ఇప్పటికైనా యావత్ సమాజంలో ఇలాంటి ఆలోచనా ధోరణి కలిగివున్నవారిలో కొంత మార్పు వచ్చి, తల్లిదండ్రులకు తమ జీవిత చివరిదశలో వారిపై ప్రేమ, ఆప్యాయతలు కురిపిస్తూ చూసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఏది ఏమైనప్పటికీ మానవత్వం మరిచి తల్లిదండ్రులను వెలివేస్తున్న ఈ తరుణంలో వృద్ధాశ్రమాలు వారికి అండగా నిలుస్తూ, ఆశ్రయం కల్పిస్తున్న మహనీయులని అభినందిస్తూ-ఇలాంటి పరిస్థితులు నెలకొన్నందున చింతిస్తూ కనీసం ఇప్పటికైనా ప్రతి ఒక్కరిలో మార్పు వచ్చి వారి తల్లిదండ్రులకు చేసే సేవను అదృష్టంగా భావించి, ఇలాంటి పరిణామాలకు దారితీయకూడదని ఆశిద్దాం.

- డా॥ పోలం సైదులు



భారీ క్యాబేజీ-పాప..

తొమ్మిదేళ్ల బాలిక భారీ క్యాబేజీని పండించి 32 వేలమంది పిల్లల్లో విజేతగా నిలిచింది. అమెరికాలోని పెన్సిల్వేనియాకు చెందిన లిల్లీ రీస్ అనే పాప స్థానిక ఎలిమెంటరీ పాఠశాలలో చదువుతోంది. అక్కడ ఏటా జరిగే నేషనల్ బోన్నీ ప్లాంట్స్ క్యాబేజ్ ప్రోగ్రామ్‌లో లిల్లీతో పాటు మరో 32 వేల మంది పిల్లలు పాల్గొన్నారు. లిల్లీ తన తల్లిసాయంతో క్యాబేజీ మొక్కను పెంచడం మొదలుపెట్టింది. అయితే అది సాధారణ క్యాబేజీలా కాకుండా అది అంతకు అంతగా పెరుగుతూ ఓ పెద్ద పువ్వులా తయారైంది. ఈ క్యాబేజీని చూసిన ప్రోగ్రామ్ అధికారులు ఎంతో ఆశ్చర్యపోయారుట. అంతేకాదు లిల్లీకి వెయ్యిడాలర్లు నగదును అంటే మన కరెన్సీలో రూ. 70వేలు బహుమతిగా అందించారు. అయితే ఈ క్యాబేజీతో లిల్లీ తల్లి సలాడ్‌ను తయారుచేసింది. ఇంటిల్లిపాది తిన్నా కూడా ఆ సలాడ్ ఇంకా అయిపోలేదు. దాంతో తమ గార్డెన్‌లో పెంచుకుంటున్న కుందేళ్లకు ఆహారంగా పెట్టినట్లు లిల్లీ చెప్పింది. ఏదేమైనా ఈ క్యాబేజ్ ఫొటో మాత్రం సామాజిక మాధ్యమాల్లో తెగ వైరల్ అవుతోంది.

అల్పాహారం తప్పనిసరి..



ఉదయంపూట తీసుకునే అల్పాహారం మనకు ఎన్నో రకాలుగా మేలు చేస్తుంది. దీనివల్ల రోజంతా ఉత్సాహంగా ఉండటమే కాదు.. బరువు కూడా అదుపులో ఉంటుంది. అయితే ఉదయం అల్పాహారంగా ఏవి తీసుకోవాలో, ఏవి తినకూడదో తెలుసుకుందాం..

మాంసకృత్తులు

అల్పాహారం అనగానే చాలామంది ఏది పడితే అది తినేస్తారు. కానీ మాంసకృత్తులున్న పదార్థాలు తింటే చాలా ఆరోగ్యం. ముఖ్యంగా బరువు తగ్గాలనుకునేవారికి ఇవి చాలా అవసరం. వీటిని తినడం వల్ల త్వరగా ఆకలి వేయదు. వీటిని అల్పాహారంగా తీసుకోవడం వల్ల రోజంతా ఉత్సాహంగా ఉండొచ్చు. గుడ్లు, బీన్స్, డ్రైఫ్రూట్స్, కూరగాయల నుంచి మాంసకృత్తులు లభిస్తాయి.

పిండిపదార్థాలు

అల్పాహారం త్వరగా తయారైపోతుందనే ఉద్దేశ్యంతో కొంతమంది బ్రెడ్, మైదా పదార్థాలను ఎంచుకుంటారు. వీటి నుండి శరీరానికి పీచు అందదు సరికదా.. త్వరగా ఆకలేసేస్తుంది. కారణం వీటిలోని పిండిపదార్థాలు.. వీటి వల్ల శరీర బరువు కూడా త్వరగా పెరుగుతుంది. అంటే పిండిపదార్థాలను అల్పాహారంలో తీసుకోకూడదని కాదు. శరీరానికి ఉపయోగపడే సంక్లిష్ట పిండిపదార్థాలు తినాలి అని అర్థం. అంటే.. గుడ్లు, ఓట్‌మీల్, పెరుగు, రాగిదోశ, గోధుమరవ్వ ఉప్మా వంటివి ఉదయం అల్పాహారంగా ఎంచుకోవచ్చు.




పండ్ల రసాలు

చాలామంది ఇంట్లో తయారుచేసుకున్న తాజాపండ్లు, కూరగాయల రసాలను అల్పాహార సమయంలో తీసుకుంటూ ఉంటారు. వీటి నుంచి శరీరానికి కావలసిన పీచు పదార్థం లభించదు. కాబట్టి నేరుగా పండ్లు లేదా సలాడ్‌లను అల్పాహారంగా ఎంచుకోవచ్చు. అప్పుడే వాటిలోని పోషకాలు, పీచు అందుతాయి. కడుపు నిండిన భావన కలుగుతుంది.

అలాగే చాలామంది ఉదయం అల్పాహారం అస్సలు తీసుకోరు. కొంతమందైతే వారికి కుదిరినప్పుడు అల్పాహారం తింటారు. ఈ రెండూ శరీరానికి మంచిది కాదు.. అంతేకాదు ఇలా చేయడం వల్ల మధ్యాహ్నం భోజనం ఎక్కువగా తినేస్తారు. దీంతో బరువు పెరిగే అవకాశం కూడా ఎక్కువ. కాబట్టి ఆలస్యం చేయకుండా, అసలు మానేయకుండా అల్పాహారం వేళకు తీసుకోవాలి. ఉదయం నిద్ర లేచిన గంట లోపలే ఆహారం తీసుకోవడం మంచిది. ★

రక్తహీనతను అధిగమిద్దాం..



ప్రపంచ దేశాల్లో రక్తహీనత బారిన పడుతోన్న మహిళలు.. ముఖ్యంగా దక్షిణాసియా దేశాలైన భారత్, పాకిస్తాన్ లోనే ఎక్కువట. ఏ వయసు వారైనా రక్తహీనత బారిన పడొచ్చు. ఒళ్లంతా నొప్పులు, అరికాళ్లలో మంటలు, కొద్ది దూరం నడిచినా ఆయాసం, చిన్న చిన్న పనులకే అలసట.. ఇవన్నీ రక్తహీనతకు సంకేతం కావచ్చు. రక్తంలో ఎర్రరక్తకణాలు తక్కువ కావడాన్నే రక్తహీనతగా చెప్పొచ్చు. రక్తకణాల్లో ఉండే హిమోగ్లోబిన్ ప్రాణవాయువును ఊపిరితిత్తుల నుంచి శరీరంలోని ఇతర భాగాలకు తీసుకెళుతుంది. రక్తహీనత సమస్యతో బాధపడుతున్నవారు ప్రాణవాయువు అన్ని భాగాలకు సక్రమంగా చేరదు. దాంతో అలసట, నీరసం, శ్వాసతీసుకోవడంలో ఇబ్బందులు, హృదయ స్పందనలో హెచ్చుతగ్గులు వంటి ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. రక్తహీనత సమస్య ఎక్కువకాలం కొనసాగితే రక్తంలో ప్రాణవాయువు తగ్గిపోయి గుండె, మెదడు, ఇతర అవయవాలకు నష్టం వాటిల్లుతుంది. సమస్య తీవ్రతరం అయితే ఒక్కోసారి ప్రాణాపాయం కూడా ఎదురు కావచ్చు.

రక్తం తక్కువగా ఉండటం, ఎర్రరక్తకణాల ఉత్పత్తి తగ్గడం, ఎక్కువ మొత్తంలో ఎర్రరక్తకణాలు నాశనమవడం.. ఇలా రక్తహీనత సమస్య మూడు రకాలుగా ఉంటుంది. వీటివల్ల రకరకాల ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. ఎనీమియా రావడానికి ముఖ్యకారణం రక్తం లేకపోవడమే.. ఐరన్ లోపం వల్ల ఈ సమస్య రావొచ్చు. నెలసరిలో అధిక రక్తస్రావం, ఏదైనా కారణం వల్ల జీర్ణాశయం, మూత్రాశయ మార్గాల్లో అంతర్గతంగా రక్తస్రావం కావడం వల్ల కూడా రక్తం తగ్గిపోతుంది. అలాగే శస్త్రచికిత్సలు, గాయాలు, కేన్సర్ వంటి సమస్యల వల్ల కూడా ఈ సమస్య ఎదురుకావచ్చు. ఎర్రరక్తకణాల ఉత్పత్తి తగ్గిపోవడమనేది సహజంగా జరగొచ్చు. లేదా కొన్నిసార్లు వంశపారంపర్యంగా కూడా తలెత్తొచ్చు. అలానే కొన్ని కారకాలు ఎర్రరక్తకణాలు ఏర్పడకుండా శరీరాన్ని అడ్డుకున్నప్పుడు కూడా ఇలా జరగచ్చు. ఇక తీసుకునే ఆహారం, హార్మోనులు, కొన్ని రకాల దీర్ఘకాలిక వ్యాధులు, గర్భం ధరించడం వంటివాటివల్ల కూడా ఎర్రరక్తకణాల ఉత్పత్తి తగ్గిపోవచ్చు. ఎప్లాస్టిక్ ఎనీమియా వల్ల కూడా ఈ సమస్య ఏర్పడవచ్చు. తీసుకునే ఆహారంలో ఇనుము, ఖనిజాలు, విటమిన్లు లేకపోవడం, పోషకాలను శరీరం స్వీకరించలేకపోవడం వల్ల కూడా రక్తకణాల ఉత్పత్తి తగ్గిపోవచ్చు. రక్తం తయారుకావడానికి ఎరిత్రోపయోనిక్ అనే హార్మోను అవసరమవుతుంది. ఇది తక్కువ స్థాయిలో ఉన్నప్పు రక్తహీనత రావచ్చు. ఎర్రరక్తకణాలు నాశనమవడం, మూత్రపిండ సంబంధిత వ్యాధులు, కేన్సర్ వంటి దీర్ఘకాలిక రోగాల బారినపడినప్పుడు శరీరం ఎర్రరక్తకణాలను తయారుచేసుకోలేదు.







పోషకాల లోపం..

రక్తహీనత ప్రధానంగా ఇనుము, ఫోలిక్ యాసిడ్, విటమిన్ బీ12 లోపం వల్ల ఎదురవుతుంది. ఆ పోషకాలను ఆహార రూపంలో అందుకోవాలంటే ఒకే తరహా ఆహారపదార్థాల నుంచి కాకుండా పోషకాలను కలిపి తీసుకోవాలి. ఇనుము ఒక్కటే కాకుండా ఇతర విటమిన్లు, మినరళ్లూ వంటివి శరీరానికి అందేలా చూసుకోవాలి. పప్పుధాన్యాలు, కూరగాయలు, ఆకుకూరలు, పాలు, పండ్లు... వంటివన్నీ తగినంతగా తీసుకోవాలి. వీటివల్ల శరీరానికి సమతులంగా పోషకాలు అందుతాయి. అప్పుడు శరీరం బీ12, ఫోలిక్ యాసిడ్, ఐరన్ వంటి వాటిని సులువుగా స్వీకరించగలుగుతుంది.



ముఖ్యంగా కౌమార దశలో ఇనుము పోషకం ఎక్కువగా అవసరం అవుతుంది. నెలసరి మొదలయినప్పటి నుంచీ దీని అవసరం రెట్టింపు ఉంటుంది. పైగా మన దేశంలో ఈ పోషకం వల్ల రక్తహీనతకు గురయ్యేవారే ఎక్కువ. అయితే ఇనుముని ఏ రూపంలో తీసుకున్నా కూడా దాన్ని శరీరం సులువుగా గ్రహించేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. సప్లిమెంట్ వేసుకున్నా, ఆహారమే తీసుకున్నా వెంటనే కాఫీలు, టీలు తాగకూడదు. ప్రాసెస్ చేసిన ఆహారం, పచ్చళ్లు వంటివాటికి దూరంగా ఉండాలి. లేదంటే వీటిల్లో ఉండే టానిన్ ఇనుమును శరీరం అందుకోకుండా అడ్డుపడుతుంది. అలాగే ఐరన్‌ని మాత్రల రూపంలో తీసుకునేవారు ఖాళీ కడుపుతో వేసుకోవాలి. దానివల్ల ఆ పోషకం త్వరగా అందుతుంది. లేదంటే పళ్లరసంతో తీసుకోవచ్చు. అదీ కుదరకపోతే టాబ్లెట్ వేసుకున్నాక విటమిన్ సి ఎక్కువగా లభించే జామ, బొప్పాయి, ఆరెంజ్ వంటి పండ్లను తీసుకోవాలి.



- మాంసాహార పదార్థాలైన చికెన్, లివర్, గుడ్డులోని పచ్చసొనల్లో ఇనుము ఎక్కువగా లభిస్తుంది. అదే శాఖాహారులు అయితే వేయించిన సెనగపప్పు, ఉలవలు, బొబ్బర్లు, పెసలు, ఎర్రపప్పులను ఎక్కువగా తీసుకోవాలి. గోరుచిక్కుడులో ఐరన్‌తో పాటు ఫోలిక్ యాసిడ్ కూడా ఎక్కువగా లభిస్తుంది. అలాగే కరివేపాకు, గోంగూర, పుదీన, మెంతికూర, మునగాకు, తోటకూర వంటివాటిలో ఐరన్ ఎక్కువగా ఉంటుంది. కరివేపాకు ఏ రూపంలో తిన్నా మంచిదే.. రోజూ చెంచా నువ్వులు, బెల్లం, పల్లీలు తినాలి. ఉదాహరణకు రోజూ కనీసం ముప్ఫై గ్రాముల పల్లీలు తినగలిగితే వాటినుంచి 1.5 మిల్లీగ్రాముల ఇనుము శరీరానికి అందుతుంది. ఎండుద్రాక్ష, నల్లద్రాక్ష, ఖర్జూరం వంటివి తినచ్చు.
- చుక్కకూర, పాలకూర, పుదీనాలలో ఫోలిక్ యాసిడ్ ఎక్కువగా ఉంటుంది. అలాగే పచ్చి బఠాణి, గోరుచిక్కుడు, కమలాపండు, పప్పుధాన్యాలు వంటి వాటిలో కూడా ఫోలిక్ యాసిడ్ ఉంటుంది.
- బీ12 శాఖాహార పదార్థాల నుంచి అందే అవకాశం చాలా తక్కువ. మాంసాహారంలో పీతలు, చేపలు, లివర్, కోడిగుడ్డుతో పాటు కొంత మొత్తంలో పాల పదార్థాలైన చీజ్‌ల నుంచి బీ12 లభిస్తుంది. తక్కువ కేలరీలు కలిగిన పాలు, పెరుగుని ఎక్కువగా తీసుకోవచ్చు. ★

శ్రీనరసింహ శతకము

సీ॥ అడవి పక్షులకెవ్వఁడా హారమిచ్చెను
మృగజాతికెవ్వఁడు మేత పెట్టె?
జలచరాదులకు భోజనమెవ్వఁడి ప్పించె?
చెట్లకెవ్వఁడు నీరు చేది పోసె?
స్త్రీల గర్భంబులన్ శిశులనెవ్వఁడు బెంచె?
ఫణుల కెవ్వఁడు పోసెఁ బరగవిషము
మధుపాళికెవ్వండు మకరందమొనరించె?
పశుల కెవ్వఁడొసంగెఁ బచ్చిపూరి?

తే॥ జీవకోట్లను బోషింపనీవెకాని
వెఱె యొక దాత లేఁడయ్య వెదకి చూడ!
భూషణవికాస! శ్రీధర్మపురనివాస!
దుష్టసంహార! నరసింహ! దురితదూర!

భావం: ఓ స్వామీ! అడవి పక్షులకాహారాన్ని, అడవి మృగాలకు మేతని, జలచరాలకు తిండి, చెట్లకు నీరు, గర్భస్థ శిశువులకు పోషణ, పాములకు విషం, తుమ్మెదలకు తేనె, పసులకు పచ్చిగడ్డి ఎవరు కూర్చినారు? ఈ సమస్త జీవరాశుల్ని పోషించగల దాతవు నీవుదప్ప వేరొకరెవ్వరు లేరు



అనంతం

54 -గోపరాజు నాగేశ్వరరావు

రాగ్యా వేగంగా పరుగులు తీస్తున్నాడు!

అలవాటైన దారే అయినా ఇప్పుడా అడవి దారిలో పరుగులు తియ్యటం అతనికి చాలా కష్టంగా వుంది!

ఎదురు రాళ్ళు తగుల్తున్నాయి!

తూలి పడబోతూ, అంతలోనే తమాయించుకొంటూ నీరసంతో బూజరగా వున్న కంటి చూపుని ప్రయత్నంమ్మీద నిలుపుకొంటూ, ధ్యేయంవైపు సాగిపోతోన్నాడు రాగ్యా!

త్వరగా తండాకి చేరుకోవాలి.

వాళ్ళను రక్షించాలి.

ఎవ్వరైనా తనను చూస్తే ఎంత ప్రమాదం!

గరుడాచలాన్ని హత్యచేసినందుకు 'నల్లకొండ కుట్ర' కేసు పెడతారు! లాఠీలతో కుళ్ళపొడిచి ఎందుకూ పనికిరాకుండా చేస్తారు.

జీవితాంతం జైల్లో ఉంచేందుకు ఏపి సెక్షన్లున్నాయో- ఆ సెక్షన్లన్నీ పెట్టి కేసు బనాయిస్తారు.

అనామకుడైన ఓ అడవి పుత్రుడు భారత సార్వభౌమాధికారాన్ని ధిక్కరిస్తే సహిస్తారా?!

కొంత దూరం పరుగెత్తి, అలుపు తీర్చుకుంటూ ఒకచోట ఆగాడు రాగ్యా!

అదో చిన్న మైదానంలా ఉంది!

చెట్లు గుట్టలు పొదలూ లేవు.

సూర్యకిరణాలు తాకి శరీరం చురుక్కుమన్నది!

క్షణం విరామం తర్వాత మళ్ళీ పరుగులు లంకించుకున్నాడు.

తండా ఎంతో దూరంలో లేదు.

కనుచూపుమేరలో ఉన్న నాగజెముడు తుప్పలు దాటితే, అక్కడ్నించి మహాఐతే రెండు నిమిషాల పరుగు దూరం!

ఎవ్వరో ఆపినట్టే రాగ్యా ఎందుకో ఒకచోట ఆగాడు!

ఎదరగా ఓ చెట్టుకొమ్మకి వ్రేలాడుతోంది తేనె పట్టు.

అతనికి చాంద్‌నీ గుర్తొచ్చింది!

ఈగలు..

తేనెటీగలు..

పట్టునిండా లుకలుక లాడుతూ ఈగలు..

చాంద్‌నీకి మల్లేనే ఆ తేనె పట్టును కౌగిలించుకుంటే ఎలావుంటుందీ!

అవ్వి తన శరీరంలోకి ములుకులు దించితే హాయిగా ఉంటుందా?

తేనె పట్టువైపుకు రెండడుగులు వేశాడు.

మంత్రించినట్టే ఆగిపోయాడు!

పాప పంకిలం కాకుండా చాంద్‌నీ శరీరాన్ని పదిలంగా పవిత్రంగా మృత్యువు ఒడికి చేర్చి సేదతీర్చి ఆదరించిన ఆ తేనెటీగలు విషతుల్యమైన తన శరీరంలో ములుకులు దించేందుకు సిద్ధపడవేమో!

పరితప్త హృదయంలో చెలరేగే అంతరంగ కల్లోలాన్ని తట్టుకోలేక విలవిల్లాడుతూ క్షణక్షణం మనోవేదనతో కృంగిపోతూ, కర్మఫలం అనుభవించమని శపిస్తాయే తప్ప ఆదరించి అక్కున చేర్చుకుంటాయా?

రాగద్వేషాలకు అతీతమైన పుణ్య లోకాలకి వెళ్ళిన చాంద్‌నీ ఒకవేళ ఆ తేనెటీగల్ని సమాధానపరచినా, చనిపోయే అవకాశం ఇప్పుడు లేదుకదా తనకు!

తండాకి వెళ్ళాలి.

అక్కడివాళ్ళను రక్షించాలి.



రక్షించాలంటే తను బ్రతికే ఉండాలి.

బ్రతుకే కాదు, కోరిన మరణంకూడా పొందేందుకు అవకాశం లేని నికృష్టపు జీవితం తనది!

ఏం చెయ్యాలి?

పాప పరిహారార్థం మిగిలిన ఒకేఒక్క మార్గం అడవి పుత్రుల్ని రక్షించటం!

తేనె పట్టుమీదనుంచి దృష్టిమరల్చి, దూరంగా వున్న తండావైపు చూశాడు రాగ్యా!

గుడిశెలు కనిపిస్తున్నాయి.

బయల్దేరాడు..

గుడిశల సముదాయాన్ని చేరుకొంటున్నాడు..

అంతలోనే ఏదో సందేహం!

ఇప్పుడు-

అక్కడికి వెళ్తాడు. జరిగిందంతా చెప్తాడు. ప్రమాదం గురించి హెచ్చరిస్తాడు. రక్షిస్తానంటాడు. తన వెంట రమ్మంటాడు..

అదంతా వాళ్ళు నమ్ముతారా?

తనవెంట గొలుసుకొండల దగ్గరికి వస్తారా?

నమ్మరు. తన మాటల్ని చచ్చినా నమ్మరు..

అది వాళ్ళ తప్పేమీకాదు.

మంచివాడు చెప్పే అబద్ధాన్ని నమ్మినంత తేలిగ్గా ఎవ్వరూ చెడ్డవాడు చెప్పే నిజాన్ని నమ్మరు!

అప్పుడేం చెయ్యాలి?

వాళ్ళనెలా నమ్మించాలి?

కన్నీళ్ళతో వాళ్ళ పాదాలు కడిగి, చేసిన తప్పులు ఒప్పుకొని క్షమాపణ వేడుకుంటే క్షమించి నమ్ముతారా?

ఇంకా అడవి పుత్రుడిగానే చూస్తే నమ్ముతారేమో గానీ, నాగరికుల సహవాసంతో కల్మష భరితమైన నా కన్నీళ్ళనెలా నమ్ముతారూ?

అయినా తప్పదు..

వెళ్ళాలి..

వాళ్ళని రక్షించాలి.

డోలాయమానంనుంచి రాగ్యా స్థిరచిత్తంలోకొచ్చాడు.

పరుగెత్తుతూనే తండా చేరుకున్నాడు!

అక్కడ పరిస్థితి చాలా హృదయ విదారకంగా ఉంది!

లక్ష్మీబాయి నేలలల్లుకొని ఏడుస్తుంటే, ఎవరెవ్వరో ఆమెను ఓదారుస్తున్నారు. ఆమె మరింత పెద్దగా ఏడుస్తూ, భర్త జ్ఞాపకాలను తల్చుకొంటూ, గుండెలు బాదుకొంటున్నది.

తండాఅంతా విషాద మేఘాలు క్రమ్మి, కన్నీటి జడివాన కురుస్తున్నట్టుంది!

ఎప్పుడూ "వరి బువ్వ... వరిబువ్వ"అని ఏడ్చే వాల్యా ఇప్పుడు "అయ్య...అయ్య" అని ఏడుస్తున్నాడు.

నగ్గూరాం ఇంట్లో దీపంపెట్టే దిక్కే లేకుండా పోయింది.

తండ్రి మరణంతో విషాదానికి పురుడుపోస్తున్నట్టున్న తన ఇంటివైపు ఒక్క క్షణం చూశాడు రాగ్యా.

భరించలేక పోయాడు.

గబగబా నడుస్తూ లక్ష్మీబాయి దగ్గరికి వెళ్ళాడు.

"రాజ్యాగాడొచ్చిండు" అన్నారెవ్వరో.

అందరూ తలలెత్తి రాగ్యావైపు చూశారు!

విస్మయం, అసహ్యం, కోపం... అన్నీ కనిపించాయి వాళ్ళచూపుల్లో!

"బతికే ఉండావా" రాగ్యాని లక్ష్మీబాయి అడిగింది.

"మడిసిని మిగిలుండాను" అన్నాడు రాగ్యా విరక్తిగా.

"ఏంటికొచ్చావ్"

"గోపీనాయక్ మిమ్ముల్ని పిల్సుకరమ్మండు"

"యాడుండాడు"

"రగస్యె తావరాన్లో ఉంటాడు! అందరూ ఆడ్నే ఉండారు! తండామీన పోలీసోళ్లు దాడి శాత్తారంట. కనిపిత్తే కాల్సేత్తారేవో!"

"అందుకు దాంకున్నారా" అని లక్ష్మీబాయి అడిగింది.

రాగ్యా ఏదో చెప్పబోయాడు.

(ఇంకా ఉంది)

రాశిఫలం



- గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి

● **మేషం (అశ్విని, భరణి, కృత్తిక 1పా.)**
ఆకస్మిక ధనలాభముంది. రాజకీయ రంగంలోనివారికి, క్రీడాకారులకు అద్భుతమైన అవకాశాలు లభించును. అన్నింటా విజయాన్నే సాధిస్తారు. బంధు, మిత్రులు కలుస్తారు. శుభవార్తలు వింటారు. వృత్తి, ఉద్యోగ రంగాల్లోనివారికి అభివృద్ధి ఉంటుంది.

● **వృషభం (కృత్తిక 2, 3, 4పా., రోహిణి, మృగశిర 1, 2పా.)**
రాజకీయ వ్యవహారాల్లో దిగ్విజయాన్ని పొందుతారు. ప్రయత్న కార్యాలన్నీ సంపూర్ణంగా ఫలిస్తాయి. శుభకార్య ప్రయత్నాలు సులభంగా నెరవేరతాయి. సంపూర్ణ ఆరోగ్యవంతులుగా నుంటారు. ఇతరులకు ఉపకరించు పనులు చేపడతారు. గౌరవ మర్యాదలు లభిస్తాయి. శుభవార్తలు వింటారు.

● **మిథునం (మృగశిర 3, 4 పా., ఆరుద్ర, పునర్వసు 1, 2, 3పా.)**
అనవసరమైన భయాందోళనలు తొలగిపోతాయి. ప్రయాణాలు జాగ్రత్తగా చేయుట మంచిది. వృత్తి ఉద్యోగ రంగాల్లో స్థానచలన సూచనలున్నవి. ఆర్థిక పరిస్థితిలో మార్పులుంటాయి. ఋణప్రయత్నాలు చేస్తారు. ఆత్మీయుల సహకారం ఆలస్యంగా లభిస్తుంది.

● **కర్కాటకం (పునర్వసు 4 పా., పుష్యమి, ఆశ్లేష)**
ఆత్మీయుల సహకారం లభిస్తుంది. ఆకస్మిక ధననష్టమేర్పడే అవకాశముంది. ఆర్థిక ఇబ్బందులనెదుర్కొంటారు. అనారోగ్య బాధవలన బలహీనులవుతారు. అధికార భయం ఉంటుంది. ప్రయాణాలు వాయిదా వేసుకోవాల్సి వస్తుంది.

● **సింహం (మఖ, పుబ్బ, ఉత్తర 1 పా.)**
ఆకస్మిక ధననష్టం పట్ల జాగ్రత్త అవసరం. కొన్ని ముఖ్యమైన కార్యక్రమాలు వాయిదా వేసుకోవాల్సి వస్తుంది. స్వల్ప అనారోగ్య బాధలుంటాయి. వృథా ప్రయాణాలు చేస్తారు. స్థానచలన సూచనలున్నాయి. సన్నిహితులతో విరోధమేర్పడకుండా మెలగుట మంచిది.

● **కన్య (ఉత్తర 2, 3, 4పా., హస్త, చిత్త 1, 2 పా.)**
విదేశయాన ప్రయత్నాలకు అనుకూలంగా వుంటుంది. ప్రయాణాలెక్కువ చేస్తారు. మెలకువగా నుండుట అవసరం. స్థానచలనమేర్పడే అవకాశాలుంటాయి. ఋణలాభం పొందుతారు. ఎలర్జీతో బాధపడేవారు జాగ్రత్తగా నుండాలి. ప్రయత్న కార్యాలకు ఆటంకాలుంటాయి.

● **తుల (చిత్త 3, 4పా., స్వాతి, విశాఖ 1, 2, 3పా.)**
కుటుంబమంతా సంతోషంగా నుంటారు. గతంలో వాయిదా వేసిన పనులన్నీ పూర్తిచేసుకుంటారు. సంపూర్ణ ఆరోగ్యమేర్పడుతుంది. స్థిర నివాసముంటుంది. వ్యవసాయ మూలకంగా లాభాలను పొందుతారు. ప్రయత్న కార్యాలన్నీ ఫలిస్తాయి. సూక్ష్మ విషయాలను గ్రహిస్తారు.

● **వృశ్చికం (విశాఖ 4 పా., అనూరాధ, జ్యేష్ఠ)**
బంధు, మిత్రులతో జాగ్రత్తగా నుండుట మంచిది. చేసే పనులలో ఇబ్బందులుంటాయి. క్రొత్త పనులను ప్రారంభించుట మంచిది కాదు. గృహంలో జరిగే మార్పులవల్ల ఆందోళన చెందుతారు. ప్రయాణాల్లో జాగ్రత్త అవసరం.

● **ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా.)**
స్త్రీల మూలకంగా లాభాలుంటాయి. ప్రయత్న కార్యాలన్నింటిలో విజయం పొందుతారు. శుభవార్తలు వింటారు. ఆకస్మిక ధనలాభముంటుంది. కుటుంబమంతా సౌఖ్యంగా వుంటారు. అత్యంత సన్నిహితులను కలుస్తారు. విందులు, వినోదాల్లో పాల్గొంటారు.

● **మకరం (ఉత్తరాషాఢ 2, 3,4పా., శ్రవణం, ధనిష్ఠ 1, 2పా.)**
ఋణప్రయత్నాలు ఫలించును. కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా నుండక మానసికాందోళన చెందుతారు. బాధలుండును. బంధు, మిత్రులతో జాగ్రత్తగా ఉండడం మంచిది.

● **కుంభం (ధనిష్ఠ 3, 4పా., శతభిషం, పూర్వాభాద్ర 1,2, 3పా.)**
కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా ఉంటాయి. ఆకస్మిక ధననష్టం కలిగే అవకాశం ఉంటుంది. వృధా ప్రయాణాలెక్కువ చేస్తారు. బంధు, మిత్రులతో కలహించుకోకుండా జాగ్రత్తగా నుండుట మంచిది. వృత్తి, ఉద్యోగ రంగాల్లో సహనం వహించక తప్పదు.

● **మీనం (పూర్వాభాద్ర 4 పా., ఉత్తరాభాద్ర, రేవతి)**
నూతన వస్తు, వస్త్ర, వాహన, ఆభరణ, లాభాలను పొందుతారు. ఆకస్మిక ధనలాభయోగముంటుంది. శుభవార్తలు వింటారు. శుభకార్య ప్రయత్నాలు సులభంగా నెరవేర్చుకుంటారు. బంధు, మిత్రులతో కలిసి విందులు వినోదాల్లో పాల్గొంటారు. ఒక ముఖ్యమైన కార్యక్రమం పూర్తి అవుతుంది.

మాటాట — నిర్వహణ: సుధామ — 1864

■	1		2		■	3
4	■	■		■	■	
5	6				7	
■	8			9		
10		■	11		12	13
	■	■		■	■	
	■		14			■

ఆధారాలు

అడ్డం

1. వైతాళికులు సంకలనకర్త
5. ఋడుగు వంటి మరో అల్లరి పిల్లడు
7. వ్రతము వంటిదే
8. ధనము 9. హిందీలో మొదలు
10. కాడికి ఆధారమైన బండి మొదలగువాని మొదటనుండే నిడుపాటి కఱ్ఱ
12. కాంతి
14. పదకర్త. ఈయన కృతులు ప్రసిద్ధం

నిలువు

2. అసహజం
3. ఆయువు, ఊపిరి
4. అడుగునుంచి వణుకు, చలించు
6. బెలూన్
7. నోట నీళ్ళు ఊరు, అపేక్షించు
10. నుదురు, ఫాలము
11. దొరువు, కూపము, నీటికై తవ్వే పల్లము
13. కాష్ఠము

మాటాట-1863 సమాధానాలు

అడ్డం		నిలువు	
1. ఆదాయము	9. పన్ను	1. అచూకీ	7. సంపద
4. తనయ	10. షాదీ	2. యతి	8. ఉద్విగ్నం
5. కీచు	12. ద్విపద	3. వ్యయము	11. దీపికా
6. మెక్కు	14. కాగితము	4. తక్కువ కాదు	13. గీత

యస్య బ్రహ్మణి రమతే చిత్తం

మనిషి తాను కొన్ని బాధ్యతలకు గురై సంసార బంధాలకు సంబంధించిన విషయాలపై దృష్టిపెడుతూనే భగవతత్త్వముపై అంకితంగావించుకున్నవాడే బ్రహ్మనిష్ఠుడు కాగలడు. యోగియైనా, భోగియైనా, త్యాగియైనా, సంగవర్జితుడైనా, సంగసహితుడైనా, ఒక్కసారి బ్రహ్మచిత్తాన్ని తాను చవిచూసిన తర్వాత ఎలాంటి స్థితియందు తాను వున్నా కూడా తాను బ్రహ్మనిష్ఠుడే కాగలడు. బ్రహ్మ విరుద్ధమైన బంధ సహితుడుకాలేడు. యోగియైనా భోగియైనా, సంసారియైనా, సన్యాసియైనా స్వాంతము, సత్యమును అనుభవించితే ఆనందము ఆనందమేనంటారు.

మన చిత్తమునందు దైవత్వమును నిలుపుకుని, ఆయనకే చిత్తాన్ని అంకితం గావిస్తే ఎన్నివృత్తుల యందు ఈ దేహము పాల్గొన్నప్పటికీ అది భగవత్ కైంకర్యంగా భావించాలి. ఇక్కడ మనం జనక మహారాజు విషయం చెప్పుకోవాలి. జనకుడు తన కర్తవ్యాలను నెరవేరుస్తూ, రాజ్యపాలన గావిస్తూ తన యొక్క చిత్తాన్ని దైవతత్త్వమునందు మాత్రమే ఇముడ్చుకుంటూ, లోకకళ్యాణార్థమై సర్వకర్మలూ ఆచరిస్తూ వచ్చాడు. ఒకసారి శుక మహర్షులవారు మిథిలానగర సమీపంలోనే కొంతమంది శిష్యులను చేర్చుకుని జ్ఞానోపదేశం చేస్తూ వున్నారు. ఈ సువార్త జనక మహారాజువరకూ చేరింది. జనకుడు కూడా మహర్షి శిష్యగణంలో చేరి ఆయన ప్రబోధలు వినాలని సంకల్పించాడు. ఒకనాడు ఆయన వద్దకు వెళ్లి ఆయన శిష్యులతో బాటుగా వినేందుకు అనుమతి కోరాడు. ఆనాటినుండి జనకుడు కూడా శుకమహర్షి బోధనలను వింటూవచ్చాడు. ఒకరోజున జనకుడు వచ్చేంతవరకూ శుకుడు వేచి వున్నాడు. దీనికి వారి శిష్యులు- జనకుడు ధనవంతుడనీ, మహారాజుగావున ఇలా మహర్షి లొంగిపోయారని అనుకున్నారు. ఎవ్వరెవ్వరి ప్రాప్తములు ఏయే స్థానమునందు ఏ ఏ కాలములో ఏ ఏ దిశ యందు పరిపక్వత చెందుతుందో చెప్పడం సాధ్యపడదు. ఎవ్వరికైతే పుణ్యఫలం క్షీణిస్తుందో, వారు తక్షణమే పుణ్యకార్యాలు గావించి తిరిగి ఆ పుణ్యఫలాన్ని పొందాలి. అపుడే వారు ఉత్తమ స్థితి అందుకోవడానికి అవకాశం వుంటుంది. అలాగాక అలక్ష్యం చేసి తిరిగి అపవిత్ర మార్గంలో ప్రవేశించడంవలన ఉన్నటువంటి పుణ్యము కూడా పోవడమే గాకుండా వారు హీనులుగా మారేందుకు అవకాశం ఏర్పడుతుంది. శుకుడు వారి శిష్యులకు పాఠం చెప్పదల్చాడు. మరుక్షణంలోనే మిథిలాపురం అంతా మండిపోతున్నట్లుగా కనిపించింది. అపుడు ఆయన శిష్యులు, తల్లిదండ్రులు ఏమవుతారోనని, ఇళ్లు భస్మమైపోతాయని వారిని కాపాడుకోవడానికి పరుగు పరుగున వెళ్లిపోయారు. ఆ సమయంలో జనక మహారాజు అక్కడే చెక్కుచెదరకుండా కూర్చునే వున్నాడు. అది చూసిన శుకుడు, 'జనకా! అంతఃపురానికి కూడా మంటలు ప్రాకాయి. అంతఃపురవాసులను రక్షించుకోవడానికి ప్రయత్నించు' అన్నాడు. జనకుడు ఒక చిరునవ్వు నవ్వి దైవేచ్ఛ ఏ రీతిగా వుందో ఆ రీతిగానే జరుగుతుంది. దీన్ని ఎవ్వరూ అడ్డుకోలేరు. సర్వమూ ఈశ్వర సంకల్పమే అని స్థిరచిత్తుడై కూర్చుని వున్నాడు. కాసేపటికి వెళ్లిన శిష్యులు అందరూ తిరిగివచ్చారు. అందులో కొందరు ఓర్వలేని శిష్యులు, 'స్వామీ ఊరంతా కాలుతున్నట్లు కనిపించింది కానీ వెళ్లి చూస్తే ఏ అగ్నీ లేదు. జనకుడు ఇక్కడే కూర్చున్నాడు. ఎంత స్థిరచిత్తుడాయన' అంటూ గరువుకే చెప్పజూచారు. అపుడు శుక మహర్షి ఇలా చెప్పారు. "చపలచిత్తమైన మీకు ఎన్నిగంటలు బోధించినా ప్రయోజనం వుండదు. స్థిరచిత్తుడైనవాడు ఒక్కడు చిక్కినా చాలు. ఎన్నివేలమంది చపలచిత్తులున్నా లోకానికి ప్రయోజనముండదు. స్థిరచిత్తుడు ఒక్కడు చిక్కినా అతని కోసమే నేను వేచి వుంటాను, ఇప్పటికైనా తెల్సిందా" అంటూ శుకమహర్షి వారికి బుద్ధి చెప్పాడు. అందుకే శంకరాచార్యులవారు లోకానికి అలా చెప్పారు. సంఘంలో చేరి, సంఘాన్ని వదలి కొందరు సాధనలు చేస్తుంటారు. తుకారం, రామకృష్ణ పరమహంస, కబీరు, రామదాసు, త్యాగయ్యవంటివారు ఈ సంఘంలో ఒకరిగా వుంటూనే తమ తమ పద్యాలతో సర్వులకూ ఆనందాన్ని అందిస్తూనే ఆత్మతత్త్వంలోపల అంకితమై వున్నారు. మరికొందరు ఈ సంఘానికి దూరంగా అరణ్యాల్లోనో, హిమాలయాల్లోనో భగవచ్చింతన చేస్తూ బ్రహ్మలక్ష్యమునందే వారి జీవితాలను అంకితం చేశారు.

-డా॥ పులివర్తి కృష్ణమూర్తి

మా గోఖలే కథలు

మాధవపెద్ది గోపాలకృష్ణ గోఖలే

కష్టజీవుల పట్ల సానుభూతి ప్రకటించే అభ్యుదయ సాహిత్యం విరివిగా వస్తున్న కాలం అది. అందులో శ్రామిక వర్గ పక్షపాతం, స్పష్టంగా, స్థిరంగా కన్పించేది. అయితే అది స్థూలంగా ఒక అవుట్‌సైడర్ చూపించే సానుభూతే. మా గోఖలే ప్రత్యేకత ఏమిటంటే, అతను సమాజం అట్టడుగున సాటి రచయితలు తొంగిచూడని చీకటి బావుల్లోకి దిగి పూడిక తీశాడు. అన్ని నిలువులు అతను దిగగలగటానికి ముఖ్య కారణం- అతను తను పుట్టి పెరిగిన బ్రాహ్మణకోడూరు గ్రామాన్నే రచనా నేపథ్యంగా చేసుకోవటం. దాని చుట్టుకొలత తక్కువే కావచ్చు. అయినా అది ఆనాటి తెలుగు గ్రామ జీవితానికి ఒక ప్రతీక. అక్కడి దిక్కు మొక్కులేని జన జీవన ఘోషని వాళ్ల భాషలోనే, యాసలోనే వ్యక్తం చేశాడు మా గోఖలే. తన కథా వాతావరంలో అతను లోపలి మనిషే (ఇన్‌సైడర్), వెలుపలి మనిషి (అవుట్‌సైడర్) కాదు.

మా గోఖలే కథలన్నీ దాదాపుగా గుంటూరు మాండలికంలో సాగుతాయి. అప్పటికి మాండలికంలో కథలు రాయటం ఒక ప్రయోగం. పాత్రలు మాండలికంలో మాట్లాడటం వున్నా కథంతా పూర్తి మాండలికంలో నడిపించిన తొలి రచయిత మా గోఖలే అయ్యుండాలి.

గోఖలే కథల్లోని మనుషులెట్లాంటివాళ్లు? బల్లకట్టు పాపయ్య, యానాది ముసలాయి, వడ్డె కొండయ్య, మాదిగ ముత్తాయ్, బండి రాముడి పెళ్లాం, కిష్టమ్మగారి పెద్ద జీతగాడు, సావుకారు గురవయ్య, సన్న రైతు రాగవయ్య- ఎక్కడ జూసినా యిట్లాంటి మనుషులే అతని కథల్లో. వీళ్లు

వినమరుగైన..

పాపినేని శివశంకర్

ఏ పల్లెటూళ్లోనయినా నీకు నాకూ ఎదురయ్యే వాళ్లే. మూగజీవాలు, పిప్పిదంట్లు, నిస్సహాయులు-ఇట్లా కథల పేర్లనుబట్టి ఆ మనుషుల్ని ఊహించుకోవచ్చు. ఈ మనుషుల్లో గొప్ప జీవితకాంక్ష వుంటుంది. వీళ్లకెవరికీ బతుకులో గొంతెమ్మ కోర్కెలుండవు. చిన్న చిన్న ఆశలు, ఆరాటాలే. మూగజీవాలు కథలో పావలా డబ్బులు కోసం ఇల్లిల్లూ తిరిగి పనిపాట్లు చేసినా యానాది ముసలాయి పస్తులు తప్పవు. శివరేత్రి సంబరం కథలో కోటప్ప కొండకి వెళ్లాలనే కోరికతో అల్లల్లాడిపోతాడు కొండయ్య. కిష్టయ్య పంతులు కథలో పంతులు వీధివీధి తిరిగేది చల్ల చుక్క కోసం. పాలెం బొమ్మలాట కథలో జీతగాడు. సూరాయికి వేపచెట్టు కొమ్మల్లో కూర్చొని తోలుబొమ్మలాట చూట్టం అరుదైన అనుభూతి. కొండాయి పక్షి కథలో నాలుగక్షరాలు నేర్చుకోవటానికి తపిస్తాడు కొండాయి. పెళ్లి కథలో రత్తి బూరె ముక్క తింటమే పండగ. వీళ్లంతామామూలు మనుషులు. వీళ్లలో దాగివున్న గొప్ప మానవాత్మని చూపించటమే మా గోఖలే పని. ఈ మనుషులెవ్వరూ తమ కష్టాలకి, కన్నీళ్లకి ఎవర్నీ బాధ్యుల్ని చెయ్యరు. ఎవరిమీదా ఆరోపణలు చెయ్యరు. తమకి దక్కిన దానితో సంతృప్తి పడతారు.

మరి సంతృప్తిపడనిదల్లా రచయిత. వీళ్ల అణగారిన బతుకుల పట్ల అతనికి అపారమైన సానుభూతి. అది పైపైన కన్పించేది కాదు. ఆ మనుషుల జీవనదైన్యం ప్రదర్శించటమేగాని వ్యాఖ్యానిచటం మా గోఖలే పనికాదు. టేకింగ్ సైడ్స్- అంటే ఒకరి పక్షం వహించినట్లు అతనెక్కడా మనకి కనపడడు. కేవలం కొన్ని దృశ్య శకలాలు మన ముందుంచి వాటికి ఏ రకంగా స్పందించాలో మనల్నే తేల్చుకొమ్మంటాడు. గొప్ప కథాశిల్పి చేసేదీ, చెయ్యాల్సిందీ అదే. గ్రామీణ భూస్వామ్య సంస్కృతిలోని వెలుగు నీడల్ని పట్టకంలో చూపిస్తాడు గోఖలే.

రెండు దశాబ్దాల క్రితం విజయవాడ ఆకాశవాణిలో ప్రసారమైన - శత వసంత సాహితీ మంజీరాలు - శీర్షిక నుంచి..

వేకువజామున తొలికోడి కూసే యాల మెట్టపల్లీ సొట్టపల్లికి మయాన పార్తుండ కిట్ట కాలవ గెట్టుమీన్నుంచి ఎవురయినా నిలబడి సూత్తా యింటంటే, మెట్టపల్లి ఏపుల్నుంచి సీకట్లో బజన పాటలు యినిపించి, యింకూసేపటికి డొంకల్లోంచి సేతి కర్ర పొడుసుకుంటూ ఓ నల్ల యిగ్రహం మిట్టపల్లాలు ఎక్కి దిగుతా వొచ్చొచ్చి, కిట్ట కాలవ గట్టెక్కి, ఆడ గొలుసుతే కట్టేసుండ బల్లకట్టు కాడికొచ్చి నిలబట్టం తెలుసుద్దన్నమాట. ఆ యిగ్రహం బల్లకట్టు పాపయ్య.

బల్లకట్టంటే దాని దారే ఏరు. కాలవకు అడ్డంగా బస్సేడ పోద్దీ? ఒంతెన్లూ, బర్జీలంటే యాడబడ్తే ఆడ ఎట్టుంటై? యిట్టాటి కిట్ట కాలవకు బల్లకట్టు లేకనేపోతే అల్లాడిపోవల్సిందే ఎప్పటికయినా! అసలు పొద్దుగూకులూ యిట్ట గుక్క దిప్పుకోటానికి యీలవుద్దా బల్లకట్టు మడ్సికీ? ఓ కూరగాయల మడుసులేందీ, పుగాకు, మిరబగాయ, నెయ్యి, వెన్న, పాలు, పెరుగు, నాట్లజనం, కోతల జనం, ఆరేంది ఈరేంది అన్ని యాపారాలూ యీ బల్లకట్టు మీన నడవాల్సిందేగా? (బల్లకట్టు పాపయ్య) వాళ్లూ వీళ్లూ బల్లకట్టెక్కి లోకాభిరామాయణం చెప్పేవాళ్లేగాని పాపయ్యకి సాయం చేసేవాళ్లుండరు. నెలకు ఆరు రూపాయల పావలా అతని జీతం, సంసారానికి చాలదు. భార్య బూసమ్మ ప్రవర్తన మీద పాపయ్యకి అనుమానం. బల్లకట్టు కొడుక్కి అప్పజెపుతామంటే అతనొప్పుకోడు. ఒక గాఢమైన జీవితానుభవం ఈ బల్లకట్టు పాపయ్య కథ.

-సశేషం

ధర్మభూమి

ఒరులేయవి యొనరించిన
నరవర యప్రియము తన మనంబునకగు దా
నొరులకు నవిసేయకునికి
పరాయణము పరమ ధర్మ పథములకెల్లన్

ఆంధ్రభూమి బుధవారం, 6 ఫిబ్రవరి 2019



శ్రీమాన్ గన్ను కృష్ణమూర్తిగారు చతుర్భుజులు..
పంచముఖులు.. బహుగ్రంథపఠనం,
నవ్యరచనా ధౌరంధర్యం, ప్రాచీన వాఙ్మయ రహస్య
మూల్యాంకన చణత్వం, విద్వజ్జన శ్లాఘావశీకరణం..
ఇవి ఆయన చతుర్భుజత్వాలు. అంతేకాదు ఆయన భావుకుడు,
మంచి విమర్శకుడు, ఉపన్యాసకుడు, కవి, తాత్త్వికుడు..
ఇలా ఎన్నో.. 'కవిత్వం.. తీరని దాహం'
అన్న శ్రీశ్రీ మాటలకు వంత పాడుతూ కవిత్వ దాహాన్ని తీర్చుకోవడానికి
చిన్ననాడే పెన్ను పెట్టారు గన్ను కృష్ణమూర్తిగారు. ఎన్నో కథలను, కవితలను,
గ్రంథాలను, కావ్యాలను రచించారు.
ఆయన రచనల్లో ఆలంకారికశైలీ శోభ ఉంటుంది.
ధ్వని శిల్ప చాతుర్యం ఉంటుంది.
భావశబలత, సౌందర్య గాంభీర్యాలు నిండారి ఉంటాయి.
'సీత చేతిలో పూవైపోయాడు రాముడు.. పూవు గెండెను
పరిమళమ్మాయె సీత'..
ఎంతటి మనోజ్ఞ భావం కదా ఇది.. అపూర్వ భావనాశక్తికి,
గేయరచనా పటిమకు, కల్పనా రీతికి, కథా కథన శిల్పానికి సాక్ష్యమే..
గన్ను కృష్ణమూర్తిగారి గేయచంపువు,
అధిభౌతిక రామాయణమైన

శ్రీకృష్ణ రమ్య రామాయణం

రేపటినుండి ధర్మభూమిలో..

భారతదేశానికి ఉత్తరదిక్కున ఒక మ్లేచ్ఛదేశం ఉండేది. ఆ దేశంలో మధ్యదేశీయుడైన వాడు, వేదాధ్యయనం చేయని బ్రాహ్మణుడు ఒక గ్రామానికి భిక్షాటన కోసం వెళ్ళాడు. ఆ గ్రామంలో ఒక బందిపోటు దొంగ ఉన్నాడు. అతను చాలా ధనవంతుడు. అతనికి సమస్త వర్ణాల వివరాలు తెలుసు. పైగా అతను ఆడి తప్పనివాడు. బ్రాహ్మణ భక్తుడు. బ్రాహ్మణుడు అతని ఇంటికి వెళ్ళి భిక్ష అడిగాడు. దొంగ అతనికి సంవత్సరానికి సరిపడే ఆహార సామాగ్రి, బట్టలు, అతనికి సేవచేయడానికి ఒక వితంతు స్త్రీని సమకూర్చాడు. బ్రాహ్మణుడు ఆ గృ హంలో, దాసితో సుఖంగా ఉంటున్నాడు. దొంగ ఆ దాసీ కుటుంబానికి కూడా ధనసహాయం చేశాడు.

బ్రాహ్మణుడు ఆ వ్యాధుని ఇంటిలో కొన్ని సంవత్సరాలు ఉన్నాడు. ఆ ద్విజుని పేరు గౌతముడు. అతను చాలా కష్టపడి గురి చూసి బాణం వేయడం నేర్చుకుని, వేటగానితో రోజు తిరిగి హంసలను వేటాడసాగాడు. అలా అతను వేటాడటంలో నేర్పు సంపాదించాడు. అతనికి దయలేనందువల్ల వేటలోనే ఆనందాన్ని పొందేవాడు. ఇంకా దోపిడీ దొంగల సాంగత్యంతో వారిలాగే తయారయ్యాడు. ఆ దస్యుల గ్రామంలో సుఖంగా జీవిస్తూ, ఎన్నో మృగాలను వేటాడుతూ ఉన్నాడు. కొంతకాలం తర్వాత ఆ గ్రామానికి ఇంకొక బ్రాహ్మణుడు వచ్చాడు అతను జటలను, నారబట్టలు, మృతచర్మం ధరించి ఉన్నాడు. అతడు స్వాధ్యాయపరుడు, పవిత్రుడు, వినయశీలి, నియమానుసారం ఆహారాన్ని స్వీకరించేవాడు. పైగా బ్రాహ్మణ భక్తుడు. విద్వాంసుడు, బ్రహ్మచారి. అతను గౌతముని గ్రామానికి చెందినవాడు. దేశసంచారం చేస్తూ అతను ఈ దస్యు గ్రామానికి వచ్చాడు. అతను శూద్రాన్నాన్ని భుజించడు కనుక బ్రాహ్మణ గృ హాన్ని వెతుక్కుంటూ చివరకు గౌతముని గృహానికి వచ్చాడు. గౌతముడు అప్పుడే వేటనించి ఇంటికి వచ్చాడు చంపిన హంసలను భుజానవేసుకుని ఒళ్ళంతా రక్తంతో, చేతిలో ఆయుధంతో వచ్చిన గౌతముని చూచి, ఆ బ్రాహ్మణుడు సిగ్గుపడి ఇలా అన్నాడు- ''గౌతమా! ఇది ఏమిటి? నీవు ఉత్తమ వంశంలో జన్మించావు. మధ్యదేశంలో ప్రసిద్ధుడివి. నీవు వేటగాడిగా ఎందుకు మారావు? నీ పూర్వులు అంతా సద్బ్రాహ్మణులు, వేద పారంగతులు... అలాంటి వంశంలో పుట్టిన నీవు ఇలా కుల భ్రష్టుడివి అయినావేమిటి? ఇప్పుడైనా మించి పోలేదు. నీ శీలాన్ని, ఇంద్రియ నిగ్రహాన్ని, శాస్త్రజ్ఞానాన్ని నీ బ్రాహ్మణ కులానికి తగినట్టు అలవర్చుకో. ఈ నివాసాన్ని వదిలి పెట్టు''. మిత్రుడు ఇలా బోధించగా గౌతముడు ఇలా అన్నాడు- ''ద్విజోత్తమా! నేను వేదవేత్తను కాను. పైగా దరిద్రుడను. ఇక్కడికి ధనం కోసమే వచ్చాను. నీ దర్శనం వల్ల కృతార్థుడనైనాను. ఈ రాత్రికి ఇక్కడ ఉండు. రేపు వెళదాము''. అతని మాటలు విని ఆ మిత్రుడు అక్కడ ఏమీ తాకకుండా, భోజనం చేయకుండా ఆ రాత్రి అక్కడ ఉన్నాడు.

రాత్రి గడచిన తర్వాత ఆ బ్రాహ్మణుడు వెళ్లిపోయాడు. గౌతముడు సముద్ర తీరానికి వచ్చి అక్కడ కొందరు తీరవాసులతో కలసి సముద్రం దగ్గరకు వెళ్లాడు. వారంతా వ్యాపారులు వారు అక్కడ కొండ గుహలో కొంతసేపు విశ్రాంతి కోసం ఆగారు. ఇంతలో వారి మీదకు ఒక మదగజం వచ్చి వారిలో చాలామందిని త్రొక్కి చంపేసింది.

కృతఘ్నోపాఖ్యానము



(118) **మహాభారతంలో ఉపాఖ్యానాలు**

డాక్టర్ ముదిగొండ ఉమాదేవి



గౌతముడు దాని బారినుండి ఎలాగో తప్పించుకుని ఉత్తర దిక్కుకు పరుగెత్తాడు. ఆ దేశం నుంచి కూడా తప్పించుకొని అతను అడవిలో తిరుగసాగాడు. తిరిగి తిరిగి మళ్ళీ సముద్రం వైపు వెళ్ళే దారిలోకి వచ్చాడు. అలా వెళ్ళి అతను ఒక సుందరమైన వనంలోకి ప్రవేశించాడు. అది యక్షకిన్నరులకు నివాసమైన ప్రదేశం. అక్కడ అనేక రకాలైన ఫల, పుష్పజాతుల వృక్షాలు ఉన్నాయి.

ఆ సుందర ప్రదేశంలో ఒకచోట గౌతముడు ఒక పెద్ద మఱ్ఱిచెట్టును చూశాడు. దాని మూలం గంధపు నీటితో తడిసి ఉంది. గౌతముడు ఆ చెట్టుక్రింద కూర్చున్నాడు. అక్కడే సుఖంగా నిద్రించాడు. ఇంతలో సూర్యుడు అస్తమించాడు. అప్పుడు ఒక అద్భుతమైన పక్షి బ్రహ్మలోకాన్నుంచి తన నివాసానికి వచ్చింది. ఆ పక్షిపేరు నాడీజంఘుడు. ఆ పక్షి బ్రహ్మదేవునికి ఆప్తమిత్రుడు. కశ్యపుని కుమారుడు. ఆ అసమాన పక్షి ఈ భూమండలం మీద రాజధర్ముడు అన్నపేరుతో ప్రఖ్యాతి చెందాడు. అతడు దేవకన్యాపుత్రుడు కావటం చేత అతని శరీరం కాంతివంతంగా ఉంటుంది. అతను దివ్య ఆభరాణాలతో తన శరీరాన్ని అలంకరించుకున్నాడు. ఆ పక్షిని చూచి గౌతముడు ఆశ్చర్య పోయాడు. అప్పటికే గౌతమునికి బాగా ఆకలిగా ఉంది. కనుక రాజధర్ముని చంపి తినాలని అనుకున్నాడు. అప్పుడు రాజధర్ముడు అతనితో ఇలా అన్నాడు- బ్రాహ్మణా! నీకు స్వాగతం! నా భాగ్యం వలన నీవు నా యింటికి వచ్చావు. సూర్యుడు అస్తమించాడు. ఈ సమయంలో నా యింటికి వచ్చిన అతిథివి. నా ఆతిథ్యాన్ని స్వీకరించు. ప్రొద్దున నీ త్రోవన నీవు వెళ్ళవచ్చు!''. అతని మాటలను ఆశ్చర్యపడి గౌతముడు అతని వైపు కుతూహలంగా చూచాడు. అప్పుడు రాజధర్ముడు ఇలా అన్నాడు.- ''ద్విజోత్తమా! నేను కశ్యపుని పుత్రుడను, మా తల్లి దక్ష ప్రజాపతి పుత్రిక. నీవు మంచి అతిథివి. నీకు స్వాగతం'' ఇలా పలికి అతను గౌతమునికి అతిథి సత్కారాలను చేసి, గంగలో ఉండే పెద్ద చేపలను తెచ్చి అతనికి వడ్డించాడు. గౌతముడు వాటిని ఆనందంగా తిన్నాడు. అతని శ్రమ పోగొట్టటానికి నాడీ జంఘుడు తన రెక్కలతో విసిరాడు. తర్వాత నాడీ జంఘుడు అతని వివరాలు అడిగితే ఆ విప్రుడు తన పేరు గౌతముడని తను బ్రహ్మణుడనని చెప్పాడు. తర్వాత నాడీజంఘుడు అతనికి ఆకులతో, పుష్పాలతో చక్కని శయ్య అమర్చాడు. గౌతముడు సుఖంగా పడుకున్నాడు. అప్పుడు నాడీ జంఘుడు గౌతముని రాకకు కారణమడిగాడు. గౌతముడు ఇలా చెప్పాడు- ''మహాత్మా నేను డబ్బు సంపాదించటానికి సముద్ర తీరానికి బయలుదేరాను.''

అప్పుడు కాశ్యపుడు ఇలా అన్నాడు. ''ద్విజోత్తమా! ద్రవ్యం కోసం అంతదూరం పోనక్కర్లేదు. నీకు తప్పక ధనం లభిస్తుంది. ధనం నాలుగు రకాలుగా సిద్ధిస్తుందని బృహస్పతి చెప్పాడు. 1) వంశపారంపర్యంగా వచ్చేది 2) ప్రారబ్ధానుసారం లభించినది. 3) ధనార్థసకామంగా చేసే కర్మల వల్ల వచ్చేది. 4) మిత్రుని సహాయంతో ప్రాప్తం అయ్యేది. నేను నీకు మిత్రుడిని అయ్యాను. కనుక నీవు ధనవంతుడివి కావటానికి నేను ప్రయత్నిస్తాను.'' మరునాడు ఉదయం రాజధర్ముడు గౌతమునికి సహాయం చేయదలచి ''ఈ త్రోవన వెళ్ళు నీకు ధనం లభిస్తుంది''.

ఇక్కడికి మూడు యోజనాల దూరంలో రాక్షసరాజు విరూపాక్షుడు ఉంటాడు. అతను నాకు ఆప్తమిత్రుడు. అతను నీకు కావలసిన ధనం ఇస్తాడు. అతని మాటలు విని గౌతముడు బయలుదేరాడు. అతను చందనం, ఏలకులు, లవంగం తీగలు కల చెట్ల మధ్యలోంచి వెళ్తూ తియ్యని పండ్లను తింటూ వెళ్లాడు. చివరకు అతను మేరువజ్రం అనే నగరానికి చేరాడు.


-ఇంకావుంది

'వేదాంత' జ్ఞానం...

ప్రశ్న. ఇతర వృత్తులలో ప్రమాదాలు లేక ప్రయోజనాలు ఏమిటి?

సామెత చెప్పినట్టు ''అవతలివైపు గడ్డి మరింత పచ్చగా అనిపిస్తుంది''.

సామాజిక సోపాన క్రమంలో బ్రాహ్మణులు అధికులని భావిస్తారు. చిన్న వయసులోనే అంటే బహుశా ఏమిదేళ్ళ ప్రాయంలో తలవెంట్రుకలు తీయించుకుని సంస్కృత భాష, వేదవిద్య అభ్యసించటం మెదలుపెడతారు. మరియు బహుశా ఎనిమిదేళ్ళ తరువాత మతపరమైన సంప్రదాయాలు నిర్వహించే బాధ్యతలు చేపట్టవచ్చు. ఇతర వృత్తులవలే విజేతలు మరియు పరాజితులు ఉంటారు. ప్రజలు ఇచ్చే విరాళాల మీద ఆధారపడతారు కాబట్టి వారిలో కొందరు



హిందూమత ఔన్నత్యం

డా॥ గరికపాటి ఆనంద్
9966059562
(12)

ధనవంతులు మరియు పేదవారు కూడా ఉండేవారు. మరణించిన వారికి అంత్యక్రియలు చేసే బ్రాహ్మణులను వివాహాది శుభకార్యాలకు పిలవరు ఎందుకంటే మానవసహజమైన పొరపాట్లు వల్ల మంత్రాలు కలగాపులగం అవుతాయేమోనన్న సందేహం, భయం వల్ల. బ్రాహ్మణులు చేసే కర్మక్షతువుల ద్వారా వచ్చే ధనంతో కుటుంబం పోషించడానికి చాలనప్పుడు స్వచ్ఛంద దానాలపై ఆధారపడి వారు భిక్ష యాచించవచ్చు. ఇప్పటికీ అటువంటి భిక్షాటన విధానాన్ని చూస్తున్నాము. సమాజంలో బిచ్చగాడి హోదా ఏమిటి? విషయ వాంఛలతో మునిగే ఈ భౌతిక ప్రపంచంలో అటువంటి హోదా గురించి అసూయ పడవలెనా?

సమాజం ఇచ్చే హోదా మరియు కట్టుబాట్ల కోసం ప్రాపంచిక ఆనందాలను వదులుకోవలెనని ఒక బ్రాహ్మణ కుటుంబం లేక ఆ కుటుంబంలోని పురుషుడు, స్త్రీ మరియు సంతానం నుంచి సమాజం ఆశిస్తుంది. తండ్రి అడుగుజాడల్లో నడవమని, ఇతరులు ఇచ్చే స్వచ్ఛంద దానాలతో సంతృప్తి చెందమని మరియు వస్త్రధారణలో సంప్రదాయాన్ని అనుసరించమని సంతానానికి చెప్పినప్పుడు పిల్లలకు నీ మీద గౌరవం ఉండటం ఎంత కష్టం? తన సంతానం కోసం ఒక తల్లి కోరుకునేది ఇదేనా? ఆమె తన సంతానాన్ని వైదిక పాఠశాల కాకుండా అధునాతన విద్యాసౌకర్యం గల పాఠశాలకు పంపాలని కోరుకోదా?

ఇప్పుడు వ్యాపారవృత్తిని పరిగణిద్దాం. వ్యాపారానికి పెట్టుబడి, సరుకు నాణ్యత మరియు వెల గురించిన జ్ఞానం అవసరం. సంవత్సరాల తరబడి సంపాదించుకున్న నమ్మకంపై నిరంతర విజయం ఆధారపడి ఉంటుంది. అందుకు వారికి జనాలని ఆకట్టుకొనే నైపుణ్యత ఉండాలి. వ్యాపార కుటుంబానికి సంబంధించని వారు క్రొత్తగా వ్యాపారం మెదలుపెడితే పూర్తిగా పెట్టుబడిని కోల్పోయే అవకాశం ఉంది. ప్రస్తుత కాలంలో వ్యాపారంలో పెట్టుబడి చేసేముందు ఆరోపణలు, అపోహలు కలుగకుండా జాగ్రత్త వహించమని వ్యాపార సంస్థలు పెట్టుబడి పెట్టేవారికి సలహాని హెచ్చరిక ఇస్తారు. కొన్ని గణాంకాల ప్రకారం అమెరికాలో 95 శాతం కొత్త వ్యాపారాలు విఫలమవుతున్నాయి. వారు బ్రతుకు తెరువు కోసం వ్యాపారమైనా మార్చాలి లేదా వేరే పని ఏమైనా చేయవలసి వుంటుంది.

వ్యాపారకుటుంబం నుంచి వచ్చిన వారు, సంవత్సరాల తరబడి పెంచుకున్న వ్యాపార పరిజ్ఞానం మరియు పరిచయాల సహాయంతో, వ్యాపారంలో రాగలిగే అనిశ్చిత పరిస్థితులు, అప్పులు మరియు దోపిడి వల్ల కలిగే నష్టాలని ఎదుర్కోగలరు. ఇప్పుడు ఉన్నంత సురక్షితంగా అప్పుడు వ్యాపార సంబంధిత ప్రయాణాలు ఉండేవి కావు. ఇప్పటికీ కొన్ని గ్రామాలకి వెళ్ళేందుకు బస్సు సౌకర్యం లేనందున అక్కడికి వెళ్ళడం సురక్షితమని భావించలేము. ఆ రోజుల్లో ''వ్యాపార భీమా'' అనేది ఎరుగరు. ఇతర వ్యాపార సంస్థలో ఉద్యోగం చేయాలన్న ఆసక్తి ఉంటే మీరు ఎక్కువ డబ్బు సంపాదించక పోవచ్చు. కానీ యితర వృత్తులతో పోలిస్తే హాని కలిగే అవకాశం తక్కువే. ఈ విధమైన ఎంపిక వలన కుటుంబ జీవనం మెరుగుగా ఉంటుంది. ఎందుకుంటే యితర వృత్తులతో పోలిస్తే ఉద్యోగం చేసేవారికి ఇంట్లో ఎక్కువ సమయంగడిపే అవకాశం ఉంటుంది. నీ కుటుంబ సభ్యులతో గడిపే సమయం, కలిసి భోంచేయడం, ఒకే ఇంటికప్పు క్రింద నిద్రించడం వాటిల్లో ఉన్న విలువ ఏమిటి?

పై ప్రశ్నకి సమాధానం చెప్పాలంటే, జీవనభృత్తి కోసం భార్య, చిన్నపిల్లలని ఇంటి దగ్గర వదిలి చాలా కాలం ఎక్కడో దూరంగా ఉండటాన్ని ఊహించుకోండి. చివరి దశలో ఉన్న తల్లిదండ్రుల దగ్గర లేకుండా ఉండడం ఊహించుకోండి. మానవ స్వభావం గురించి తెలుసుకోవటానికి ఒక మానసిక పరీక్షని పరిగణిద్దాం. మధ్యతరగతికి చెందిన ఒక తండ్రి పొదుపు చేసిన డబ్బు గాని ఆస్తిలో భాగాన్ని వృత్తి లేక వ్యాపారం చేసుకోమని తన కుమారుడికి యిస్తాడు. సంస్కృతం మరియు వేదాలు నేర్చుకోవాలంటే అతి చిన్న వయసులోనే అభ్యసించడం మె దలెట్టాలి మరియు ఆ వృత్తిలో భౌతికానందాలు తీరే అవకాశం ఉండదు కాబట్టి ఈ పరీక్ష ఒక 18 సంవత్సరాల యువకుడు మీద జరుగున్నట్లయితే అతను ఆ వృత్తిని పరిగణనలోకి తీసుకోవటానికి అవకాశం లేదు. ఇతర వికల్పాలు మరియు అవసరమైన నైపుణ్యాలు నేర్చుకొనే అవకాశాలు అందుబాటులో ఉంటాయి. నీ కోసం ఏ వృత్తిని ఎంచుకుంటావు మరియు నీ కుమారుని ఏ వృత్తి చేయమని ప్రోత్సాహిస్తావన్నది ప్రశ్న.

ఇటువంటి ప్రశ్నలకు సరైన లేక తప్పు సమాధానం అని ఉండదు. ఈ ఎంపికలు చేయవలసి వచ్చినప్పుడు మీరు నిర్ణయం తీసుకొనే ముందు దాని వల్ల వచ్చే పరిణామాలు ఎదుర్కోవలసి ఉంటుందని మీకు స్పష్టంగా తెలుస్తుంది. మంచి అవగాహన కోసం, పై ప్రశ్న ప్రత్యామ్నాయకంగా చెప్పవచ్చు. పైన పేర్కొన్న చర్యలు లేదా వృత్తులలోనున్న ప్రజలు పాల్గొన్నప్పుడు, వేదాలు చదివే మరియు పఠించే ప్రజలకు వేదాంతము లేదా ఆధ్యాత్మిక విజ్ఞానాన్ని మరియు సమాజ రక్షణలో పాల్గొన్నవారికి విజయాన్ని, వ్యాపారాన్ని ఎంచుకునేవారికి ధనాన్ని మరియు కార్మికులకు సుఖాన్ని, వేదాలు దీవిస్తాయి. క్రింది కారణాలవల్ల పైన దీవెనలు చాలా ఆశ్చర్యకరంగా ఉంటాయి.

ఇది ఆసక్తికరంగా లేదా? శ్రీకృష్ణుడు గోవులను ఎంతగా ప్రేమించాడంటే అతనిని 'గోవిందుడు', 'గోపాలుడు' అని పిలుస్తున్నారు. కేవలం ఈ మాటలు ఉచ్చరిస్తేనే శ్రీకృష్ణుడు సంతోషపడతాడు. ఎవరైతే గోవులను పెంచి పాలిస్తారో వారిని వేదాలు దీవిస్తాయి. ఐశ్వర్యంతో, మీకు 'ఇహము' మరియు 'పరము' రెండూ ఉంటాయి.

అంటే ఆధ్యాత్మిక మార్గంలో ఉంటూ ఐశ్వర్యం సంపాదించటం. హిందూ విశ్వాసం ఒక సామాన్య మానవుని గురించి పట్టించుకుంటుందా అనే సంశయం కొందరికి. మీ అంతట మీరే నిర్ణయించు కోండి. వేదాలు నేర్చుకుని పఠించేవారికి 'వేదాంతం' యొక్క జ్ఞానంతో దీవించబడతారని అనేది ఒక వేద వాక్కు. కానీ వేదాంతాన్ని ప్రాపంచిక సుఖాలను ఇచ్చే ఐశ్వర్యంగా మార్చటం కష్టం కానీ గోవు ఆ రెంటినీ ఇస్తుంది.

ఇంకావుంది...

స్వాధ్యాయ సందోహం

హిందీ మూలం: స్వామీ వేదానంద తీర్థ తెలుగు అనువాదం:
డా॥ పాలకోడేటి జగన్నాథరావు 9490620512

(209)

గుఱ్ఱాలను సంతోషంగా ఉంచి యుద్ధ విజేతవు కమ్ము

ప్రీణీతాశ్వాన్హితం జయాథ స్వస్తివాహం రథమి త్కృణుధ్వమ్।

ద్రోణాహావమవతమశ్మచక్రమంసత్రకోశం సించతా నృపాణమ్॥

భావం:- గుఱ్ఱాలను సంతోషపరచి విజయాన్ని సాధంచు. రథాలను శుభప్రదంగా సుఖదాయకంగా నిర్మించు. దేశసంరక్షణలో ప్రధాన పాత్రధారులైన ప్రజలను ఎల్లప్పుడు ఉత్తేజితులనుగా చేయి. ఆగ్నేయాది అస్త్రాలను, అనేక కవచాలను, జన రక్షక సాధనాలను ఎప్పటికప్పుడు శక్తివంతంగా సిద్ధపరచు.

వివరణ:- యుద్ధ విజయ సాధనాలను గురించి ఈ మంత్రం సంక్షిప్తంగా చెప్పినా చాలా శక్తివంతంగా చెప్పింది. విజయాన్ని కోరుకొనేవాడు ముందుగా 'ప్రీణీతాశ్వాన్' ''గుఱ్ఱాలను ప్రసన్నం చేసుకో''మంటున్నది వేదం. ఇక్కడ గుఱ్ఱమంటే ఏదో ఒక గుఱ్ఱం కాదు అది 'అశ్నుతే అధ్వానమ్'అన్న నిర్వచనానుసారం లక్ష్యాన్ని చేర్చేదిగా ఉంచాలి. ఇక్కడ 'అశ్వ'మని ఒక్కటే చెప్పబడినా విజయ లక్ష్యాన్ని సాధింపచేసే విద్యుత్, అగ్ని, రథం, సైనికులు, ప్రజలు ఈ అందరికి ఉపలక్షకమే. అంటే వేద పరిభాషనుసారంగా ఇవన్నీ అశ్వాలే. ఈ అన్నింటిని విజిగీషువు ముందుగా ప్రసన్నంగా ఉంచుకోవాలంది వేదం. ఎందుకంటే ఒక్క అశ్వాన్నే చూడండి. ఆకలిగొన్న అశ్వం అశ్వికుడికిగాని రథానికి గాని నిరుపయోగమే కదా! రథాలు కూడ గుఱ్ఱాలు లేకుండ ఎందుకుపయోగపడతాయి? గుఱ్ఱాలున్నా అవి ఉత్సాహవంతంగా శక్తివంతంగా ఉన్నప్పుడేకదా అవి మంచి యుద్ధోపకరణాలవుతాయి. అందుకే వేదం ''ప్రీణీతాశ్వాన్''అని మంత్రం చెప్పి ఊరుకోక 'హితం జయాథ' హితం= ''మేలు కొఱకు'' అంటే యుద్ధ విజయంకోసం అశ్వాదులను జయాథ= 'సంపాదించు' అని కారణాన్ని పేర్కొంది. అశ్వమంటే రథాదులకు కూడ వాచకమేనని పైన చెప్పుకొన్నాం గదా. వానినికూడ 'స్వస్తి వాహం రథమిత్కృణుధ్వమ్'

''సౌకర్యవంతంగా నడిచేవిగా సిద్ధపరచుకో'' అని వివరణాత్మకంగా వేదం పేర్కొంది.

రాజ్య సుస్థిరతకు గాని, రాజ్యశక్తికి గాని మూలం అవత= ప్రజలే. రాజ్యంలో శాంతిభద్రతలకు మూలం కూడ వారే. ఈ అన్నింటిని రాజ్యానికి ఎప్పటికప్పుడు ధననిధిగాని, జనోత్పాదననిధి గాని ప్రజలే. ప్రీణీతాశ్వాన్ అని వేదం చెప్పిన వారిలో వీరు చేరతారు. కాబట్టి విజయాభిలాషి అయిన రాజు ప్రజలనెల్లప్పుడు ఉత్సాహవంతులుగా, శక్తివంతులుగా సంసిద్ధులై యుండే విధంగా చేయాలి. అప్పుడే రాజ్యసుస్థిరతకు ధనబలం, యుద్ధ విజయాలకు ప్రజా (సైనిక) శక్తి వారి నుండి నిరంతరంగా సమకూరుతుంది. అందుచేత రాజు వారిని సుఖసంతోషాలతో ఉండే విధంగా తీవ్రంగా ప్రయత్నించాలి. అందుకొఱకై రాజు ఎటువంటి ప్రయత్న లోపం చేయరాదు.

ఆయుధాలలో విద్యుత్తుతో పనిచేసేవి కూడ ఉన్నాయి. వాటిని వేదం 'అశ్మ' అని వ్యవహరిస్తుంది. (బహుశః వేదకాలంలో విద్యుత్తు ఉండి ఉండవచ్చు). వాటిని రాజు ప్రయోగానికి సిద్ధంగా శక్తివంతం చేసి ఉంచాలి. వానితోబాటు 'నృపాణ' కవచాదులను కూడ అత్యధికంగా వినియోగానికి అనుకూలంగా నిర్మాణం చేసి ఉంచాలి.

యుద్ధ విజయ సాధనాలను పరిపుష్టం చేయి

వ్రజం కృణుధ్వం స హి వో నృపాణో వర్మ సీవ్యధ్వం

బహులా పృథూని। పురఃకృణుధ్వమాయసీ రధృష్టా మా వః

సుస్రోచ్చమసో దృంహతా తమ్॥

భావం:- ప్రజాభిప్రాయాన్ని, జనశిబిరాలను ఏర్పాటుచేయి. నీ జనరక్షణ సాధనాలయిన కవచాదులను విస్తారంగా కుట్టించు. దుర్భేద్యమైన రీతిగా నీ నగరాలను తీర్చి దిద్దు. నీ భోజన పాత్రల నుండి పదార్థాలు జారిపోకుండ వానిని గట్టిపరచు.

వివరణ:- పూర్వ మంత్రంలో 'సించతా నృపాణమ్' ''జనరక్షక సాధనాలను ఉత్సాహవంతంగా సిద్ధపరచుము''అని ఆదేశింపబడింది. ఈ మంత్రంలో ఆ నృపాణ శబ్దానికి మరింత వివరణ చేయబడుతూ ఉంది. ఆ 'నృపాణాన్ని' ఈ మంత్రం 'వ్రజ'మని వ్యవహరించి 'వ్రజం కృణుధ్వం స హి వో నృపాణః' ''జనరక్షా సాధనాలను స్థాపించు. పశువులశాలలను నిర్మించు. సైనిక శిబిరాలను ఏర్పరచు. అదే నీ నృపాణం''అని విపులీకరించింది. వ్రజ శబ్దానికి జనాభిప్రాయం అని మరో అర్థం కూడ ఉంది. అంటే అన్ని విషయాలకంటే ముందుగా జనాభిప్రాయాన్ని నీ పక్షమై ఉండే విధంగా చూచుకోమని అర్థం. నిజమైన 'నృపాణం' ఇదే. తక్కినవన్నీ దానికి ఉపకరణాలే.

ఇంకావుంది...

పరమహంస బోధామృతము

219. నెమ్ముకొనిన అగ్గిపుల్ల నెంత గీసినను పొగవచ్చునే కాని వెలుగదు. కాని పొడిగానున్న అగ్గిపుల్ల నెంత మెల్లగా గీసినను వెంటనే బుస్సున మండును. ఉత్తమ భక్తుని హృదయమే ఈ యెండిన యగ్గిపుడక. లేశమగు భగవన్నామోచ్చారణమైనను సరియే, వాని హృదయమున భక్త్యగ్నిని ప్రజ్వలింపజేయును. కామినీ కాంచనములలో మునిగితేలుచున్న వాని మనస్సో, నెమ్ముకొనిన అగ్గిపుల్లవలె ప్రబోధ తేజమును పొందదు. అట్టివానికి భగవంతుని గూర్చియెన్ని బోధలు చేసినను భక్త్యగ్ని వాని హృదయమున రగుల్కొననేరదు.

220. లౌకికునకు జ్ఞాని కున్నంత తెలివియు జ్ఞానమునుండవచ్చును, యోగిపడునంత శ్రమను కష్టమును ఆతడు పడవచ్చును, సన్న్యాసి చేయునంత మహాత్యాగమును చేయవచ్చును. కానీ వాని శ్రమయంతయు నిరర్థకము, ఏలన, వాని శక్తిసామర్థ్యములన్నియు పెడత్రోవను నడచుచున్నవి. ఆతడెన్ని పాట్లు పడినను భగవంతునికోసము గాక, సిరిసంపదలు, ఖ్యాతి మొదలగు క్షుద్రమగు భౌతిక విషయముల కోసమే!

221. మకిలపట్టిన అద్దము సూర్యకిరణములను ప్రతిఫలింపజేయజాలదు. అట్లే మాయామోహితులగు మలిన హృదయులును అపవిత్రహృదయులను భగవన్మహిమమును గనజాలరు. కాని నిర్మలమగు నద్దము సూర్యుని ప్రతిఫలింపజేయు రీతిని పవిత్ర హృదయములు భగవంతుని గనజాలుదురు. కావున పవిత్రుడవు కమ్ము.

222. రెట్టింపు నీటితో గలిసిన పాలను గడ్డకట్టిన పాలుగా మార్చుటకు చాలసేపు పట్టును, చాల శ్రమపడవలసి వచ్చును. లౌకికుని మనస్సు దుష్టచింతలు, పాపపుటాలోచనలు అను ముఱికి నీటితో గలిసి చాల పలుచబడిపోయి యుండును. దానిని పరిశుద్ధమొదర్చుకొని ఉత్తమమ్మైన పవిత్ర హృదయమునకు లక్షణమగు బలస్థైర్యములను గలుగజేసికొనుటకు వానికి చాలకాలము పట్టును, అందులకై చాలశ్రమపడవలసి యుండును.

223. ప్రశ్న: లౌకికులు భగవంతుని గాంచుటకై సర్వము ఎందుచే త్యాగముచేయరు?

ఉ: నాటక రంగమునకు వచ్చిన నటుడు వెంటనే తన వేషమును తీసివేయగలడా? లౌకికులను తాము దాల్చిన పాత్రల కనుగుణముగా నటింపనిండు, కాలపరిపాకమున వారు తమ మాయావేషములను తీసివేయుదురు.

224. పూర్తిగా సంసార బంధమున జిక్కిన నరుడు అశుద్ధమున బుట్టి శుద్ధమున జచ్చు పురుగువంటివాడు; వానికి మఱేమియు తెలియదు. అంతటి పరమ నీచమైన లోలత లేని సామాన్య సంసారి ఒకప్పుడు అశుద్ధముమీదను, ఒకప్పుడు మిఠాయి మీదను వ్రాలుచుండు ఈగ వంటివాడు. ముక్తుడు మాత్రమే సదా మకరందమును గ్రోలుచు, ఇతరమును చవిచూడని తేనెటీగను బోలును. (చూ.213, 217)

225. లౌకికుడు మొసలివంటివాడు. ఎట్టి ఆయుధములకైనను దాని చర్మము దుర్భేద్యముకదా! కడుపుపై గొట్టిననే కాని అది చావదు. అదే విధమున లౌకికునకు నీవు ఎంత హితబోధ చేసినను వానిపై వానికెంత వెగటు పుట్టించినను ఆతడు అంటిపట్టుకొనిన విషయములనుండి యీవలకు లాగిననే కాని తన పరిస్థితులనాతడు గుర్తింపజాలడు.

226. సమస్తమును త్యజించి భగవంతుని పాదారవిందములను ఆశ్రయింపుడని లౌకికులను మీరు కోరినయెడల వారు మీ మాటలను విందురా? వినరు. కావున ఎంతయో ఆలోచించి, అట్టివారి నాకర్షించు నిమిత్తము గౌరనితాయులు (చైతన్యనిత్యానందులు) ఒక యుపాయమును పన్నిరి. ''అన్నలారా! రండు! హరినామస్మరణము చేయుడు.

-ఇంకావుంది

అది దురదృష్టమే..



స్టార్ హీరో రామ్‌చరణ్‌ను వినయ విధేయ రామ బాధ వెంటాడుతోంది. -వి.వి.రాతో మీ అంచనాలను అందుకోలేకపోయాను. మీరు అందించే ఆదరాభిమానాలే ప్రేరణగా భవిష్యత్‌లో అంతా మెచ్చే కథలతోనే సినిమాలు చేస్తా'నంటూ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశాడు. తన భవిష్యత్ చిత్రాలకు ప్రేక్షకుల ఆదరణ, ప్రేమాభిమానాలే ప్రేరణకానుందని ప్రకటించాడు. 'ప్రియమైన అభిమానులు, ప్రేక్షకులకు.. వినయ విధేయ రామ చిత్రంపట్ల మీరు చూపించిన అభిమానానికి వినయపూర్వక ధన్యవాదాలు. ఆ సినిమా కోసం రేయింబవళ్లు కష్టించిన సాంకేతిక నిపుణులు అందరికీ కృతజ్ఞతలు. నిర్మాత దానయ్య, చిత్రాన్ని నమ్మిన పంపిణీదారులు, ప్రదర్శనదారుల సహకారాన్ని మాటల్లో చెప్పలేను. వినోదంపంచే చిత్రంగానే నమ్మి ఎంతో శ్రమించాం. దురదృష్టవశాత్తూ అది మీ అంచనాలను అందుకోలేకపోయింది. మీ ఆదరణనే ప్రేరణగా తీసుకుని భవిష్యత్ చిత్రాలకు శక్తివంచన లేకుండా కృషి చేస్తా. చిత్రానికి పూర్తి మద్దతు అందించిన మీడియాకు ప్రత్యేక కృతజ్ఞతలు' అంటూ రామ్‌చరణ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రామ్‌చరణ్, కైరా అద్వానీ జోడీగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో వినయ విధేయ రామ చిత్రం రావడం తెలిసిందే. సంక్రాంతి సీజన్‌లో వచ్చినప్పటికీ సినిమా ఆశించిన స్థాయిలో విజయం సాధించలేకపోవడం తెలిసిందే.

తెరపైకి.. మల్లేశం కథ



పద్మశ్రీ చింతకింది మల్లేశం జీవితం ఆధారంగా తెరకెక్కుతున్న సినిమా మల్లేశం. అగ్గిపెట్టెలో పట్టేంత చిన్న చీరల్ని ఆవిష్కరించి ప్రపంచాన్ని అబ్బురపర్చిన వ్యక్తి మల్లేశం. చేనేత నైపుణ్యాన్ని దేశానికి చాటిన ఘనత మల్లేశానిది. ఇలాంటి నేత ఘనాపాటీ జీవితం ఆధారంగా మల్లేశం సినిమా తెరకెక్కుతుంది. చిత్రాన్ని రాజ్ తెరకెక్కిస్తుంటే, శ్రీ అధికారి, రాజ్ ఆర్ నిర్మిస్తున్నారు. మల్లేశం పాత్రలో ప్రియదర్శి నటిస్తున్నాడు. అనన్య, ఝాన్సీ, చక్రపాణి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. షూటింగ్ ప్రస్తుతం చివరి దశలో ఉంది. చిత్ర యూనిట్ సిరిసిల్ల జిల్లాలో చిత్రం ఫస్ట్‌లుక్ విడుదల చేశారు. బాబు శాడిలాస్య ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫీ అందిస్తుంటే, లక్ష్మణ్ ఏలే ప్రొడక్షన్ డిజైనర్‌గా పని చేస్తున్నారు. విమర్శకుల ప్రశంసలందుకున్న సౌండ్ డిజైనర్ నితిన్ లుకోస్ చిత్రానికి సౌండ్ డిజైన్ చేస్తున్నారు. మార్క్ కే రానిన్ సంగీతం సమకూర్చారు. పెద్దింటి అశోక్‌కుమార్ ఈ చిత్రానికి సంభాషణలు రాస్తున్నారు. ప్రముఖ రచయిత గోరటి వెంకన్న, చంద్రబోస్ పాటలు రాశారు.



యాత్రకు భలే క్రేజ్

దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాదయాత్ర ఇతివృత్తంతో మహి వి రాఘవ్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం యాత్ర. 8న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్ చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. మలయాళ సూపర్‌స్టార్ మమ్ముట్టి వైఎస్‌ఆర్ పాత్రలో జీవించారు. ట్రైలర్‌కు మంచి స్పందన వచ్చిన తరుణంలో, ప్రీమియర్ షో మొదటి టికెట్‌ను సీటెల్‌లో వేలం వేశారు. వేలంలో మునీశ్వర్‌రెడ్డి 6,116 డాలర్లకు (దాదాపు 4.37 లక్షలు) మొదటి టికెట్‌ను సొంతం చేసుకున్నారు. ఇందులో కొంత మొత్తాన్ని వెఎస్సార్ ఫౌండేషన్‌కు విరాళంగా ఇస్తామని నిర్మాతలు ప్రకటించారు. నిర్మాతలు విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి మాట్లాడుతూ వైఎస్‌ఆర్ పాత్రలో మమ్ముట్టి నటించిన యాత్రను 8న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నాం. సినిమాపై భారీ అంచనాలున్నాయి. మా బ్యానర్ నుంచి భలేమంచిరోజు, ఆనందోబ్రహ్మ వంటి మంచి చిత్రాలు వచ్చాయి. ఇప్పుడు యాత్ర హ్యాట్రిక్ విజయంగా నిలుస్తుందన్న నమ్మకంతో ఉన్నాం. చిత్రం బడ్జెట్ విషయంలో ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా, ఉన్నతస్థాయి నిర్మాణ విలువలు పాటించామన్నారు.

ఫ్రీక్ పిల్లా.. ఇలా

కన్నుకొట్టి సినీ ప్రపంచాన్ని ఫిదా చేసిన ప్రియా ప్రకాశ్ వారియర్ తొలి సినిమా 'ఒరు ఆడార్ లవ్' ప్రేమకుల రోజు చిత్రంగా ఫిబ్రవరి 14న విడుదల కాబోతున్న సంగతి తెలిసిందే. సుఖీభవ సినిమాస్ సంస్థ సారథ్యంలో ఓమర్ లులు దర్శకత్వం వహించిన చిత్రంలో హీరో రోషన్ అబ్దుల్ రహూఫ్. 'లవర్స్ డే' టైటిల్‌తో విడుదలకానున్న చిత్రానికి సంబంధించి తెలుగు వర్షన్‌లోని ఓ పాటను చిత్ర యూనిట్ తాజాగా విడుదల చేసింది. షాన్ రెహమాన్ సంగీత సారథ్యంలో దినకర్, నీతు పాడిన 'ఫ్రీక్ పిల్లా' పాట యూట్యూబ్‌లో హల్‌చల్ చేస్తోంది. గత ఏడాది ఫిబ్రవరి 14న విడుదల చేసిన 'ఒరు ఆడార్ లవ్' ప్రోమో ఎంత సెన్సేషన్ అయ్యిందో అందరికీ తెలిసిందే. ప్రియ కన్నుకొట్టిన తీరు యువతను కట్టిపడేసింది. సోషల్ మీడియాలో ప్రియ సీన్ వైరల్‌గా మారి, ఓవర్‌నైట్ ఆమె స్టార్ అయిపోయింది. ప్రోమోకు వచ్చిన పాపులార్టీతో మలయాళంలో విడుదల చేయాల్సిన చిత్రాన్ని ఇతర భాషల్లోనూ అనువదించి విడుదల చేయాలని నిర్మాతలు నిర్ణయించారు. అలా సరిగ్గా ఏడాది తరువాత ఫిబ్రవరి 14న తెలుగు సహా ఇతర భాషల్లోనూ ఈ చిత్రం విడుదల కానుంది. ప్రస్తుతం ప్రియా వారియర్ 'శ్రీదేవి బంగ్లా' చిత్రం చేస్తూ, మైత్రి మూవీ మేకర్స్ సంస్థలో నాని హీరోగా రూపుదిద్దుకోనున్న ప్రాజెక్టులో ఒక హీరోయిన్‌గా అవకాశం దక్కించుకుంది.



జోరుగా.. హుషారుగా



బెక్కెం వేణుగోపాల్, రియాజ్ నిర్మాతలుగా రూపొందిన 'హుషారు' 50 డేస్ సెలబ్రేషన్‌ను నిర్వహించారు. తేజస్ కంచర్ల, తేజ్ కూరపాటి, అభినవ్ మంచు, దినేష్ తేజ్, దక్ష నగార్కర్, ప్రియా వడ్లమాని, హేమ ఇంగ్లే ప్రధాన తారాగణంగా రూపొందిన చిత్రానికి దర్శకుడు శ్రీహర్ష కొనుగంటి. నిర్మాత బెక్కెం మాట్లాడుతూ 'హుషారు'ను సక్సెస్ చేసిన ఆడియన్స్‌కి కృతజ్ఞతలు తెలిపారు. హార్డ్ వర్క్‌కి తగిన ఫలితం అందించారు. దర్శకుడు శ్రీహర్ష, సహకరించిన యూనిట్‌కు కృతజ్ఞతలు అన్నారు. దిల్‌రాజు మాట్లాడుతూ 'ఫస్ట్ సాంగ్ విన్నపుడే సినిమా బావుంటుందని అంచనా వేశాను. ఈరోజుల్లో సినిమా ఆడటమే కష్టం. అలాంటిది 50 రోజులు పూర్తి చేసుకోవడం అసాధారణ విజయం అన్నారు. హీరోయిన్ ప్రియా వడ్లమాని మాట్లాడుతూ చిన్న సినిమాను 50 రోజులు ముందుకు నడిపించి విజయాన్ని అందించిన ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలిపారు. దర్శకుడు శ్రీహర్ష మాట్లాడుతూ 'ఈ సినిమాకు పనిచేసిన ప్రతి క్షణం బెస్ట్ మెమరీ. నేను చెప్పిన 5 నిమిషాల కథ విని ఎగ్జైట్‌మెంట్‌తో సినిమా చేసిన నిర్మాత, ఎంతో అనుభవం ఉన్నప్పటికీ మాతో స్నేహితుల్లా కలిసిపోయి సహకరించిన టీంకు కృతజ్ఞతలు తెలిపారు



పోలీసే ఉన్మాది అయితే..



పోలీస్ అంటే రక్షణ. ఆపదలో ఉన్నవారికి అభయహస్తం అందించి రక్షణ కల్పించే పోలీసు కర్కశంగా, ఉన్మాదిగా ఎందుకు మారాడు? అసలు అలా మారడానికి దారితీసిన పరిస్థితులేంటి? అన్న విషయాలు తెలియాలంటే 'ఉన్మాది' చిత్రం చూడాలని దర్శకుడు ఎన్‌ఆర్ రెడ్డి అంటున్నాడు. ప్రవీణ క్రియేషన్స్ పతాకంపై ప్రొడక్షన్ నెంబర్ 2గా ఎన్ కరణ్‌రెడ్డి సమర్పణలో రూపొందుతున్న చిత్రం ఉన్మాది. సెన్సార్ సహా అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఫిబ్రవరి 8న విడుదలవుతోంది. చిత్ర దర్శక నిర్మాత ఎన్ ఆర్ రెడ్డి మాట్లాడుతూ 'ఇది గ్రామీణ నేపథ్యంలో సాగే కథ. సినిమా పూర్తి కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా ఉంటుంది. డేవిడ్ సంగీతం అందించిన ఈ సినిమా పాటలు, ట్రైలర్‌కు ఇప్పటికే మంచి స్పందన వచ్చింది. సినిమాను ఫిబ్రవరి 8న విడుదల చేయబోతున్నాం' అన్నారు. టైటిల్ పాత్రలో ఎన్‌ఆర్ రెడ్డి నటిస్తూ దర్శకత్వం వహించారు. అల్లు రమేశ్, శివ, శిరీష, నాగిరెడ్డి, రమ్య, ప్రమీల, పుష్పలత, సోను, రాజేశ్వరి తదితరులు మిగతా పాత్రల్లో నటించారు.

22న 4 లెటర్స్

ఓం శ్రీచక్ర క్రియేషన్స్ బ్యానర్‌పై రూపొందుతోన్న చిత్రం '4 లెటర్స్'. 'కుర్రాళ్ళకు అర్ధమవుతుందిలే' అన్నది ఉప శీర్షిక. ఈశ్వర్, టువ చక్రవర్తి, అంకిత మహారాణా హీరో హీరోయిన్లుగా పరిచయమవుతున్న చిత్రాన్ని ఆర్ రఘురాజ్ దర్శకత్వంలో దొమ్మరాజు హేమలత, ఉదయ్‌కుమార్ నిర్మిస్తున్నారు. ప్రముఖ కథానాయకుడు విక్టరీ వెంకటేష్ టీజర్, ట్రైలర్‌ను చూసి చిత్ర కథానాయకుడు దర్శక, నిర్మాతలను అభినందించారు. చిత్రం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. సినిమా సెన్సార్ పూర్తి చేసుకుని 'ఎ' సర్టిఫికెట్ పొందింది. ఈనెల 22న చిత్రాన్ని విడుదల చేస్తున్నట్టు నిర్మాత ఉదయ్‌కుమార్ తెలిపారు. నిర్మాతలు మాట్లాడుతూ మా బ్యానర్‌లో ఇది తొలి చిత్రం. సత్యానంద్ వద్ద శిక్షణ తీసకున్న హీరో ఈశ్వర్, ఈ సినిమా కోసం హార్డ్‌వర్క్ చేశాడు. కమర్షియల్ హంగులతో యూత్ సహా అన్ని వర్గాలను ఆకట్టుకునే ఎంటర్‌టైనర్‌గా సినిమా రూపొందించామన్నారు. హీరో ఈశ్వర్ మాట్లాడుతూ సీనియర్ హీరో వెంకటేష్ ఆశీస్సులు అందుకోవటం హ్యాపీగా ఉందన్నారు. చిత్రం ప్రేక్షకాదరణకు నోచుకుంటుందన్న నమ్మకంతో ఉన్నామన్నారు. దర్శకుడు ఆర్ రఘురాజ్ మాట్లాడుతూ 'కలుసుకోవాలని' తర్వాత తెలుగులో నేను డైరెక్ట్ చేసిన మూవీ 4 లెటర్స్. ఇది నేటి తరం ప్రేమకథా చిత్రం. ప్రేమ పెళ్లి విషయంలో నేటితరం ఆలోచనలు కథలో ప్రతిబింబిస్తాయి' అన్నారు.

సేవకు మనం సైతం



నిరుపేదలకు తమవంతు సహకారం అందిస్తూ, మేమున్నామంటూ ఆపన్న హస్తం అందిస్తోంది -మనం సైతం. నటుడు కాదంబరి కిరణ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న సేవా సంస్థ వివిధ సమస్యల్లో చిక్కుకున్న పేదలకు అనేక విధాల సహాయ సహారాలు అందిస్తూ మానవతను చాటుతోంది. విద్య, వైద్యం, క్రీడారంగాల్లో పదిమంది అవసరార్థులను గుర్తించి హైదరాబాద్ ఫిలిం చాంబర్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఈ సంస్థ ఆర్థిక సాయం అందించింది.

కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ మాజీ మంత్రి లక్ష్మారెడ్డి సతీమణి శ్వేతా లక్ష్మారెడ్డి, తెలంగాణ ఎఫ్‌డీసీ ఛైర్మన్ రామ్మోహన్‌రావు, దర్శకులు దశరథ్, దీప్తివాజ్‌పేయి తదితరులు పాల్గొని పేదలకు చెక్కులు అందించారు.

అనంతరం కాదంబరి కిరణ్ మాట్లాడుతూ పరిశ్రమలో సుదీర్ఘ అనుభవాన్ని చూశాను. టీవీ కార్యక్రమాల నిర్వహణలో ఆర్థికంగా నష్టపోయాను. నా పక్కన నిలబడతారనుకున్న కొందరు కావాల్సిన సమయంలో దూరంగా వెళ్లారు. వీళ్లందరితో నేను ఎదుర్కొన్న ఆ అనుభవాలను పుస్తకంగా రాద్దామనుకున్నాను. కానీ అలా చేస్తే అందరికీ దూరం కావాలి. మరోవైపు చూస్తే లక్షలాది మంది సాయంకోసం ఎదురుచూస్తున్నారు. నేను ఎదుర్కొన్న బాధల నుంచి కోపం, కసి, ప్రతీకారం, ఆవేదనకు మరో కోణంలో మొదలైందే మనం సైతం. నేను చేస్తున్నది ఏపాటి సాయమైనా వాళ్లకు ధైర్యాన్ని అందిస్తున్నాం. మేము అందిస్తున్న సాయానికి ఎన్నోరెట్లు దీవెనలు పొందుతున్నాం. మా బృందం ఏడుగురితో మొదలైన మనం సైతం ఇవాళ లక్షా డెబ్బైవేల మంది సభ్యులకు విస్తరించింది. ఈ సంస్థ పేదల గుండెల్లోకి ఎంతగా వెళ్లిందంటే, లక్ష్మారెడ్డి నియోజకవర్గం జడ్చర్లకు వెళ్తే, అక్కడ దాదాపు 70మంది యువత వచ్చి మనం సైతం జడ్చర్ల శాఖ పెడతామన్నారు. అంతకంటే ఇంకేం కావాలి అన్నారు.

ఎఫ్‌డీసీ ఛైర్మన్ రామ్మోహన్ రావు మాట్లాడుతూ ఇంత గొప్ప సేవా కార్యక్రమం చేస్తున్న కాదంబరి కిరణ్‌కు అభినందనలు. పేదలకు డబ్బులే కాదు, ఆత్మీయత పంచుతున్నారు. అవసరార్థుల ఇంటికెళ్లి ఆదుకుంటున్నారు. చిత్ర పరిశ్రమలో కొన్ని విభాగాల కార్మికులకు ఆరోగ్య బీమా సౌకర్యం లేదు. అలాంటి శాఖల కార్మికులకు తెలంగాణ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నుంచి సగం ఖర్చు మినహాయింపుతో ఆరోగ్య బీమా అందిస్తామని ఈ సందర్భంగా చెబుతున్నా. చిత్రపురి కాలనీలో ఒక వైద్యశాల నిర్మించే ప్రయత్నం చేస్తున్నాం. పేద సినీ కార్మికులకు వైద్యం అందజేసేందుకు కృషిచేస్తామన్నారు.



అట్లీ దర్శకత్వంలో..

తమిళ స్టార్ హీరో విజయ్ నటిస్తున్న 64వ చిత్రం మొదటి షెడ్యూల్ ప్రస్తుతం చెన్నైలో జరుగుతుంది. స్పోర్ట్స్ డ్రామాగా యువ దర్శకుడు అట్లీ తెరకెక్కిస్తున్న చిత్రానికి ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. తాజాగా రెహమాన్ ఈ చిత్రం గురించి ఆసక్తికర విషయాలను వెల్లడించారు. ఇంతకుముందు ఎన్నడూ సౌత్ ఇండియా సినీ చరిత్రలో ఇలాంటి స్క్రిప్ట్‌రాలేదని ఈ చిత్రం 'లగాన్ , పీకే' తరహాలో ఉండనుందని తాజాగా జరిగిన ఇంటర్వ్యూలో వెల్లడించారు. దీన్నిబట్టి ఈ చిత్రం అట్లీ, విజయ్‌కి హ్యాట్రిక్ విజయాన్ని అందించడం ఖాయంగా కనిపిస్తుంది. ఇంతకుముందు వీరి కాంబినేషన్‌లో తెరకెక్కిన 'తెరి, మెర్సల్' సూపర్ హిట్ అయ్యాయి. ఏజీఎస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మిస్తున్న చిత్రంలో లేడీ సూపర్‌స్టార్ నయనతార కథానాయికగా నటిస్తుంది. భారీ అంచనాల మధ్య ఈ చిత్రం ఈ ఏడాది దీపావళికి విడుదలకానుంది.

